


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



అణు కేంద్రాలు పునర్నిర్మిస్తాం : ఇరాన్

ట్రంప్ విధానాలు వినాశకరం : ఒబామా

మెక్సికోలో పేలుడు : 23 మంది మృతి

2లో



సంపుటి 08, సంచిక: 332 | సోమవారం | 03-11-2025 | కరీంనగర్ | Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో

# గెలుపు కాంగ్రెస్‌దే

గత బిఆర్ఎస్ అవినీతిని, కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని విస్తృతంగా ప్రచారం చేయాలి ● మంత్రులతో సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్



జూబ్లీహిల్స్ శాసనసభ ఉపఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, బిఆర్ఎస్ అవినీతిని ప్రజలు ఇంకా మరచిపోలేదని తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంత్రులతో సిఎం రేవంత్ రెడ్డి ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, కాంగ్రెస్ ప్రచార శైలి, అక్కడి తాజా రాజకీయ పరిస్థితులు, ప్రత్యార్థుల బలబలాలు తదితర అంశాలపై సిఎం చర్చించినట్టు తెలిసింది. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫేక్ సర్వేలపైన చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, నియోజకవర్గంలోని సమస్యలను ప్రజలకు వివరించాలని సిఎం సూచించారు. సర్వేల పేరుతో ప్రతిపక్ష పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని,బిఆర్ఎస్,బిజెపికి ఓటు వేయడం ద్వారా ఎటువంటి ఉపయోగం లేదని,

తరువాయి 2లో



## బిసి కోటాకు రాజ్యాంగ సవరణ చేయాల్సిందే

ఈనెల 6 నుంచి అష్టాంగ ఆందోళన కార్యక్రమాలు : బిసి జెఎసి

3లో

## సిఎంఎస్-03 ప్రయోగం

# విజయవంతం

### నింగిలోకి దూసుకెళ్లిన బాహుబలి రాకెట్



- నిర్ణీత కక్ష్యలోకి భారీ ఉపగ్రహం
- పదేళ్లపాటు సేవలు




**శ్రీహరికోట :** భారత నౌకాదళానికి దన్నుగా నిలిచే సిఎంఎస్–03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. ఇస్రో 4,410 కిలోల బరువైన ఈ ఉపగ్రహాన్ని జియో ట్రాన్స్‌ఫర్ కక్ష్యలో ప్రవేశపెట్టింది. అత్యంత శక్తిమంతమైన, బాహుబలి రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించింది. కౌంట్ డౌన్ ముగిసిన 24గంటల తర్వాత ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు ఎల్‌విఎం 3 – ఎం5 రాకెట్ నిప్పులు కక్కుకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. పలు కీలకదశలు పూర్తయిన తర్వాత ప్రయోగం విజయవంతమైనట్లు ఇస్రో ప్రకటించింది. అనంతరం ఈ ప్రయోగం సక్సెస్ కావడం సంతోషంగా ఉందని ఇస్రో ఛైర్మన్ వి నారాయణన్ తెలిపారు. 'సిఎంఎస్03 ప్రయోగం విజయవంతం కావడం ఆనందంగా ఉంది. ప్రయోగ విజయంలో కీలకపాత్ర పోషించిన శాస్త్రవేత్తలు, సిబ్బందికి అభినందనలు. ఈ ప్రయోగంతో భారత్ మరో ఘనత సాధించింది. శాస్త్రవేత్తలు, సిబ్బంది కృషి వల్లే ఇదంతా సాధ్యమైంది. ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఇస్రో అడుగులు వేస్తోంది' అని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ పేర్కొన్నారు. భారత భూభాగం నుంచి పంపిన ఉపగ్రహాల్లో ఇదే అతిపెద్దది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఎల్‌విఎం 3 – ఎం5 బాహుబలి రాకెట్ ద్వారా అంతరిక్ష కక్ష్యలోకి భారీ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. వందల మంది పాఠశాల పిల్లలు, స్థానికులు ప్రత్యక్షంగా వీక్షించారు. ఎనిమిది దశల్లో ఈ ప్రయోగం పూర్తైంది. భూఅనువర్తిత బదిలీ కక్ష్య జిటిఒలోకి సిఎంఎస్03 ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు. తొలి రెండు దశల్లో ఇగ్నిషన్ ప్రక్రియ పూర్తిచేశారు. 110 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకున్నాక పలువిడతల్లో సెపరేషన్ ప్రక్రియను నిర్వహించారు. చివరగా 179.800 కిలోమీటర్ల ఎత్తులో సిఎంఎస్03 ఉపగ్రహం వ్యోమ నౌక నుంచి విడిపోయింది. ఈ క్రమంలో ఇస్రో శాస్త్రవేత్తల్లో హర్షాతిరేకాలు

తరువాయి 2లో

## ఉపరాష్ట్రపతి, ప్రధాని అభినందలు



భారత్ భూభాగం నుండి అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించినందుకు ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. 'మన అంతరిక్ష రంగం మమ్మల్ని గర్వపడేలా చేస్తూనే ఉంది! భారతదేశపు అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహం సిఎంఎస్03ను విజయవంతంగా ప్రయోగించినందుకు ఇస్రోకు అభినందనలు' అని మోదీ ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. ఉపగ్రహ ప్రయోగాన్ని ప్రశంసిస్తూ ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ, అంతరిక్ష పరిశోధనలో ఇస్రో అద్భుతమైన మైలురాళ్లను సాధిస్తూనే ఉందని అన్నారు. ఇస్రో ఛైర్మన్ వి నారాయణన్ మాట్లాడుతూ, రాబోయే ఐదు నెలల్లో ఏడు ప్రయోగ మిషన్లను నిర్వహించాలని అంతరిక్ష సంస్థ యోచిస్తున్నట్లు చెప్పారు.

## వ్యాపారుల చేతుల్లో మోదీ రిమోట్‌కంట్రోల్

బిహార్ ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ



5లో

## మంత్రాల నెపంతో వ్యక్తి దారుణ హత్య

ఆసిఫాబాద్ జిల్లా పిట్టగూడలో ఘటన



3లో

## మత్తు పదార్థాలపై

# కఠినంగా ఉండాలి

- గంజాయి, డ్రగ్స్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలి
- ఎంజాయ్ పేరుతో గంజాయ్ వద్దు 'కళాజాత బస్సు యాత్ర' ముగింపు కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

'గంజాయి, డ్రగ్స్'పై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని, వాటిని పూర్తిగా అణచివేయాలని సి పి ఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి డిమాండ్ చేశారు. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు యువత అలవాటుపడి వారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఎంజాయ్ పేరుతో గంజాయ్ వద్దు' అనే నినాదంతో 'తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి, తెలంగాణ ప్రజా నాట్య మండలి' సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 27న హైదరాబాద్‌లోని నిజాం కళాశాల నుండి ప్రారంభమైన 'కళాజాత బస్సు యాత్ర' రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాలు, కళాశాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ఆదివారం హైదరాబాద్‌కు చేరుకున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో యాత్ర నిర్వహించిన కళాకారులకు 'అభినందన కార్యక్రమం' జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శి

తరువాయి 2లో



# 'సర్'పై సుప్రీంకు

- తమిళనాడులో అఖిలపక్ష సమావేశం తీర్మానం ● 2026 అసెంబ్లీ ఎన్నికల తర్వాత చేపట్టాలని ఇసికి విజ్ఞప్తి
- సర్ పూర్తిగా అప్రజాస్వామికమని, తమిళనాడు ప్రజల ఓటు హక్కులపై దాడి అని మండిపాటు

**చెన్నై:** తమిళనాడులో భారత ఎన్నికల సంఘం చేపట్టేబోయే ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)ను అధికార, ప్రతిపక్షాలు తీవ్ర ఖండించాయి. ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన ఆదివారం జరిగిన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల తర్వాత సర్‌ను నిర్వహించాలని ఇసిఐను కోరుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అయితే ఇసిఐ వరణ ప్రక్రియను ఆపడంలో విఫలమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని కూడా సమావేశం నిర్ణయించింది. సర్ గురించి వివిధ ఆచరణాత్మక ఇబ్బందులు, అనుమానాలను ఉదహరిస్తూ, రాజ్యాంగబద్ధంగా బాధ్యతాయుతంగా, స్వతంత్రంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉన్న ఇసిఐ కేంద్రంలోని అధికార పార్టీ తరపున పనిచేస్తుందని తీర్మానంలో మండిపడింది. బిహార్‌లో సర్‌కు సంబంధించిన కేసు సుప్రీంకోర్టు ముందు సబ్ జ్యుడీస్‌గా ఉన్నందున, అక్టోబర్ 27 నోటిఫికేషన్ ప్రకారం తమిళనాడులో సర్ కొనసాగించాలనే ఇసిఐ నిర్ణయం పూర్తిగా అప్రజాస్వామికమని, తమిళనాడు ప్రజల ఓటింగ్ హక్కులపై దాడి అని తీర్మానం పేర్కొంది. సర్ ఆమోదయోగ్యం కాదని పేర్కొంటూ, కొనసాగుతున్న ఈ ప్రక్రియను వెంటనే

తరువాయి 12లో

# విద్యార్థినుల మెరుపు ధర్నా

- దోపిడీని నిరసిస్తూ నాగర్‌కర్నూల్ సాంఘిక సంక్షేమశాఖ గురుకుల డిగ్రీ కాలేజీ విద్యార్థుల ఆందోళన
- కళాశాలకు వచ్చిన నిత్యావసర సరుకులు దారిమళ్లడంపై ఆగ్రహం
- ప్రిన్సిపాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్

ప్రజాపక్షం/షాద్‌నగర్

గురుకుల కళాశాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చర్యలు తీసుకుంటుంటే ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకుల నిర్లక్ష్యం, దోపిడీ కారణంగా లక్ష్యం నీరుగారిపోతుందని విద్యార్థినులు మండిపడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం షాద్‌నగర్ ముఖ్యకూడలిలో నాగర్‌కర్నూల్ సాంఘిక సంక్షేమ శాఖ డిగ్రీ గురుకుల కళాశాల విద్యార్థినులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం వద్ద 44వ జాతీయ రహదారిపై మెరుపు ధర్నా చేశారు. అక్కడి నుండి నేరుగా పట్టణంలోని ముఖ్య కూడలి వద్దకు సుమారు 500మంది విద్యార్థినులు చేరుకొని గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మా కొద్దూ..డౌన్..డౌన్ అంటూ నినాదాలు చేశారు. విధుల్లో నుండి తప్పించడంతోపాటు తక్షణమే సస్పెండ్ చేయాలని విద్యార్థునులు ఆందోళన చేపట్టారు. గురుకుల కళాశాలలో 500మంది విద్యార్థినులు ఉంటే 20కేజీల మటన్ తీసుకువచ్చి ఎవరికి పెడతారో చెప్పాలని డిమాండ్

తరువాయి 12లో



### నిండా ముంచిన మొంథా

# రైతు కంట కన్నీరు



- వరి, పత్తి పంటలకు భారీ నష్టం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే రూ.వెయ్యి కోట్లకు పైగానే.. ● 75వేల ఎకరాల్లో పంటలు ధ్వంసం



ప్రజాపక్షం / హనుమకొండ

మొంథా తుఫాన్ తగ్గినా రైతులకు పెను విషాదాన్ని మిగిల్చింది..వరద తగ్గినా వర్షం మాత్రం రైతులను గుండె చెరువు చేసింది. తుఫాన్ ధాటికి చేతికొచ్చిన వరి పంట నేలరాలింది. వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఈ ఏడాది భారీ వర్షాల మధ్య కష్టపడుతూ సాగు చేసిన రైతన్నలకు కన్నీరు మిగిలింది. వరితో పాటు పత్తి దెబ్బతినడంతో రైతులు భారీగా నష్టపోయారు. ఉమ్మడి జిల్లాలో వర్షాలకు జరిగిన పంట నష్టాన్ని ప్రాథమికంగా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.ఉమ్మడి జిల్లాలో సుమారు వెయ్యి కోట్ల పైగానే పంట దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఉమ్మడి జిల్లాలో రెండు రోజుల పాటు పడిన మొంథా తుపాన్ భారీ ప్రభావాన్ని చూపింది. భారీ నుంచి అతి భారీ వర్షాలు తుపాన్ ప్రభావంతో పడటంతో

తరువాయి 2లో

### విపత్తులతో విలవిల...

# పంట బీమా ఏది?



- ప్రతి ఏటా ప్రకృతి విపత్తులతో నష్టపోతున్న రైతాంగం ● అంచనాలు వేయడమేతప్ప ఆదుకోని ప్రభుత్వాలు

ప్రజాపక్షం/ ఖమ్మం

ప్రతి యేటా ప్రకృతి విపత్తుతో రైతాంగం నష్టపోతూనే ఉన్నారు. ఏదో ఒక పంటను ప్రకృతి ఏదో ఒక రూపంలో దెబ్బతీస్తూనే ఉంది. అతివృష్టి లేదంటే అనావృష్టి కారణంగా రైతులు నష్టపోతున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించి నప్పుడు పంటల బీమా ఉంటే రైతులకు న్యాయం జరుగుతుంది. గతంలో జిల్లా యూనిట్‌గా బీమా కొంత కాలం అమలు చేశారు. జిల్లా మొత్తం ఒకే రీతి వాతావరణ పరిస్థితులు ఉండకపోవడం, విపత్తులు జిల్లా మొత్తం లేకపోవడంతో అప్పట్లో బీమా ఉన్న ఉపయోగం లేకుండాపోయింది. ఆ తర్వాత మండల యూనిట్‌గా బీమాను అమలు చేసే పద్ధతిని తీసుకు వచ్చారు. ఇప్పుడు మొత్తంగా గత ప్రభుత్వం నుంచి ఇప్పటి దాకా ప్రభుత్వపరంగా పంటల బీమా అమలు చేయడం లేదు. బ్యాంకులు పంట రుణాలు ఇచ్చేటప్పుడు బీమా క్రింద కొంత డబ్బు

తరువాయి 2లో

### భార్యాబిడ్డసహా

# ముగ్గురి హత్య... భర్త ఆత్మహత్య

వికారాబాద్ జిల్లా కుల్కచర్లలో అమానుషం

ప్రజాపక్షం/కుల్కచర్ల



వివాహేతర సంబంధం అనుమానం ముగ్గురి హత్య, నిందితుడి ఆత్మహత్యకు దారితీసింది. ఈ అత్యంత దారుణ అమానుష సంఘటన శనివారం రాత్రి వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలోని కులకచర్లలో చోటుచేసుకుంది. వేపూరి యాదయ్య (40) అనే వ్యక్తి తన భార్య(32), చిన్న కూతురు(10),

తరువాయి 2లో

www.prajapaksham.in ప్రజాపక్షం Telugu National Daily
సోమవారం | 03 నవంబరు, 2025



# ప్రపంచం
WORLD NEWS

## అణు కేంద్రాలు పునర్నిర్మిస్తాం : ఇరాన్



టెహ్రాన్ : మరింత శక్తిమంతమైన అణు కేంద్రాలను పునర్నిర్మించుకుంటామని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రకటించారు. అణ్వాయుధాలను తమ దేశం కావాలనుకోవడంలేదని చెప్పారు. దేశంలోని అణుశక్తి సంస్థ (అటామిక్ ఎనర్జీ ఆర్గనైజేషన్)ను పెజెష్కియాన్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అణు కేంద్రాలు పునర్నిర్మిస్తామన్నారు. భవనాలు, కర్మాగారాలను నాశనం చేయడం వల్ల తమకు సమస్య రాదని, వాటన్నింటినీ మరింత పటిష్ఠంగా పునర్నిర్మిస్తామని పెజెష్కియాన్ చెప్పారు. ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సు కోసమే ఆలోచిస్తామన్నారు. జూన్‌లో అమెరికా బాంబు దాడుల్లో ఇరాన్‌లోని అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. వీటిని పునర్నిర్మించనివ్వమంటూ ఇరాన్‌ను అమెరికా హెచ్చరించింది. కాదంటే మళ్లీ దాడులు చేస్తామని తేల్చి చెప్పింది.



## రష్యా అణు జలాంతర్గామి జలప్రవేశం

మాస్కో : రష్యా అణ్వస్త్రాలను వరుసగా ప్రయోగిస్తూ తమ శక్తిని చాటుకునే ప్రయత్నాన్ని సాగిస్తోంది. అమెరికా హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఇటీవల కొన్ని పరీక్షలు నిర్వహించింది. తాజాగా అణు జలాంతర్గామి 'ఖాబోరోస్క్'ను ప్రారంభించింది. సెవెరోడ్విన్స్క్‌లో రష్యా నేవీ చీఫ్ అడ్మిరల్ అలెగ్జాండర్ మొసెయేవ్ సమక్షంలో ఈ జలాంతర్గామి జలప్రవేశం జరిగింది. రక్షణ మంత్రి ఆండ్రీ బెలోసో దీనిని ప్రారంభించారు. కోస్తా దేశాలను తుడిచిపెట్టగల డూమ్స్ డే మిసైల్‌గా పిలిచే అణ్వస్త్రం 'పోసేడాన్'ను ఈ జలాంతర్గామి ప్రయోగించగలదు. సముద్ర గర్భంలోకి ఆయుధాలు తీసుకెళ్లడం, రోబోటిక్ వ్యవస్థలను కలిగివుండటంతో ప్రపంచ సముద్ర జలాల్లో తమ సరిహద్దుల భద్రతకు ఈ జలాంతర్గామి శక్తిమంతమైన ఆయుధంగా ఉంటుందని రక్షణ మంత్రి వెల్లడించారు.

## ట్రంప్ విధానాలు వినాశకరం : ఒబామా

### డెమొక్రాట్ గవర్నర్ అభ్యర్థులకు మద్దతుగా వర్జీనియా, న్యూజెర్సీలో ప్రచారం




వాషింగ్టన్ : ట్రంప్ సర్కారు నిర్లక్ష్యాన్ని, అధర్మాన్ని తిరస్కరించాలని, డెమొక్రాట్లకు మద్దతివ్వాలని మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా పిలుపునిచ్చారు. ట్రంప్ సుంకాల విధానం, నేషనల్ గార్డ్ దళాల మోహరింపును విమర్శించారు. ట్రంప్ చర్యలను ఎండగట్టడం లేదంటూ రిపబ్లికన్ చట్టసభ్యులను దుయ్యబట్టారు. ఈనెల 4న జరగబోయే వర్జీనియా, న్యూజెర్సీ గవర్నర్ ఎన్నికల్లో తమ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. డెమొక్రటిక్ గుబెర్‌నేషనల్ అభ్యర్థులు అబిగెయిల్ స్పాన్‌బెర్గర్, మైకీ షెరిల్ తరపున ఒబామా ప్రచారం చేశారు. ట్రంప్ రెండవసారి అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్యానికి ఏ మేరకు ముప్పు పొంచివున్నదో స్పష్టమైందని అన్నారు. సమాజం ఏ స్థాయికి దిగజారుతుందో ఊహించగలమన్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్నికలకు ప్రాధాన్యత పెరిగిందని... అనుకున్న దానికంటే తమకు ఎక్కువ శక్తి ఉందని గ్రహించి... దానిని సద్వినియోగించాలని ప్రజలకు ఒబామా సూచించారు. శ్వేతసౌధం నిత్యం అధర్మానికి పాల్పడుతోందని, కక్షసాధింపు ధోరణితో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ట్రంప్ పాలన ఇష్టారాజ్యాంగ సాగుతోందని విమర్శించారు. వ్యాపారవేత్తలు, న్యాయ సంస్థలు, విశ్వవిద్యాలయాలు అనతి కాలంలోనే ట్రంప్ మెప్పు కోసం మోకరిల్లడం ఆశ్చర్యం కలిగించిందని చెప్పారు. ట్రంప్ ఉద్దేశం తెలిసినప్పటికీ... అది ఊహించిన దానికంటే ఘోరంగా ఉందని ఒబామా వ్యాఖ్యానించారు. ప్రజాస్వామిక ప్రాథమిక నియమ నిబంధనలు నీరుగారిపోతున్నాయని, ఆర్థికశక్తిగా కనిపించడం కోసం చేస్తున్న కసరత్తు ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఇదిలావుంటే, న్యూయార్క్ నగరానికి డెమొక్రాట్ మేయర్ అభ్యర్థిగా ఉన్న జోహ్రాన్ మదానీకి ఒబామా ఫోన్ చేసి మద్దతు తెలిపారు.



## మెక్సికోలో పేలుడు : 23 మంది మృతి

మెక్సికో సిటీ : మెక్సికోలోని హెర్మోసిల్లోలోగల వాల్డో సూపర్‌మార్కెట్‌లో భారీ పేలుడు సంభవించి 23 మంది చనిపోయారు. మృతుల్లో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ఘటనను గవర్నర్ అల్ఫోన్సో దురాజో ఖండించారు. 'ఇది బాధాకరం. తమవారిని కోల్పోయిన కుటుంబాలకు సానుభూతి తెలుపుతున్నా. బాధితులను ఆదుకుంటాం' అని ఆయన పేర్కొన్నారు. మెక్సికో అధ్యక్షులు క్లాడియా షేన్‌బామ్ ఎక్స్ మాధ్యమంగా స్పందిస్తూ ఈ ఘటన కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు. గవర్నర్ అల్ఫోన్సోతో మాట్లాడినట్లు తెలిపారు. సహాయక చర్యల కోసం సిబ్బందిని పంపించాలని అంతర్గత వ్యవహారాల కార్యదర్శి రోసా ఐసెలా రోడ్రిగ్జ్‌ను ఆదేశించినట్లు క్లాడియా వెల్లడించారు.

## పంట బీమా ఏది?

(మొదటి పేజీ తరువాయి)

మినహాయించుకుంటున్నప్పటికీ అది కూడా రైతులకు ఉపయోగపడడం లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని ప్రవేశపెట్టిన కొన్ని కార్పొరేట్ శక్తులకు కోట్ల రూపాయలు మిగిల్చింది తప్ప రైతులకు మాత్రం ఎటువంటి ప్రయోజనం లేదు. పంటల బీమా క్రింద రైతులకు సంబంధించి ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తే రైతులకు విపత్తులు సంభవించినప్పుడు మేలు జరుగుతుంది. ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రంలో అతివృష్టి కారణంగా మునుపెన్నడు లేని రీతిలో రైతాంగం భారీగా నష్టపోయింది. పంటల బీమా అమలులో ఉండి ఉంటే రైతులకు ఈ పరిస్థితి ఉండేది కాదు.
ప్రభుత్వాలు రైతాంగం సాగు చేసిన పంటలను నోటిఫై చేసిన తర్వాత ఎటువంటి విపత్తులు సంభించిన రైతుకు నగదు రూపంలో పరిహారం దక్కుతుంది. గతంలో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసేవి. ఆ తర్వాత మోడీ పాలనలో 2016లో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అనే పథకాన్ని తీసుకువచ్చారు. ఇందులో ప్రైవేటుకు భాగస్వామ్యం కల్పించడంతో పాటు మోడీ తన ప్రధాన అనుచరుడిగా చెప్పుకుంటున్న వ్యక్తికి ఈ బీమ పథకాన్ని కట్టబెట్టారు. రెండేళ్ల పాటు వేల కోట్ల రూపాయలు వసూళ్లయిన తర్వాత దాదాపు ఆ సంస్థ పంటల బీమా నుంచి వైదొలిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కానీ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కానీ పంటల బీమా పథకం ఏది అమలు కావడం లేదు. రైతులే ప్రీమియం చెల్లించే విధంగా బీమా పథకాన్ని అమలు చేసిన కొంత ఊరటనిస్తుందని రైతులు కోరుతున్నా పాలకులు స్పందించే పరిస్థితి లేదు. గత ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని నీరుగార్చిందని తాము అధికారంలోకి రాగానే పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు హామీ ఇచ్చినప్పటికీ అది నెరవేరలేదు. అంతే కాకుండా రైతు బీమా యోజన పథకాన్ని గత ప్రభుత్వం అమలు చేసింది. ఈ పథకం క్రింద రైతు మరణిస్తే మరణించిన 15 రోజుల లోపు ఐదు లక్షల రూపాయలు ఆ కుటుంబానికి వచ్చేవి.
ఇప్పుడు రైతు బీమా యోజన పథకం లేకపోవడంతో రైతులు మరణిస్తే ఆ కుటుంబాలు వీధినపడే పరిస్థితి వచ్చింది. వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తిస్తే రైతాంగానికి మేలు జరిగే అవకాశం ఉంది. కానీ పాలకులు ఆ వైపుగా స్పందించడం లేదు.
రైతే దేశానికి వెన్నుముఖ అని ప్రతి ఒక్కరూ అధికారంలో ఉన్నప్పుడు లేనప్పుడు నినాదాలు ఇవ్వడమే తప్ప వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది లేదు. గడిచిన దశాబ్ద కాలంలో ఏదో ఒక విపత్తుతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. గడిచిన రెండేళ్లలోనే ఒక ఖమ్మం జిల్లాలోనే రూ. 400 కోట్లకు పైబడి రైతాంగం పంటలు నష్టపోయారని ఒక అంచనా. ఇందులో రైతులకు పరిహార రూపంలో తిరిగి వచ్చింది లేదు. పంటల బీమా అమలులో ఉంటే రైతులకు ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు ప్రకృతి వైపరీత్యాల బారీనపడి పంటలు నష్టపోయినప్పుడు ఇబ్బందులు లేకుండా ఉండేది. ఇక ప్రభుత్వం పరిహారం ఒక రకంగా పరిహాసమవుతుంది. నష్టాలను అంచనాలు వేసేటప్పుడు ఉన్న నియమ నిబంధనలు రైతులకు శాపంగా మారుతున్నాయి. 60 శాతం పత్తి కాయలు నల్లబడాలి, 60 శాతం పంట పనికిరాకుండా పోవాలి ఇలా చెప్పుకుంటూ పోతే ప్రభుత్వ నిబందనల ప్రకారం రైతుకు మేలు జరిగే పరిస్థితి లేదు. దీనికి తోడు ప్రకృతి విపత్తులు సంభవించిన ప్రతిసారి అంచనాలు వేయడం వరకే పరిమితమవుతున్నారు తప్ప పరిహారం అందించడంలో మాత్రం విఫలమవుతున్నారు. ఈ ఏడాది ప్రకృతి విపత్తుల కారణంగా అన్ని పంటలకు నష్టం వాటిల్లింది.
గతంలో ఒక పంట పోతే మరో పంట పండుతుందిలే అన్న ఆశ రైతుల్లో ఉండేది. ఈ ఏడాది అటు మెట్ట పంటలు దెబ్బతినగా మొంథా తుఫాన్‌కు వరి పంట కూడా తీవ్రంగా దెబ్బతిన్నది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వరుస విపత్తులను దృష్టిలో ఉంచుకుని పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా వివిధ కారణాలతో యువ రైతులే మరణిస్తుండడంతో ఆ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. రైతు బీమా యోజనను కూడా అమలు చేయాలని కోరుతున్నారు.

## రైతు కంట కన్నీరు

(మొదటి పేజీ తరువాయి)

వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది.కోత దశలో ఉన్న వరి భారీ వర్షానికి నేలకొరిగింది.ఈ వర్షానికి చేతికొచ్చే రీతిలో లేకుండా పంట నేలరాలింది. కొన్ని గ్రామాల పరిధిలో పొట్ట, పూత దశలో ఉన్న వరి పంట దెబ్బతింది. వర్షాలు లేకుంటే పంట కోద్దామన్న రైతులకు ఈ తుపాన్ భారీ నష్టాన్ని మిగిల్చింది. వేలాది రూపాయలు పంట కోసం పెట్టుబడి పెట్టిన రైతులను కన్నీటిలో ముంచింది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ఎన్నడు లేనంతగా తుపాన్ వల్ల భారీ నష్టం జరిగింది. వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, జనగామ జిల్లాల పరిధిలో ఎక్కువ మొత్తంలో పంట నష్టం జరిగింది. వారం రోజుల్లో పంట చేతికి వస్తదని అంచనా వేసుకున్న రైతులకు ఈ తుపాన్ కన్నీళ్లను మిగిల్చింది.

**75వేల ఎకరాలలో పంటలు నష్టం**

వరంగల్ జిల్లాలో వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం 75వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది.దీనిలో 57 వేల ఎకరాల వరకు వరి పంటే దెబ్బతింది. ప్రాథమిక అంచనాల ప్రకారం 570 కోట్లకు పైగా నష్టం జరిగినట్లు అంచనా వేశారు. హన్మకొండ జిల్లా పరిధిలో 35 వేల ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాలు వేశారు. అధికారుల లెక్కల ప్రకారం సుమారు 250 కోట్లకు పైగా నష్టం ఉంటుందని అంచనాకు వస్తున్నారు.
వరంగల్ జిల్లా పరిధిలో పర్వతగిరి, వర్ధన్నపేట, సంగెం, ఐనవోలు మండలాల పరిధిలో ఎక్కువ నష్టం జరిగింది. హన్మకొండ జిల్లా పరిధిలో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, హసన్ పర్తి, కమలాపూర్ మండలాల పరిధిలో భారీగా పంట దెబ్బతింది. మహబూబాబాద్ జిల్లా పరిధిలో నర్సింహులపేట, కేసముద్రం, నెక్కొండతో పాటు ఇతర మండలాల్లో పంట దెబ్బతింది. ఇవే కాకుండా పలు మండలాల పరిధిలో పడిన వర్షం వల్ల మొక్కజొన్న, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి.

**సర్వే నంబర్ వారీగా పరిశీలిస్తే..**

రెండు రోజులుగా వ్యవసాయ శాఖ ఏఈవోలు, ఏవోలు, ఇతర అధికారులు క్లస్టర్ల వారిగా గ్రామాల్లో పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు. సర్వే నెంబర్ వారిగా పంటలను పరిశీలిస్తూ నమోదు చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 10 వేల రూపాయలు ఇస్తామని ప్రకటించడం వల్ల అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేసి అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పంట దెబ్బతిన్న రైతులు మాత్రం తమను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎకరాకు 30 నుంచి 40 వేల వరకు పెట్టుబడి పెట్టామని వారు వాపోతున్నారు.ఉమ్మడి జిల్లా పరిధిలో పంట భారీగా దెబ్బతిందని ఎకరాకు కనీసం 40 నుంచి 50వేల రూపాయలు పంట నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన శ్రీకాంత్ యాదవ్ 5 ఎకరాల్లో వేశారు.వర్షానికి మొత్తం దెబ్బతింది.పెట్టుబడి ఎకరాకు 40 వేల చొప్పున 2 లక్షల వరకు ఖర్చు పెట్టారు. ప్రస్తుతం పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదన్నారు.

**ఎకరానికి రూ. 50వేలు ఇవ్వాలి**

ఉమ్మడి జిల్లా రైతుల సంఘాల నేతలు కూడా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తడిసిన ధాన్యం, పత్తిని కొనుగోలు చేయడంతో పాటు నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.
భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనా వేస్తున్నామని హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల జేడీఏలు రవీందర్ సింగ్, అనురాధ, నిర్మలలు తెలిపారు. ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి అందించామని పూర్తిస్థాయి నివేదికను రెండు రోజుల్లో అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని వారు తెలిపారు.

## వీధి కుక్కల కేసు విచారణకు సిఎస్‌లు హాజరు కావాలి

**అన్ని రాష్ట్రాలు, యుటి'ల ప్రభుత్వ ప్రధానకార్యదర్శులు కోర్టుకు హాజరుకావాలి**

**సుప్రీంకోర్టు సమ్మతి అఫిడవిట్లు ఎందుకు దాఖలు చేయలేదో వివ-రణ ఇవ్వాలని ఆదేశం**

**పశ్చిమబెంగాల్, తెలంగాణ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు మినహాయింపు**



న్యూఢిల్లీ : వీధి కుక్కల కేసును సుప్రీం కోర్టు నేడు (సోమవారం) విచారించనుంది. పశ్చిమబెంగాల్ మరియు తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల (యుటి'లు) ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు కోర్టుకు హాజరుకావాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. అక్టోబరు 27న ఈ కేసు విచారించగా, ఆగస్టు 22న కోర్టు ఆదేశించినప్పటికీ సమ్మతి అఫిడవిట్లు ఎందుకు దాఖలు చేయలేదో వివరించడానికి నవంబరు 3న తమ ముందు హాజరుకావాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆగస్టు 22న సుప్రీంకోర్టు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను జంతు జనన నియంత్రణ (ఎబిసి) నిబంధనలను పాటించడానికి తీసుకుంటున్న చర్యల గురించి ధర్మాసనం అడిగింది. ఈ విషయం న్యాయమూర్తులు విక్రమ్‌నాథ్, సందీప్ మెహతా, ఎన్.వి.అంజారియాలతో కూడిన ముగ్గురు న్యాయమూర్తులు ప్రత్యేక ధర్మాసనం ముందు విచారణ రానున్నది. అక్టోబరు 31న అత్యున్నత న్యాయస్థానం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధానకారదర్శులు నవంబరు 3న భౌతికంగా తనముందు హాజరుకాకుండా మినహాయింపు ఇవ్వడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. కోర్టు ఆదేశాలను గౌరవించిడం లేదని పేర్కొంది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ విషయాన్ని ప్రస్తావించి ప్రభుత్వ ప్రధానకార్యదర్శులను కోర్టు ముందు వర్చువల్‌గా హాజరుకావడానికి అనుమతించాలని ధర్మాసనాన్ని కోరారు. ఆగస్టు 22న ఇచ్చిన ఉత్తర్వులను పాటించకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. అక్టోబరు 27 నాటికి పశ్చిమ బెంగాల్, తెలంగాణ, మున్సిపల్ కార్పొరేషన్ ఢిల్లీ (ఎంసిడి) మినహా మిగతా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు సమ్మతి అఫిడవిట్లు దాఖలు చేయలేదనే విషయాన్ని గమనించింది. ప్రభుత్వ ప్రధానకార్యదర్శులు కోర్టుకు అప్పీల్ చేసుకుని వారు ఎందుకు సమ్మతి అఫిడవిట్లు దాఖలు చేయలేదో వివరించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్ట ం చేసింది. అక్టోబరు 27న ఈ కేసు విచారణకు వచ్చినప్పుడు పశ్చిమ బెంగాల్, తెలంగాణ, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మాత్రమే సమ్మతి అఫిడవిట్లు దాఖలు చేశాయని ధర్మాసనం పేర్కొంది. అక్టోబరు 27న అత్యున్నత న్యాయస్థానం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను తీవ్రంగా విమర్శించింది.ఈ విషయంలో వారు సమ్మతి అఫిడవిట్లు దాఖలు చేయలేదని, నిరంతర సంఘటనలు జరుగుతున్నాయని, విదేశాలలో దేశాన్ని దిగజార్చి చూపిస్తున్నారని తెలిపింది.వీధికుక్కల కేసును సుప్రీంకోర్టు గతంలో ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం పరిధికి మించి విస్తరించింది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఈ విషయంలో పార్టీలుగా చేయాలని ఆదేశించింది. ఎబిసి నిబంధనలను పాటించడానికి తేదీ నాటికి అందుబాటులో ఉన్న కుక్కల పౌండు, పశువైద్యశాలలు, కుక్కలను పట్టుకునే సిబ్బంది, ప్రత్యేకంగా సవరించిన వాహనాలు మరియు ఎబిసి నియమాలను పాటించడం కోసం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం పంజరాల వివరాలతో పూర్తి గణాంక వివరాలతో కూడిన ఒక అఫిడవిట్‌ను మున్సిపల్ అధికారులు ఒక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

## విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తమయ్యాయి. ఒకరినొకరు అభినందించుకున్నారు.

**హిందూ మహాసముద్రంలో పైచేయి సాధించే లక్ష్యంతోనే**

హిందూ మహాసముద్రంలో దేశ ప్రయోజనాలను రక్షించుకోవడంతోపాటు వ్యూహాత్మకంగా పైచేయి సాధించే లక్ష్యంతో భారత్ ఈ ప్రయోగం చేపట్టింది. సాగరంలో మోహరించిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, నేల మీదున్న నియంత్రణ కేంద్రాలతో భద్రమైన కమ్యూనికేషన్లు సాగించేందుకు ఈ ఉపగ్రహం తోడ్పాటు అందిస్తుంది. హిందూ మహాసముద్రంలో పెరుగుతున్న చైనా నౌకాదళం కదలికలను పసిగట్టడానికి ఉపయోగపడుతుంది. 4,410కిలోల బరువున్న సిఎంఎస్03 మన భూభాగం నుంచి భూఅనువర్తిత బదిలీ కక్ష్యలోకి ప్రయోగించిన ఉపగ్రహాల అన్నింటిలోకి అత్యంత బరువైనదిగా గుర్తింపు పొందనుంది. టెలికమ్యూనికేషన్ సేవలను మెరుగుపరిచేందుకు సిఎంఎస్03 ఒక బహుళ బ్యాండ్ ఉపగ్రహం. దేశవ్యాప్తంగా, ఉపఖండం చుట్టూ విస్తరించిన సువిశాల సాగరప్రాంతంలో టెలికమ్యూనికేషన్ సేవలను మెరుగుపరచడం ఈ ప్రయోగం ఉద్దేశం. ప్రధానంగా నౌకాదళ అవసరాల కోసం ఈ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. దీన్ని జీశాట్7ఆర్ అని కూడా పిలుస్తారు. 2013 నుంచి సేవలు అందిస్తున్న జీశాట్7 స్థానంలో ఈ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. సిఎంఎస్03లో స్వర, డేటా, వీడియో కమ్యూనికేషన్లను రహస్యంగా, భద్రంగా సాగేందుకు లి, ఎక్స్‌టెండెడ్ సి, కెయు బ్యాండ్ ట్రాన్స్‌పాండర్లు ఉన్నాయి.
విదేశీ సమాచార సేవలపై ఆధారపడటాన్ని ఈ ఉపగ్రహం తగ్గిస్తుంది. యుద్ధ నౌకలు, విమానాలు, తీరప్రాంతంలోని స్థావరాల మధ్య భద్రమైన సమాచార లింక్‌లకు మార్గం సుగమం చేస్తుంది. టెలికం సంధానత పెరుగుతుంది. మెరుగైన, అధిక సామర్థ్యం కలిగిన బ్యాండ్‌విడ్త్‌ను అందిస్తుంది. మారుమూల ప్రాంతాలకు డిజిటల్ సేవల లభ్యత పెరుగుతుంది. వ్యూహాత్మక అవసరాలతోపాటు పౌర సంస్థలకూ ప్రయోజనం కలుగుతుంది. శత్రుసేనలు మన కమ్యూనికేషన్‌ను జామ్ చేసేందుకు ప్రయత్నిస్తే ఈ ఉపగ్రహం అడ్డుకుంటుంది. ఇది భారత తీరం నుంచి 2వేల కిలోమీటర్ల దూరం వరకూ విస్తరించిన సాగర జలాల్లో సేవలు అందిస్తుంది.

## గెలుపు కాంగ్రెస్‌దే

(మొదటి పేజీ తరువాయి)

పైగా ఆ పార్టీల వల్ల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందనే విషయాన్ని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బలంగా ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అభివృద్ధిచేస్తామనే భరోసను కల్పించాలని ఆయన మంత్రులకు సూచించారు.



## ప్రతిపక్షాల 'జూటా' ప్రచారం నమ్మొద్దు

**బిజెపి,బిఆర్ఎస్ గుణపాఠం చెప్పండి**

**జూబ్లీహిల్స్ ఓటర్లకు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి**

ప్రజాపక్షం/హైదరాబాద్: మహా నగరాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతిపక్షాలు చేస్తున్న 'జూటా' ప్రచారాన్ని నమ్మొద్దని జూబ్లీహిల్స్ ఓటర్లకు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కోరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కోసమే మాపై బురద జల్లే రాజకీయాలు చేస్తున్న బిఆర్ఎస్,బిజెపికి గట్టి గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని ఎల్లారెడ్డిగూడ, శ్రీనగర్ కాలనీ, ఎస్ఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన ఆదివారం ఇంటింటికి తిరిగి విస్తృత ప్రచారం నిర్వహించారు. రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఓటర్లకు వివరించారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మాటలు కోటలు దాటాయి తప్ప క్షేత్ర స్థాయిలో నిజంగా ప్రజలకు ఒరిగిందేం లేదన్నారు. ఆ తప్పులను మా ప్రభుత్వం ఒక్కొక్కటిగా సరిదిద్దుతుందన్నారు. ప్రపంచ పటంలో హైదరాబాద్‌ను అత్యున్నత స్థానంలో నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చేస్తున్న కృషిని వివరించారు. ఓవైపు బీఆర్ఎస్ పాలనలో గాడి తప్పిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతూనే... మరోవైపు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తున్నామన్నారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు వస్తుంటే కొందరు ప్రతిపక్ష నేతలు తట్టుకోలేక మాపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ 20 నెలల వ్యవధిలోనే రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. ఇదే మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తామని, ఈ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దని భరోసా ఇచ్చారు. ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా ఆపబోమని స్పష్టం చేశారు. భావితరాల భవిష్యత్తు కోసం నిరంతరం పాటు పడే ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని జూబ్లీహిల్స్ ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు విజయ రమణారావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురి హత్య... భర్త ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

వదిన (40)ను వేటకొడవలితో అత్యంత దారుణంగా చంపిన తర్వాత తానూ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఉదంతం సంచలనం సృష్టించింది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కుల్కచర్ల గ్రామానికి చెందిన వేపురి యాదయ్యకు అలివేలుతో 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు పెద్ద కూతురు అపర్ణ (13) చిన్న కూతురు శివాని ఉన్నారు. గత కొంతకాలంగా భార్యా భర్తల మధ్య గొడవలు తీవ్రస్థాయిలో జరుగుతున్నాయి. గ్రామస్తుల సమక్ష్యంలో యాదయ్యను పిలిపించి పంచాయితీ పెట్టించారు. మరిది యాదయ్యకు సర్ది చెప్పడానికి భార్య సోదరి అయిన హన్మమ్మ యాదయ్య ఇంటికి చేరుకుంది. పెద్దమనుషులు యాదయ్యను మందలించి ఇంటికి పంపించారు. అవమానకరంగా భావించిన యాదయ్య పెద్దమనుషుల సమక్షంలో నా పరువు తీస్తారా అంటూ ఆవేశంతో ఊగిపోయాడు. రాత్రి తన వదిన సహా భార్యా పిల్లలను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఇంట్లో ఉన్న వేట కొడవలి తీసుకుని వదిన హన్మమ్మ , భార్య అలివేలును నరికి చంపాడు. తర్వాత చిన్న కూతురు శివాని వైపు చూస్తూ మిమ్మల్ని ఎవరు చూసుకుంటారు ? మిమ్మల్ని కూడా చంపేస్తే ఒక పని అయిపోతుందని ఆగ్రహంతో ఊగిపోతూ వేటకొడవలితో చిన్న కూతురు శ్రావణి మెడపై వేటు వేయడంతో శ్రావణి కుప్పకూలి అక్కడికక్కడే చనిపోయింది. తండ్రి యాదయ్య తనను కూడా నరికేందుకు తనవైపునకు దూసుకొన్నది గమనించిన పెద్దకూతురు అపర్ణ తప్పించుకుని పారిపోయింది. పక్క ఇంటి ప్రభు, జోగు పెంటయ్యలకు విషయం చెప్పి వారిని తీసుకుని ఇంట్లోకి వచ్చి చూడగా తన తల్లి, చెల్లి, పెద్దమ్మ ముగ్గురూ రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉండటం కనిపించింది. వారు యాదయ్య కోసం ఇల్లు అంతా వెతికే క్రమంలో పక్క రూమ్‌లోకి కూడా వెళ్లి చూడగా, యాదయ్య ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలికి హుటాహుటిన చేరుకున్నారు. మృతులను పోస్ట్‌మార్టమ్ కోసం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలివేలు అన్న నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పరిగి డిఎస్‌పి హత్యాస్థలికి వెళ్లి వివరాలు సేకరించారు.

## కఠినంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

పల్లా వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ, కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బస్సు యాత్ర చేపట్టిన కళాకారులను వారు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ గంజాయ్ లాంటి కనిపించని మహమ్మారికి యువత, విద్యార్థులు బానిసలవుతున్నారని, చాక్లెట్లు లాంటి అనేక రూపంలో యువతకు ప్రమాదకరమైన మత్తు పదార్థాలు చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కూడా పబ్బులలో ఉన్న ప్రమాదకరమైన మత్తు పదార్థాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు తమ పాటల ద్వారా డ్రగ్స్, గంజాయ్ ప్రమాదాన్ని విద్యార్థులకు వివరించారని, తద్వారా వారి మనసు మారే అవకాశాలు ఉంటాయని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ ప్రమాదం పట్ల విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించిన కళాకారులను ఆయన అభినందించారు. మత్తు పదార్థాల ప్రమాదాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, కళాకారుల ద్వారా చైతన్య కార్యక్రమాలను నిర్వహించడాన్ని అభినందిస్తూ, ఇలాంటివి మరిన్ని చేపట్టాలని, అలాగే డ్రగ్స్, గంజాయ్‌ని పూర్తిగా అణచివేసేందుకు చర్యలు తీసుకోవాలని పల్లా వెంకట రెడ్డి కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సలహా మండలి సభ్యులు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కె.లక్ష్మి నారాయణ, కె.ఉప్పలయ్య, ఆర్.ఎల్.రవి, రాము, కళాకారులు రాము సైదులు, విజయ్, భాను, అరుణ్, శ్యామ్, చింటు, అనిల్, శైలజ, మంగ, అనిత పాల్గొన్నారు.

## అవినీతిపై ప్రజల దృష్టి మళ్లించేందుకే

**సర్‌పై డిఎంకె గందరగోళం : టివికె చీఫ్ విజయ్**

చెన్నై: నటుడు, తమిళగ వెట్రి కజగం (టివికె) పార్టీ చీఫ్ ఆదివారం అధికార పార్టీ డిఎంకెపై మండిపడ్డాడు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఓటర్ల జాబితాపై డిఎంకె ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందని, ఈ అంశాన్ని ఎన్నికల ప్రయోజనం కోసం మాత్రమే ఉపయోగిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం అవినీతి ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి కపట నాటకాలు ఆడుతోందని విమర్శించారు. ఈ అంశంపై ప్రజల హక్కులను కాపాడేందుకు ప్రతిపక్ష పార్టీలతో కలిసి రావడానికి తమ పార్టీ సిద్ధంగా ఉందని.. కానీ డిఎంకె ఉద్దేశంలో నిజాయితీ లేదన్నారు. కేరళ అసెంబ్లీ సర్‌కి వ్యతిరేకంగా తీర్మానాన్ని ఆమోదించిందని.. తమిళనాడు అసెంబ్లీలో డిఎంకె ఎందుకు ఆ పని చేయలేదని నిలదీశారు. తన పార్టీ మొదట సర్‌ని వ్యతిరేకించిన సమయంలో డిఎంకె నిద్రలో ఉందని.. ఆ పార్టీకి బిజెపితో పరోక్ష సంబంధాలు ఉన్నాయని.. అందుకే ఆ పార్టీ మౌనంగా ఉండిపోయిందని విమర్శించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సుదర్శన్ రెడ్డి నియామకంపై బి.ఎన్.రెడ్డి శుభాకాంక్షలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ సలహాదారుగా కేబినెట్ హోదాతో నియమితులైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బి.ఎన్.రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు. ప్రభుత్వానికి సమర్థవంతమైన సలహాలు అందించి ప్రజల సంక్షేమం కోసం సుదర్శన్ రెడ్డి కృషి చేస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు.

# బిసి కోటాకు రాజ్యాంగ సవరణ చేయాల్సిందే

గల్లీ నుంచి ఢిల్లీ వరకూ బిసిలు ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలి : బిసి నేతల పిలుపు

6 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అష్టాంగ ఆందోళనలు చేపట్టాలని నిర్ణయం



ప్రజాపక్షం/హైదరాబాద్ : బిసి రిజర్వేషన్‌ల కోసం రాజ్యాంగ సవరణ చేయాల్సిందేనని బిసి జెఎసి డిమాండ్ చేసింది. బిసి రిజర్వేషన్‌ల సాధన కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు బిసిలు ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలని బిసి నేతలు పిలుపునిచ్చారు. రిజర్వేషన్‌ల సాధన కోసం బిసి జెఎసి రాష్ట్రవ్యాప్తంగా అష్టాంగ ఆందోళన కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించింది. అందుకు సంబంధించిన కార్యాచరణను వెల్లడించింది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో 42 శాతం బిసి రిజర్వేషన్‌ల పెంపు భవిష్యత్ కార్యాచరణపై బిసి జెఎసి రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షత వహించగా, కో చైర్మన్ దాసు సురేష్, కో ఆర్డినేటర్ గుజ్జ కృష్ణలు సమన్వయం చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన జెఎసి సమావేశం సాయంత్రం 6 గంటల వరకు 7 గంటల పాటు సుదీర్ఘంగా కొనసాగింది. ఈ సమావేశంలో బిసి సంఘాలు, కుల సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ, న్యాయవాద, డాక్టర్స్, మేధావుల సంఘాల నేతలతో పాటు రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల నుండి ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులు వేలాదిమంది హాజరయ్యారు. ఈ సమావేశానికి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, మాజీ స్పీకర్ మధుసూదన్ చారి, మాజీ ఎంపి, కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, మాల మానాడు జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరావత్ అనిల్, ప్రముఖ సినీ నటులు ఆర్.నారాయణమూర్తి, సినీ దర్శకులు ఎన్. శంకర్, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షులు జూలూరి గౌరీ శంకర్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చోల్లేటి ప్రభాకర్‌లు హాజరయ్యారు.

**గమ్యాన్ని ముద్దాడే వరకూ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలి : ఈటల రాజేందర్**

ఈటల రాజేందర్ మాట్లాడుతూ గమ్యాన్ని ముద్దాడే వరకు బిసి ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలన్నారు. సమావేశానికి బిజెపి నేతగా తాను రాలేదని, ఒక బిసి బిడ్డగా హాజరయ్యానని, బిసి రిజర్వేషన్ల సాధన కోసం బిసి జెఎసి చేస్తు న్నాం పోరాటానికి తన వంతు మద్దతు ఉంటుందన్నారు. దేశంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వచ్చిన తర్వాత రిజర్వేషన్లు లేని వర్గం అంటూ ఏదీ లేదన్నారు.

**ఎనిమిది దశల్లో అష్టాంగ ఆందోళన కార్యక్రమాలు**

నవంబర్ 6: అంబేద్కర్, పూలే విగ్రహాల వద్ద మౌన దీక్షలు
నవంబర్ 13: రాష్ట్రవ్యాప్తంగా బీసీల ధర్మపోరాట దీక్షలు
నవంబర్ 16: రన్ ఫర్ సోషల్ జస్టిస్
నవంబర్ 18: ఎంపీలతో బీసీల ములాఖత్
నవంబర్ 23: అఖిలపక్ష సమావేశం
డిసెంబర్ మొదటి వారం: చలో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడి
డిసెంబర్ మూడో వారం: బీసీల బస్సు యాత్ర
జనవరి నాలుగవ వారం : వేలవృత్తులు కోట్ల గొంతులు నినాదంతో భారీ బహిరంగ సభ.

**ఇండియా కూటమి తరపున ఒత్తిడి తెస్తాం : విహెచ్, బీర్ల ఐలయ్య, ఈరావత్ అనిల్**

హనుమంతరావు, బీర్ల ఐలయ్య, ఈరావత్ అనిల్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్‌ల విషయంలో కాంగ్రెస్ పార్టీ వెనుకకు తగ్గే ప్రసక్తి లేదన్నారు. రాహుల్ గాంధీ ఆదేశించిన విధంగానే కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో అసెంబ్లీలో చేసిన చట్టం అమలు చేయాలని వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఇండియా కూటమి తరపున ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. ప్రభుత్వం తరపున త్వరలోనే అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలుస్తామన్నారు. బిసి రిజర్వేషన్ల విషయంలో బిసి జెఎసి చేస్తున్న పోరాటానికి బిసి బిడ్డలుగా కాంగ్రెస్ పార్టీగా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని కాంగ్రెస్ నేతలు హనమంతరావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మైనింగ్ చైర్మన్ ఈరవత్ అనిల్ హామీనిచ్చారు.

**పార్టీలను పక్కన పెట్టి మరో పోరాటం : మధుసూదనా చారి, శ్రీనివాస్ గౌడ్**

మధుసూదన్ చారి, శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పార్టీలను పక్కన పెట్టి బిసిలకు సామాజిక న్యాయం దక్కించుకోవడానికి తెలంగాణలో మరో పోరాటాన్ని రూపొందించాలని పిలుపునిచ్చారు. బిసి రిజర్వేషన్‌ల సాధనలో బిసిలు ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు కాదు అనే రీతిలో ఒక్కటే జట్టు గట్టి పోరాడాలన్నారు. బిఆర్‌ఎస్ పార్టీగా, బిసి బిడ్డలుగా బిసి జెఎసి ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

**బిసి ఉద్యమానికి ఎంఆర్‌పిఎస్ వెన్నంటి ఉంటుంది : మందకృష్ణ మాదిగ**

మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ బిసి ఉద్యమానికి ఎంఆర్‌పిఎస్ వెన్నంటి ఉంటుందని భరోసా ఇచ్చారు. బయట నుండి మద్దతు ఇవ్వకుండా బిసి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనడానికి తాము సిద్ధంగా ఉన్నామని మందకృష్ణ మాదిగ ప్రకటించారు. బిసి ఉద్యమాన్ని శాంతియుతంగా ప్రజాస్వామ్యయుతంగా ముందుకు తీసుకెళ్తే కచ్చితంగా విజయం సాధించడం ఖాయమన్నారు. బిసి జెఎసి రాజీ లేకుండా నిజాయితీగా కొట్లాడాలని, జాజుల శ్రీనివాస్ గౌడ్ నాయకత్వాన్ని ఎంఆర్‌పిఎస్ బలపరుస్తుందన్నారు.

**బిసిలు ఒంటరి కాదు : అద్దంకి దయాకర్**

అద్దంకి దయాకర్ మాట్లాడుతూ బిసిలు తెలంగాణ రాష్ట్రంలో ఒంటరి కాదని, బిసి సమాజానికి సకల జనులు అండగా నిలబడతారన్నారు. ఇది మొన్న జరిగిన రాష్ట్ర బంద్‌తో తేటతెల్లమైందన్నారు. బిసి ఉద్యమానికి మాల మాదిగ, ఆదివాసి, గిరిజన, మైనార్టీ సమాజం తోడుగా ఉంటుందన్నారు.

**తరతరాలుగా బిసిలకు అన్యాయమే : ఆర్.నారాయణమూర్తి**

తరతరాలుగా బిసిలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దడానికి అంబేద్కర్, పూలే చూపించిన మార్గంలో బిసిలు ఐక్యమై గల్లీ నుండి ఢిల్లీ వరకు దండుగట్టాలన్నారు. పోరాడితే పోయేది ఏమీలేదని, చరిత్రలో పోరాడిన సమాజమే విజయ తీరాలకు చేరిందన్నారు.

**బలపడిన బిసి ఉద్యమం : రిటైర్డ్ ఐఎఎస్ కొల్లేటి ప్రభాకర్**

బిసి రిజర్వేషన్ల ఉద్యమాన్ని పల్లె పల్లెకు విస్తరించాలని, రాష్ట్ర బంద్ తర్వాత బిసి ఉద్యమం రాష్ట్రంలో బలపడిందన్నారు. బిసిల బలాన్ని బలగాన్ని చూపించే తరుణ వాసనమైందన్నారు.

## ఎకరాకు రూ.30లక్షల నష్ట పరిహారం

మంత్రి ఉత్తమ్‌కు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్: సూర్యాపేట జిల్లా, హుజూర్‌నగర్ పట్టణంలో వ్యవసాయ కళాశాల నిర్మాణానికి సేకరిస్తున్న 'రైతుల భూములకు' ఎకరాకు రూ.30లక్షల నష్ట పరిహారాన్ని చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు. భూములను కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారంతో పాటు పునరావాసాన్ని కల్పించాలన్నారు. ఈ మేరకు హుజూర్‌నగర్ ప్రాంత భూ నిర్వాసితుల కమిటీ సభ్యులతో కలిసి పశ్యపద్మ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆదివారం లేఖను అందజేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణంలో వ్యవసాయ కళాశాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తున్న భూములు (1041 సర్వే నంబర్) తరతరాలుగా సాగు చేసుకుంటూ లావాణి పట్టాలు పొందిన నిరుపేద రైతులకు చెందినవని, వారు ఆ భూములను సాగు చేసుకుంటూ తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారని లేఖలో వివరించారు. వివాహాల నిమ్మితం ఆ భూములను రైతులు తమ ఆడపిల్లలకు ఇచ్చారని, ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ నేపథ్యంలో సదరు రైతుల కుటంబాల్లో విపరీతమైన సంఘర్షణకు గురి చేస్తోందని పశ్యపద్మ పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, కానీ ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు రూ.22 లక్షలతో రైతులు కొద్దిపాటి భూమినైనా కొనుగోలు చేసుకోలేని పరిస్థితులు ఉన్నాయని మంత్రి ఉత్తమ్‌కు వివరించారు. భూమి కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.30 లక్షల నష్టపరిహారాన్ని చెల్లించాలని తాము మొదటి నుంచి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని పశ్య పద్మ గుర్తుచేశారు. అలాగే రైతులు తమ పొలాల్లో లక్షల రూపాయాల ఖర్చుతో తవ్విన బావులు, బోర్లు, గొడ్డు, గోదాలను పరిగణలోకి తీసుకోవాలని, బావికి రూ.3లక్షలు, బోరుకు రూ. 2లక్షల పరిహారాన్ని చెల్లించాలని, చిన్న, సన్న కారు రైతుల బతుకుదెరువును కాపాడాలని మంత్రిని పశ్యపద్మ అన్నారు. ఇందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ భూ సేకరణ నష్టపరిహారాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ప్రాంత భూ నిర్వాసితుల కమిటీ సభ్యులు చెన్నగాని సైదులు, నర్సింహా, వి.నాగరాజు, ఎం.ప్రసాద్, రవి, కె.నరసింహ, చెన్నగాని శ్రీని, కాకి అమృతా రెడ్డి, ఇందిరాల రమేశ్, పి.లక్ష్మి , జె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## 11న కొత్తగూడెంలో మెగా జాబ్ మేళా

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి : ఎంఎల్ఎ కూనంనేని



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఈ నెల 11న కొత్తగూడెంలోని కొత్తగూడెం క్లబ్‌లో మెగా జాబ్ మేళా జరుగుతుందని ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియో గం చేసుకోవాలని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ఆదివారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ కూనంనేని మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో టెక్ మహీంద్రా, క్యాలిబర్, హెచ్‌డిఎఫ్‌సి, జెప్‌టో, శ్రీవిజయ, పేటిఎం, జస్ట్‌డయల్, ట్రైసోల్, అపోలో, హీరో, హిటాచి డిజిటల్, ఎం వరుణ్, జోయాలుకాస్, ఐటి, ఫార్మా, బిపిఓ, సర్ఫేస్ సెక్టార్ల, మార్కెటింగ్, తదితర రంగాల నుండి సుమారు 60కి పైగా పేరుగాంచిన కంపనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని, వీటిలో 3000 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. 10వ, తరగతి, ఇంటర్, అండర్ గ్రాడ్యుయేట్, డిప్లొమా హోల్డర్, బిఫార్మా, ఎంఫార్మా, హోటల్ మేనేజ్‌మెంట్, డ్రైవర్స్, బిఇ, బిటెక్,ఎం.టెక్, బిఏ, బిఎస్‌సి, బికామ్, ఎంబిఏ, ఎంసిఏ,ఎంసిఎస్, పోస్ట్ గ్రాడ్యుయేట్ అర్హతలు కలిగిన వారికి వారి అర్హతలను బట్టి ఉద్యోగాలు కల్పిస్తారని తెలిపారు. 18 సంవత్సరాల నుండి 40 సంవత్సరాల వయసున్న యువతీ, యువకులకు మంచి అవకాశమన్నారు. ట్రాన్స్‌జెండర్స్, చెవిటి, మూగ, దివ్యాంగులకు కూడా అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. పలు కంపెనీలు అర్హతలు, అనుభవాన్ని పరిగణలోకి తీసుకొంటాయని, జాబ్‌మేళాలో అనుభవం లేని వారికి కూడా ప్రాధాన్యతను ఇస్తూ అవకాశాలు ఇవ్వనున్నాయని స్పష్టం చేశారు. ఉద్యోగావకాశాల కోసం వివిధ పట్టణాలకు వెళుతున్న యువత స్థానికంగా సింగరేణి సంస్థ నేతృత్వంలో నిర్వహించే జాబ్‌మేళాకు అర్హత కలిగిన ఒరిజినల్ ధృవపత్రాలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, వాటి జిరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. ఇప్పటివరకు సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఏడు జాబ్ మేళాలు నిర్వహించగా 23,600 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కాయన్నారు. అనంతరం జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, సింగరేణి జిఎం షాలెం రాజు, అధికారులు రామక్రిష్ణ, సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, సిపిఐ నాయకులు సలిగంటి శ్రీనివాస్, ఏఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

# నవీన్ గెలుపు కోసం సిపిఐ ఇంటింటి ప్రచారం




ప్రజాపక్షం/హైదరాబాద్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని ఎల్లారెడ్డిగూడ డివిజన్‌లో ఆదివారం సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కరపత్రాలు పంచుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇ.టి. నరసింహ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ పార్టీ ప్రజలను, ప్రజల అవసరాలను పట్టించుకోకపోగా పార్టీ నాయకులు ఒంటెద్దు పోకడలతో రాష్ట్ర అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తూ కుటుంబ పాలన కొనసాగించిందని విమర్శించారు. పదేళ్ల కాలంలో విద్యావ్యవస్థ, వైద్యం, ఉపాధిని పట్టించుకోలేదన్నారు. అధికార వ్యామోహంతో నిరంకుశంగా వ్యవహరించారని విమర్శించారు. మరోవైపు బిజెపి యువత, ప్రజల ఉపాధి కల్పన గురించి ఏమాత్రం మాట్లాడకుండా విభిన్న మతాలు కలిసి ఉండే సున్నితమైన హైదరాబాద్ నగరంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి లబ్ధి పొందాలని చూస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీని నిలుపుకోలేకపోవడంలో, పునర్విభజన తర్వాత తెలంగాణకు రావాల్సిన నిధులను కేటాయించడంలో విఫలమైందన్నారు. నియంతృత్వ కుటుంబ పాలన గద్దె దించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని ప్రక్షాళన చేసే దిశగా విద్యా కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలో ఒక నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చేందుకు నూతన కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. పేదలకు ఉచిత వైద్యం అందుబాటులో ఉండేందుకు నూతన ప్రదేశంలో ఉస్మానియా ఆస్పత్రి పునర్‌నిర్మాణం చేపట్టిందన్నారు. రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్థిరత్వం కోసం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పేరిట నూతన గృహాలు కట్టించి సమగ్రమైన అభివృద్ధికి పట్టం కడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్. బోస్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు కాంపల్లి శ్రీనివాస్, నేర్లకంటి శ్రీకాంత్, బాలకృష్ణ, నరసింహ, లెనిన్, న్యాయవాది నగేష్, యాదిలాల్, భీముడు, ఉదయ్ కుమార్, అశ్వన్, సుమన్ పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో.. కాంగ్రెస్ పార్టీ హద్దులు దాటుతోంది

కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అన్ని హద్దులు దాటి వ్యవహరిస్తోందని, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఆరోపించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ మజ్లిస్ అభ్యర్థిని అద్దెకు తెచ్చుకున్నా, అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చినా గెలుస్తామో లేదోనన్న భయంతో కాంగ్రెస్ నాయకత్వం బెదిరింపులకు దిగుతోందని విమర్శించారు. ఎన్నికల ప్రకటన జరిగిన రోజే మెహిదీపట్నంలో ఆర్మీ స్థలాన్ని ఖబరస్థాన్ కోసం కేటాయించడం, బంజారాహిల్స్‌లో పెద్దమ్మగుడి కూల్చి విగ్రహం మాయం చేయడం వంటి నిర్ణయాలు ముస్లిం ఓట్ల కోసం కాంగ్రెస్ తీసుకున్న చర్యలేనని ఆయన విమర్శించారు. గుడికి భూమి ఇవ్వడానికి ముందుకు రాని ప్రభుత్వం, ఖబరస్థాన్‌లకు ఎకరాల కొద్ది భూములు ఇస్తుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి సన్న బియ్యం పథకంపై చేస్తున్న బెదిరింపులు ఎన్నికల నియమావళికి విరుద్ధమని, దీనిపై ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. మహిళలకు రూ.2 వేలు, స్కూటీలు, విద్యా భరోసా, బిసి సంక్షేమ నిధులు ఏ ఒక్కటీ అమలులో లేదన్నారు. ఇప్పు డు ప్రజలను బెదిరించి ఓట్లు కోరడం కాంగ్రెస్ నిజస్వరూపాన్ని చూపిస్తోందన్నారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం కాంగ్రెస్, బిఆర్‌ఎస్ ప్రభుత్వాలు ఏం చేశాయో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాం డ్ చేశారు. రెండు కిలోమీటర్లు ఆ రోడ్లపై నడవలేరని, డ్రైనేజీ రోడ్లపై పారుతోందని, లైట్లు లేవని, ఈ పరిస్థితుల్లో ఓటు అడగడం సిగ్గుచేటు అన్నా రు. బిజెపి తరపున రాష్ట్రవ్యాప్తంగా 50 మహా పాదయాత్రలు నిర్వహించనున్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. బిఆర్‌ఎస్ వైఫల్యాలు, కాంగ్రెస్ మోసా లు, మోదీ ప్రభుత్వం తెలంగాణకు చేసిన సేవలను ప్రజలకు ఇంటింటికీ చేరుస్తామని తెలిపారు.

## హైడ్రా ఎందుకు కూల్చడం లేదు?



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో ఉన్న మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధుల నివాసాలను హైడ్రా ఎందుకు కూల్చడం లేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ప్రశ్నించారు. నాడు 'ఇందిరమ్మ' ఇచ్చిన ఇండ్లనే ప్రస్తుతం సిఎం రేవంత్ రెడ్డి కూల్చేశారన్నారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం 'హైడ్రా ఎగ్జిబిషన్' నిర్వహించారు. అంతకుముందు బిజెపికి చెందిన మాజీ కార్పొరేటర్ నవతా రెడ్డి తదితరులు బిఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానిది నిజంగానే ప్రజా పాలన అయితే, వారికి చిత్తశుద్ధి ఉంటే పెద్దల ఇండ్లను ఎందుకు కూల్చలేదని, వారికి కనీసం నోటీసులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. హైడ్రా బాధితులకు తమ లీగల్ టీమ్ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ నాశనమైందని, సంక్షేమ పథకాలన్నీ బంద్ అయ్యాయని ఆరోపించారు. 500 రోజుల్లో మళ్లీ కెసిఆర్ ముఖ్యమంత్రిగా రాబోతున్నారన్నారు. అడ్డగోలు హామీలతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వచ్చిందన్నారు. వంద రోజుల్లో ఇస్తానన్న హామీలు ఏడు వందల రోజులైనప్పటికీ కాంగ్రెస్ పార్టీ నెరవేర్చలేదన్నారు. శేరిలింగంపల్లి ఎంఎల్ఏ అభివృద్ధి కోసమో, ప్రజల కోసమో పార్టీ మారలేదని, తన 11 ఎకరాల భూ కబ్జాను కాపాడుకునేందుకే ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారని కెటిఆర్ ఆరోపించారు. హైదరాబాద్‌ను నాశనం చేయడం తప్ప సిఎం రేవంత్ చేసింది ఏమీ లేదన్నారు. అన్ని వర్గాల ప్రజలను కూడా రేవంత్ రెడ్డి మోసం చేశారన్నారు.

## మంత్రాల నెపంతో వ్యక్తి దారుణ హత్య

తిర్యాణి మండలం పిట్టగూడలో సంఘటన



ప్రజాపక్షం/తిర్యాణి : మంత్రాలు చేస్తున్నారనే అనుమానంతో ఒక వ్యక్తిని గొడ్డలితో దాడి చేసి దారుణంగా హతమార్చిన సంఘటన కొమరం భీం జిల్లా తిర్యాణి మండలం పిట్టగూడ గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. రెబ్బెన సిఐ సంజయ్ తెలిపిన వివరాల ప్రకారం, తిర్యాణి మండలం మంగి గ్రామ పంచాయతీ పరిధిలోని పిట్టగూడ గ్రామానికి చెందిన హనుమంత్ రావు (50) తన కుటుంబ సభ్యులకు మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో అదే గ్రామానికి చెందిన సీడాం వినోద్ ఈ దారుణానికి పాల్పడ్డాడని అన్నారు. శనివారం రాత్రి హనుమంత్ రావు తన ఇంటి నుంచి బయటకు వెళ్తున్న సమయంలో సీడాం వినోద్ అతనితో గొడవ పడి, గొడ్డలితో మెడపై అతి దారుణంగా నరికి హతమార్చాడని, దీన్ని గమనించిన హనుమంతు రావు భార్య ఊర్వేత బొజ్జ బాయి అడ్డుకునేందుకు వెళ్లగా, ఆమెపై కూడా వినోద్ దాడికి యత్నించాడన్నాడని తెలిపారు. ఆమె తప్పించుకుని ఇంట్లోకి వెళ్లి గొళ్ళెం పెట్టుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడిందని, తీవ్ర రక్తస్రావంతో హనుమంతురావు అక్కడికక్కడే మరణించాడని అన్నారు. మృతుడి భార్య ఊర్వేత బొజ్జ బాయి ఫిర్యాదు మేరకు తిర్యాణి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# మొరాయిస్తున్న టూరిజం బస్సులు

ప్రయాణికుల ఆందోళన




ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రయాణికుల విశ్వాసాన్ని చాటిన తెలంగాణ టూరిజం అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి)బస్సులు ఇప్పుడు మొరాయిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నో ప్యాకేజీలకు ప్రసిద్ధి పొందిన ఈ సంస్థ బస్సులు సాంకేతిక లోపాలు, మెంటెనెన్స్, డ్రైవర్‌ల కొరతతో ప్రయాణం మధ్యలోనే ఆగిపోతున్నాయి. దీనితో రాష్ట్రం నలుమూలల నుంచి హైదరాబాద్, శ్రీశైలం, తిరుపతి, షిరిడి, నాగార్జునసాగర్, రామోజీ ఫిల్మ్ సిటీ వంటి ప్యాకేజీలకు వచ్చే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యం ఎదుర్కొంటున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లిన సమయంలో బస్సులు మొరాయించడంతో బస్సు రిపేరు కాకపోవడంతో ప్రైయివేటు టూరిస్ట్ బస్సును ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసి పంపిస్తున్నారు టూరిజం అభివృద్ధి సంస్థ అధికారులు. ఇదంతా జరిగే సరికి ఐదారు గంటల వ్యవధి కావడంతో ప్రయాణికులు దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు. బస్సులు ఇదే విధంగా మొరాయిస్తే టూరిజం సంస్థ బస్సులపై ప్రయాణికుల్లో అపవాదు ప్రబలే ప్రమాదం ఉంది. ఇప్పటికే తిరుమల దర్శనం టికెట్లు టూరిజం సంస్థకు ఏడాదిన్నర క్రితం నుంచి నిలిచిపోవడంతో తిరుపతి ప్యాకేజ్‌కు వెళ్లే ట్రిప్పులను నిలిపివేశారు. అరకొర ట్రిప్పులను మాత్రమే నడిపిస్తుంది. గతంలో తిరుపతి టికెట్లు లభించే సమయంలో ఒక్క ట్రిప్పుకు రూ.లక్ష సంస్థకు ఆదాయం చేరే కూరేది. తిరుమల టికెట్లు నిలిపివేయడంతో సంస్థకు తిరుపతి ట్రిప్పులపై ప్రస్తుతం ఎలాంటి లాభాలు రావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు బస్సులు ఫేయిల్ కాకుండా తగు చర్యలు తీసుకోవడంతో పాటు తిరుమల దర్శనం టికెట్లు లభించేటట్లు ఎపి ప్రభుత్వంతో చర్చిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**సాంకేతిక లోపాలే ప్రధాన కారణం..**

టూరిజం విభాగం ఆధీనంలో నడుస్తున్న సుమారు 28 బస్సుల్లో మూడు బస్సులు షెడ్డులో మూలుగుతున్నా యి. మిగిలిన 25 బస్సుల్లో చాలావరకు 14 నుండి 12 సంవత్సరాలు దాటిన పాత మోడల్లే. ఇందులో రెండు స్లీపర్ కోచ్‌లు, ఐదు ఓల్వా, ఐదు నాన్ ఎసి హైటెక్, నాలుగు మినికోచ్‌లు, మూడు ఈచర్ బస్సులు ఉన్నాయి. ఇందులో ఐదు బస్సులకు గత నెలలోనే ఫిట్‌నెస్ దాటిపోయినవే ఉన్నాయి. వాటిలో క్రమపద్ధతిలో సర్వీస్ లేకపోవడం, టైర్లు, బ్రేక్ వ్యవస్థలు పాడైపోవడం, ఎయిర్ కండిషనింగ్ సరిగ్గా పనిచేయకపోవడం వల్ల బస్సులు మార్గమధ్యంలోనే మొరాయిస్తున్నాయని ఆందోళన వ్యక్తం అవుతుంది.

**ప్రయాణికుల అనుభవాలు..**

శ్రీశైలం, నాగార్జున సాగర్, షిరిడి ప్యాకేజ్‌లో వెళ్లాం. మధ్యలో బస్సు ఆగిపోయి మూడు నుంచి ఎనిమిది గంటలు రోడ్డుపైనే నిలిచిపోయాం. డ్రైవర్, గైడ్ కూడా అసహాయంగా ఉన్నారు.. అని నల్లగొండ, హైదరాబాద్ ప్రయాణికులు తెలిపారు. మరో ప్రయాణికుడు సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ – టూరిజం బస్సులు కంటే ప్రైవేట్ వాహనాలు విశ్వసనీయంగా మారాయి అని వ్యంగ్యంగా రాశారు.

**అధికారుల స్పందన**

టిజిటిడిసి బస్సుల ఫ్లీట్ రీప్లేస్‌మెంట్ ప్రాజెక్టు సిద్ధమైంది. త్వరలో కొత్త వోల్వో, లగ్జరీ కోచ్‌లు రాబోతున్నాయి. అప్పటివరకు పాత బస్సుల మెయింటెనెన్స్‌ను మెరుగుపరచాలని సూచనలు ఇచ్చాం, అని టూరిజం శాఖ అధికారి ఒకరు తెలిపారు.

**నష్టంలో నడుస్తున్న టూరిజం సంస్థ**

ప్యాకేజ్ టూర్స్ ద్వారా సంవత్సరానికి కోట్ల ఆదాయం వచ్చే సంస్థకు, ప్రస్తుతం బుకింగ్‌లు గణనీయంగా తగ్గాయి. ఫలితంగా సర్వీస్, రీప్లేస్‌మెంట్ ఖర్చులకు నిధులు కేటాయించలేకపోవడం కూడా బస్సుల క్షీణావస్థకు కారణమని లోపలి వర్గాలు చెబుతున్నాయి.

**ప్రయాణికుల భద్రతపై ప్రశ్నలు..**

తాజా ఘటనలతో టూరిజం బస్సుల భద్రతపై ప్రశ్నలు మళ్లీ లేవుతున్నాయి. ఎయిర్ బ్రేక్ ఫెయిల్యూర్, ఇంజిన్ వేడి అవ్వడం, కండిషనింగ్ వ్యవస్థలు సరిగా పనిచేయకపోవడం వంటి అంశాలపై సాంకేతిక తనిఖీ అవసరమని రోడ్డు భద్రత నిపుణులు సూచిస్తున్నారు.

## అంబేద్కర్ యూత్ అధ్యక్షుడిగా మధు



**ప్రజాపక్షం/వేములపల్లి:** అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా పుట్టల మధు ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఫ్రండ్లీ ఓటింగ్‌లో పుట్టల అనిల్ పై పుట్టల మధు 28 ఓట్ల ఆధిక్యంలో అంబేద్కర్ యూత్ అధ్యక్షుడిగా గెలుపొందారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మధు మాట్లాడుతూ వేములపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్న యూత్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ రెండు సంవత్సరాలలో నేను యువతను చెడుదోవ నుంచి మంచి మార్గంలో నడిపిస్తు సమాజంలో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై అవగాహన కల్పిస్తూ విద్యా ఉద్యోగం ఉపాధి రంగాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి యువతకు ఆదర్శప్రాయంగా నిలిచే విధంగా ప్రయత్నం చేస్తానని అన్నారు.

## ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ (చింతలపాలెం) :** చింతలపాలెం మండల కేంద్రంలోని శ్రీఅభయాంజనేయ స్వామి దేవస్థానం ఆరవ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలతోపాటు, శ్రీసీతారామ చంద్ర స్వాములకు పంచామృతాలతో అభిషేక కార్యక్రమం, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అభయాంజనేయ స్వామి వారి ఆశీస్సులు అందరిపై ఉండి పంటలు బాగా పండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. దర్శించిన వారికి వారి కోరికలు స్వామి ఆశీస్సులతో నెరవేరుతున్నాయన్నారు. ఆలయ పూజారి నార్ల మహేష్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇబ్బందులు కలగొద్దు

### పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని ఆరెగూడెం, పెద్దకాపర్తి గ్రామాలలోని కాటన్ పరిశ్రమలలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలను ఆదివారం స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి రైతుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిని సిసిఐ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే గిట్టుబాటు ధరను రైతులు పొందాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిసిఐ కేంద్రాలలో ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం వెల్మినేడు గ్రామ పంచాయతి పరిధిలో నిర్మించిన ఫాబెక్స్ స్టీల్ స్ట్రక్చర్ పరిశ్రమను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జగ్గయ్యపేట, మైలవరం శాసనసభ్యులు శ్రీరాం తాతయ్య, వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెల్మినేడు సింగిల్ విండో చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కందిమళ్ళ శిశుపాల్‌రెడ్డి, బొంతల అంజిరెడ్డి, మారగోని అంజనేయులు, వనమా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండల కేంద్రంలో జాతీయ రహదారి 163 పై జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగులోనికి వచ్చింది. బీబీనగర్ ఎస్‌హెచ్‌ఓ సిఐ ప్రభాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ జిల్లా బోడుప్పల్ టెలిఫోన్ కాలనీకి చెందిన గర్దాస్ ప్రశాంత్(32) అతని భార్య గర్దాస్ ప్రసూన(28) ఇద్దరు కలిసి బజాజ్ పల్సర్ టీఎస్08GN6604 నెంబర్ గల బైక్‌పై భువనగిరి వైపు వెలుతుండగా బీబీనగర్ చెరువు కట్ట దగ్గర ఆగి ఉండగా వెనుక వైపు నుండి వస్తున్న మహేంద్ర థార టీఎస్Ts08 0044 నెంబర్ గల వాహనం అతివేగంగా వచ్చి భార్యాభర్తలను ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. భర్త రోడ్డుపై పడి భార్య చెరువులోకి పడి మరణించింది. వాహనంలో ప్రయాణిస్తున్న టి.షణ్ముఖ, డి.భరత్, సాయి రిత్ ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో కేసు నమోదు చేసి భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

## తూకాల మోసం...

### లబోదిబోమంటున్న కొనుగోలుదారులు



**ప్రజాపక్షం/మోతె :** మండల పరిధిలోని మామిళ్ళగూడెం గ్రామంలో ప్రతి ఆదివారం సంత జరుగుతుంది. చుట్టు పట్టు గ్రామాల ప్రజలు సంతలో కూరగాయలు మొదలుకొని వట్టిచేపలు, అల్లం, వెల్లిపాయలు, ఉల్లిగడ్డలు, రక రకాల పండ్లు, పప్పుదినుసులు కొనుగోలు చేయడం జరుగుతుంది. రేటులో కొంత తగ్గింపు చేసుకొని నచ్చిన ధరను అడిగి మరీ కొనుగోలు చేసే వినియోగదారులకు ఒక కూరగాయల వ్యాపారి కాంటాలు వేసే తరాజులో తేడాలు గమనించిన కొంతమంది రెండు చిన్నసైజులో ఉన్న టమాటాలను కాంటా వేయగా పావు కిలో పైనే ఉన్నట్లు గుర్తించడంతో మోసం జరిగినట్లు సంతలో గొడవకు దిగారు. వెంటనే ప్రతి ఒక్కరి కాంటాలు తనిఖీ చేయాలని సంబంధిత అధికారులను వారు డిమాండ్ చేశారు. కూరగాయల వ్యాపారి మాత్రం బూతులు తిడుతూ వినియోగదారులపై విరుసుకపడింది. మోసం చేసేదే కాకుండా తిరిగి మాపై గొడవ పడుతావా నీపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వినియోగదారులు హెచ్చరించారు. తునికల కొలతల అధికారులు వెంటనే స్పందించి సంతలలో జరిగే మోసాలను గుర్తించి మోసకారుల ఆట కట్టించాలని వినియోగదారులు కోరుతున్నారు.

## మానవీయ విలువల సమాహారం బైరెడ్డి కవిత్వం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఆర్ద్రత,మానవీయ విలువలు సామాజిక స్పృహ బైరెడ్డి కృష్ణారెడ్డి కవిత్వంలో ప్రతిబింబిస్తాయని మాకేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు, ప్రముఖ సాహితీవేత్త ప్రసేన్ అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సుంకిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బైరెడ్డి కృష్ణారెడ్డి రాసిన ది అన్ ఫేడింగ్ అన్ ఫోల్డ్ అనే ఆంగ్ల గ్రంధాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. అదేవిధంగా బైరెడ్డి కృష్ణారెడ్డి రాసిన ఆర్తి 5వ సంపుటాన్ని ప్రముఖ కథా రచయిత మేరెడ్డి యాదగిరిరెడ్డి ఆవిష్కరించారు. ఆర్తి కవిత్వంపై ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ సీతారాం,డాక్టర్ కోయి కోటేశ్వరరావు,పగడాల నాగేందర్ ఉపన్యాసించారు. ఈ సందర్భంగా ది అన్ ఫేడింగ్ అన్ ఫోల్డ్ గ్రంథంపై సతీష్ బైరెడ్డి, డాక్టర్ ఎం రాం భాస్కరరాజు, దొన్నగంటి కృష్ణ విశ్లేషించారు. అనంతరం జరిగిన సాహితీ మిత్రుల చర్చ గోష్టికి డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలోమునాసు వెంకట్, డాక్టర్ నోముల రాహుల్,సమన్వయకర్తలుగా డాక్టర్ సాగర్ల సత్తయ్య, బండారు శంకర్ వ్యవహరించారు. ఎం. వి. గోనారెడ్డి, అంబటి వెంకన్న, చకోనా, ఎలికట్టె శంకర్రావు, పెరుమాళ్ళ ఆనంద్, నోముల రజనీష్, రాహుల్ పెద్దిరెడ్డి గణేష్, శీల అవిలేను, కోమటి మధుసూదన్, ఎస్ రాజేశ్వర శాస్త్ర పాల్గొన్నారు.



## ప్రభుత్వ సహకారంతో.. ఉద్యోగుల సమస్యలకు మోక్షం!

### రెవెన్యూ ఉద్యోగులకు 2026 పదోన్నతుల సంవత్సరం

### ఉద్యోగుల జెఏసి చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ప్రభుత్వ సహకారంతో రెవెన్యూ ఉద్యోగుల సమస్యలకు మోక్షం లభిస్తుందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి అన్నారు. భూమి ఉన్నంత వరకు రెవెన్యూ డిపార్ట్మెంట్ ఉంటుందని, రెవెన్యూ ఉద్యోగులకు 2026 పదోన్నతుల సంవత్సరం అవుతుందన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, న్యాయమైన డిమాండ్ల సాధనే టీజీటీఏ, టీజీఆర్ఎస్ఏ లక్ష్యం అని ఆయన అన్నారు. తెలంగాణ తహశీల్దార్ల సంఘం (టీజీటీఏ), తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం యాదాద్రిలో వి.లచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో లచ్చిరెడ్డి మాట్లాడుతూ జీపీవోలు వచ్చాక ప్రజలకు, రైతులకు రెవెన్యూ సేవలు పెరిగాయన్నారు. సమీప భవిష్యత్తులో రెవెన్యూ ఉద్యోగులకు పదోన్నతులు వస్తాయని, త్వరలోనే 100 మందికి పైగా ఎమ్మార్వో లు డిప్యూటీ కలెక్టర్లు కాబోతున్నారన్నారు. రెవెన్యూ డిపార్ట్మెంట్‌ను కపడుకుంటూనే రెవెన్యూ, ప్రభుత్వ ఉద్యోగుల, ప్రజల సంక్షేమం కోసం మనం పాటుపడాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చేసిన ప్రతి తీర్మానాన్ని అమలు చేసేల కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుందామన్నారు. 2026 జనవరిలో రెవెన్యూ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్ ఉంటుందన్నారు. రెవెన్యూ ఉద్యోగులు బాధ్యత గా ఉద్యోగం చేయడంతో పాటు కుటుంబానికి సమయం ఇవ్వాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలో రెవెన్యూ హౌసింగ్ సొసైటీ కింద వెయ్యి ఎకరాలు కొనుగోలు చేసేందుకు ప్రయత్నం జరుగుతుందన్నారు. అలాగే ప్రతి జిల్లాలో రెవెన్యూ కార్యాలయాల నిర్మాణం కోసం ప్రయత్నాలు చేస్తామన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో రెవెన్యూ క్లబ్ కట్టుకోబోతున్నామని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు రెవెన్యూ శాఖ బలోపేతం అవుతుందన్నారు. జీపీవోలు, డీటీలు, డిప్యూటీ కలెక్టర్ల నియామకంతో పనిభారం క్రమంగా తగ్గుతుందన్నారు. సమష్టి నిర్ణయాలతోనే మనం ముందుకు వెళ్దామని లచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. గత సంవత్సరంలో టీజీటీఏ, టీజీఆర్ఎస్ఏ చేసిన కార్యక్రమాలు, ప్రాతినిధ్యాలపై అధ్యక్షులు రాములు, బాణాల రాంరెడ్డి వార్షిక నివేదికలను సమర్పించారు. అలాగే రెవెన్యూ ఉద్యోగుల పదోన్నతులు, ప్యానెల్లు, బదిలీలపై, రెవెన్యూ అసోసియేషన్ భవనాల కోసం భూముల గుర్తింపు, కేటాయింపుపై, ప్రభుత్వ ఉద్యోగుల హౌసింగ్ పాలసీ, నగదు రహిత చికిత్స (ఇ.హెచ్.ఎస్)పై, రెవెన్యూ శాఖ, భూభారతిపై టీజీటీఏ, టీజీఆర్ఎస్ఏ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చే అంశాలపై ప్రధానంగా చర్చించారు.

## పైలట్ పద్ధతిలో జనగణన : కలెక్టర్



**ప్రజాపక్షం/నల్లగొండ(తిప్పర్తి):** జనగణన కార్యక్రమంలో భాగంగా తిప్పర్తి మండలంలో నిర్వహించనున్న 2027 జనగణన ముందస్తు కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ లను ఆదేశించారు. 2027 జనాభా లెక్కల సేకరణలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో 3 ప్రాంతాలలో ముందస్తు గణన కార్యక్రమాన్ని పైలట్ పద్ధతిలో చేపట్టేందుకు ఎంపిక చేయగా, పట్టణ ప్రాంతం లో జిహెచ్ఎంసి, గ్రామీణ ప్రాంతంలో తిప్పర్తి మండలం,గిరిజన ప్రాంతంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు ఉన్నాయి.ఇందులో భాగంగా తిప్పర్తి మండలంలోని మామిడాల, ఇండ్లూరు, సర్వారం, తిప్పర్తి ,జంగారెడ్డిగూడెం లలో జనగణన చేయనున్నారు. ఇందుకుగాను 35 మంది ఎన్యుమరేటర్లు,6 మంది సూపర్వైజర్లకు ఉద్దేశించి తిప్పర్తి రైతు వేదికలో ఆదివారం నుండి 3 రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ మొదటి సారిగా డిజిటల్ పద్ధతిలో జనగణన నిర్వహిస్తున్నందున ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు వస్తే రాష్ట్ర స్థాయికి ఈ సమస్యలను తీసుకువెళ్లడం ద్వారా సరిచేసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.ఈ ముందస్తు జనగణన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 10 నుండి15 వరకు పైన పేర్కొన్న 5 గ్రామాలలో ఎన్యుమరేటర్లు ఇండ్లకు వెళ్లి మొబైల్ యాప్‌లో ఇండ్లను మ్యాపింగ్ చేయడం జరుగుతుంది. అనంతరం ఈనెల15 నుండి30 వరకు ఇంటింటికి వెళ్లి నిర్దేశించిన ప్రొఫార్మాలో డిజిటల్ విధానంలో జనాభా లెక్కలను పూర్తి వివరాలతో సేకరించడం జరుగుతుంది. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రాష్ట్ర గణాంక శాఖ జెడి లాజరస్, ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, తహసీల్దార్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథం

### సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థుల్లో విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పదాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబురాలు పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం అందించేదుకు ప్రతి సంవత్సరం చెకుముకి సైన్స్ సంబురాలు నిర్వహించడం అభినందనీయమని, మూఢనమ్మకాలు, ఆరోగ్య ఆహారపు అలవాట్ల అవగాహన కార్యక్రమాలను, మూర్ఛ రోగులకు ఉచిత వైద్య శిబిరాలు జేవీవీ నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అవసరం ఉన్న చోట సహాయ, సహకారాలు అందిస్తామని అన్నారు. జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కోల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ వైఖరులు పెంపొందించేందుకు 8,9,10 తరగతలు విద్యార్థులకు చెకుముకి సంబురాలు పేరుతో ఈనెల 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి, డిసెంబర్ 12,13, 14 తేదీలోల కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి వ్రాత పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఇట్టి పరీక్షలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కట్టా మధుసూదన్, ఉస్మాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## ఇదేం దోపిడీ...!


### చికెన్ బేరం... సిండికేట్ వ్యాపారం...

### పౌల్ట్రీ అసోసియేషన్ నిర్ణయించిన ధరకన్నా...

### కిలోకి రూ.46 నుండి రూ.80లు అదనం...

### కట్టడి చేసే నాధుడేలేడా...





**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో చికెన్ సెంటర్లు దాదాపు 100కుపైగా ఉన్నాయి. రోజువారీగా వేలాది కిలోల చికెన్ అమ్ముడు పోతుంది. ఈ వ్యాపారులంతా గత పది రోజులుగా సిండిగేట్‌గా మారి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ధరలు పెంచి అమ్మకాలు జరుపుతున్నారు. పౌల్ట్రీ బజార్ వారి రేట్ షీట్ల ద్వారా వివిధ అసోసియేషన్లు, పౌల్ట్రీ కంపెనీలు నిర్ణయించి ప్రసార మాధ్యమాల ద్వారా ప్రకటించిన ధరలకు అనుగుణంగా వారి వ్యాపారాలను కొనసాగించాలి, కానీ అందు కు విరుద్ధంగా అమ్మకాలు జరిపి వినియోగదారులను దోచుకుంటున్నారు. జిల్లాలో కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటిలలో చికెన్ కిలో ధరలు గత పది రోజుల నుండి రూ.220 నుండి రూ.194ల వరకు ఉన్నాయి. కానీ సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాత్రం రూ.240లకు అమ్ముతున్నారు. ఏ ఒక్క రోజు కూడా ఒక్క రూపాయి కూడా ధర తగ్గింది గాని పెరిగింది గాని లేదు. దీనిని బట్టి చూస్తే కిలోకు రూ.46 నుండి రూ.80 లు అదనంగా అమ్మి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాలలో చికెన్ ధరలు పరిశీలిస్తే ఇలా ఉన్నాయి. సూర్యాపేటలో స్కిన్ కిలో ధర రూ.240, స్కిన్ లెస్ రూ.260, బోన్‌లెస్ రూ.500, లైవ్ కోడి కిలో రూ.155 అమ్మకాలు జరుపుతుండగా, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటి పరిధిలో కిలో ధర రూ.194, స్కిన్ లెస్ రూ.221, బోన్‌లెస్ రూ.420, లైవ్ కోడి కిలో హోల్‌సెల్ రూ.114, రిటైల్ రూ.134 గా ఉన్నాయి. ఈ వ్యత్యాసంపై స్థానిక వ్యాపారులను ప్రశ్నిస్తే యూనియన్ నిర్ణయించిన ధరలకే చికెన్ అమ్మకాలు జరుపాలని తీర్మానించడం జరిగిందని, నిర్ణయించిన ధరకన్నా తక్కువకు అమ్మితే రూ.10వేల జరిమానా వేస్తారని చెబుతున్నారు.

వ్యాపారులు సిండికేట్‌గా మారి చికెన్ ధరలు పెంచి దోపిడి చేస్తుండడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. వీరి దోపిడిని కట్టడి చేసే నాధుడేలేడా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పౌల్ట్రీ బజార్ వారి రేట్ షీట్ల ద్వారా వివిధ అసోసియేషన్లు, పౌల్ట్రీ కంపెనీలు నిర్ణయించి ప్ర సార మాధ్యమాల ద్వారా ప్రకటించిన ధరలకు అనుగుణంగా వారు అమ్మకాలు జరిపితే కిలోకు 30 శాతం వరకు లాభాలు ఉంటాయని, అదనంగా మరో రూ.46 నుండి రూ.80లు పెంచి అమ్మడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో ఇతర ప్రాంతాలలో లేని ధరలు సూర్యాపేట జిల్లా కేంద్రంలోనే ఉండడంపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఈ వ్యాపారుల దోపిడిని అరికట్టి ప్రసార మాధ్యమాల ధరలకు అమ్మకాలు జరిపేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



## రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు వరికి , పత్తికి ఎకరాకు 30000 నష్ట పరిహారం చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో బల్కే సత్తయ్య, జాల సత్యనారాయణ, రైతుల నేలకు ఒరిగిన వరి, పత్తి, పంటలను సిపిఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కురిసిన తుఫాను కారణంగా మండలంలోని వరి పంటలకు , పత్తి చేనులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. వరి చేలు నేల మీద పడడంతో వడ్లు, పొలాల్లోనే మొలకెత్తడం జరిగింది. ఆరు కాలం కష్టపడి వేసిన పంటలు చేతికొచ్చే సమయంలో తుపాను కారణంగా తీవ్ర నష్టం జరిగిందన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో తుఫాను కారణంగా నష్టపోయిన రైతుల పొలాలను పరిశీలించి నష్టపరిహారం అందే విధంగా చూడాలని కోరారు. కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి కొర్రీలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ శాఖ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, సహాయ కార్యదర్శి ఉడత రామలింగం, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శంకర్, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరు విప్లవ్, బద్దుల సుధాకర్, బోయ మంకులు, గుండెబోయిన భాస్కర్ పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో రెండు పాడి ఆవులు మృతి



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని వేలుపల్లి గ్రామానికి చెందిన రైతు పిన్నపురెడ్డి సుధీర్ రెడ్డికు చెందిన రెండు పాడి ఆవులు విద్యుత్ ఘాతానికి గురై మృతిచెందిన విషాద సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. రైతు తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగా తన వ్యవసాయ పొలం వద్ద నుండి పాడి ఆవులను మేతకు తీసుకెళ్లి వస్తుండగా, విద్యుత్ తీగ తగిలి ఆవులు అక్కడికక్కడే మృతి చెందినట్లు రైతు సుధీర్ రెడ్డి కన్నీటి పర్యంతమయ్యాడు. ఒక్కో ఆవు ధర సుమారు 80,000 ఉంటుందని, రెండు ఆవుల మరణంతో ఒక లక్ష అరవైవేయిల రూపాయల తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని, తమను ఆదుకుని, నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని, అధికారులను రౌతు కుటుంబ సభ్యులు వేడుకున్నారు.

## ఈనెల 7న రిటైర్డ్ ఉద్యోగుల నిరసన

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఈనెల 7నహైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద జరుగు నిరసన ధర్నా కార్యక్రమానికి రిటైర్డ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలి రావాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం ఆ సంఘం జిల్లా కార్యాలయ భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు ఈనెల 7న రాష్ట్ర పెన్షనర్ల అపరిస్కృత సమస్యలపై నిరసన ధర్నా కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని రిటైర్డ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోజిల్లా అధ్యక్షులు జి.వెంకట్ రెడ్డి,గౌరవాధ్యక్షులు ఎన్. రంగయ్య,ప్రధాన కార్యదర్శి,జె శ్రీశైలం,ఆర్థిక కార్యదర్శి జి మోహన్ రెడ్డి,ఉపాధ్యక్షులు ఎస్.అంజనేయులు,యం క్రిష్ణయ్య,కార్యదర్శి హుస్సేన్ ,యం వెంకట్ రెడ్డి,ప్రచార కార్యదర్శి యం. శంకర్ రెడ్డి,మండల అధ్యక్షు,కార్యదర్శులు సత్యం,వాసుదేవ్ పాల్గొన్నారు.



### వ్యాపారుల దోపిడీని అరికట్టాలి : జి వినయ్




చికెన్ వ్యాపారుల దోపిడిని అరికట్టాలని సూర్యాపేట పట్టణానికి చెందిన వినియోగదారుడు వినయ్ సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఆయన ప్రజాపక్షంతో మాట్లాడుతూ వ్యాపారులు సిండికెట్ అయి వినియోగదారుల వద్ద స్టేట్ అసోసియేషన్ రోజువారీగా ప్రసార మాధ్యమాలలో ప్రకటించిన విధంగా కాకుండా జిల్లాలో, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అమ్మకాలు జరపడం సరికాదన్నారు. చికెన్ సెంటర్ల వ్యాపారులు వారి సంక్షేమానికి అసోసియేషన్ ఏర్పాటు చేసుకుంటే ఏవరికి అభ్యంతరం లేదన్నారు. సిండికేట్‌తో వినియోగదారులను దోచుకోవడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు.

### ఇష్టారాజ్యంగా ధరల పెంపా? : అశ్విన్ కుమార్



జిల్లాలో, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చికెన్ సెంటర్ వ్యాపారులు సిండికెట్‌గా మారి ధరలు పెంచి అమ్మడం ఏమిటని సూర్యాపేట పట్టణానికి చెందిన వినియోగదారుడు అశ్విన్ కుమార్ ప్రశ్నించారు. ఆయన ప్రజాపక్షంతో మాట్లాడుతూ చికెన్ సెంటర్ నిర్వాహకులు ప్రసార మాధ్యమాలలో రాష్ట్ర అసోసియేషన్ నిర్ణయించి ప్రకటించిన ధరలలోనే 30శాతం లాభాలు ఉంటాయని, అదనంగా కిలోకు మరో రూ.46 నుండి రూ.80 వరకు అదనంగా అమ్మి వినియోగదారులను దోచుకోవడం విచారకరమన్నారు. ఈ ధరలను సంబంధిత అధికారులు నియంత్రించి, వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## 2వ విడత ఎన్నికల ప్రచారానికి 40 మంది కాంగ్రెస్ స్టార్ క్యాంపైనర్లు



**న్యూఢిల్లీ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల రెండవ దశకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి కార్జున్ ఖర్గే, సీనియర్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, కన్హయ్య కుమార్, స్వతంత్ర ఎంపి పప్పు యాదవ్‌లతో పాటు పార్టీకి చెందిన 40 మంది స్టార్ క్యాంపైనర్లు ప్రచారంలో పాల్గొననున్నారు. ఈ జాబిలో బిహార్ ఎఐసిసి ఇన్‌ఛార్జ్ కృష్ణ అల్లవారు, బిహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేష్ రామ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కెసి వేణుగోపాల్, భూపేశ్ బఘేల్, సచిన్ పైలట్, రణ్‌దీప్ సుర్జేవాలా, సయ్యద్ నసీర్ హుస్సేన్, అలాగే సీనియర్ నాయకులు అశోక్ గెహ్లాట్, తారిఖ్ అన్వర్, గౌరవ్ గొగోయ్, మహ్మద్ జావేద్, అఖిలేష్ ప్రసాద్ సింగ్‌లు కూడా ఉన్నారు. బిహార్ ఎన్నికలు నవంబర్ 6, 11 తేదీలలో రెండు దశల్లో జరగనున్నాయి.

# వ్యాపారుల చేతుల్లో మోదీ రిమోట్‌కంట్రోల్

### బిహార్ ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ
### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంటే మన ప్రధానికి వణుకు





**బెగుసరాయ్/ఖగారియా:** ప్రధాని నరేంద్ర మోదీపై బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. అమెరికా అధ్యక్షుడుడొనాల్డ్ ట్రంప్‌కు భయపడటమే కాకుండా పెద్ద వ్యాపారవేత్తల చేతుల్లో రిమోట్ కంట్రోగా మారారని ఆరోపించారు. ఆదివారం రాహుల్ గాంధీ బెగుసరాయ్, ఖగారియా జిల్లాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీల్లో పాల్గొని ప్రసంగించారు. అపారమైన ఛాతి ఉన్నంత మాత్రాన బలవంతులు కారని, బలహీనమైన శరీరాన్ని కలిగి ఉన్నప్పటికీ, ఆ కాలంలో అగ్రరాజ్యాలుగా ఉన్న బ్రిటిష్ వారిని ఎదుర్కొన్న మహాత్మా గాంధీని చూడాలని మోదీకి సూచించారు. 56 అంగుళాల ఛాతి ఉన్న నరేంద్ర మోదీ ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్‌తో సైనిక వివాదం రెండు రోజుల్లో ముగిసిన తరువాత ట్రంప్ తనకు ఫోన్ చేసినప్పుడు ఆయన తీవ్ర భయాందోళనకు గురయ్యారని, మోదీ ట్రంప్‌కు భయపడటమే కాదు, అంబానీ, అదానీ కూడా ఆయనను రిమోట్ కంట్రోల్‌గా చేసుకున్నారని విమర్శించారు. 1971లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీని అమెరికా బెదిరించిందని, కానీ ఆమె భయపడలేదు, చేయవలసినది చేశారని రాహుల్‌గాంధీ గుర్తుచేశారు. 'కానీ ట్రంప్ ఆపరేషన్ సిందూర్ ఆపమని మోదీకి చెప్పినప్పుడు, అతను దానిని ఆపారన్నారు. జిఎస్‌టి, నోట్ల రద్దు వంటి మోదీ ప్రభుత్వ ప్రధాన నిర్ణయాలన్నీ 'చిన్న వ్యాపారాలను నాశనం చేయడం, పెద్ద వ్యాపారాలకు ప్రయోజనం చేకూర్చడం లక్ష్యంగా పెట్టుకున్నవేనని మండిపడ్డారు. తమ విధానం భిన్నంగా ఉంటుందని, తాము చిన్న వ్యాపారాలను ప్రోత్సహిస్తామని చెప్పారు. ఫోన్లు, టీషర్టులపై చైనాలో తయారుచేసినలేబుళ్లస్థానంలో బీహార్‌లో తయారు చేసిన ట్యాగ్‌లతో భర్తీ చేయాలనుకుంటున్నామని ఉద్ఘాటించారు. ప్రధాని ఓట్ల కోసం ఏదైనా చేయగలరని, యోగా చేయమని అడిగిన వెంటనే కొన్ని ఆసనాలు వేసి చూపిస్తారని ఎద్దేవా చేశారు. ఓట్ల కోసంవేదికపై కూడా డ్యాన్స్ కూడా వేస్తారన్నారు. ఎన్నికల రోజు వరకు ఓటర్లు ఎలా ఆడిస్తే మోదీ అలా ఆడుతారన్నారు. ఎందుకంటే ఎన్నికల తర్వాత అతను తనకు ఇష్టమైన కార్పొరేట్ల కోసం మాత్రమే పని చేస్తారని ఆరోపించారు. ఇండియా కూటమి బిహార్‌లో అధికారంలోకి వస్తే ఏ ప్రత్యేక కులం కోసమో కాకుండా ప్రతి వర్గానికి ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వామ్యం కల్పిస్తుందని భరోసానిచ్చారు. నిజమైన సమస్యలపై, నిరుద్యోగం వంటి వాటిపై ప్రశ్నలు లేవనెత్తకుండా యువత దృష్టిని మళ్లించడానికి ప్రధాని వారిని రీల్స్ చూడమని అడుగుతున్నారని ఆరోపించారు. కాగా, ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి భాగస్వామి ముఖేష్ సాహ్ని కూడా పాల్గొన్నారు. ఆయన వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీకి గత అసెంబ్లీలో ఎమ్మెల్యే లేనప్పటికీ, ఆయనకు డిప్యూటీ సిఎం పదవి ఇస్తామని హామీ ఇచ్చారు. సాహ్నివైపు చూస్తూ ఆయనను డిప్యూటీ సిఎం చేయాలనే ఉద్దేశ్యం వెనుక ఒక ఆలోచన ఉందని, సమాజంలోని అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నామన్నారు. ఒక పేద రైతు తనను వివాహానికి ఆహ్వానిస్తే వేళ్తానని, కానీ పెద్ద వ్యాపారాలు కలిగి ఉన్న వ్యక్తుల నుండి అలాంటి ఆహ్వానాలను తిరస్కరిస్తానన్నారు. జెడియు అధ్యక్షుడు నితీష్ కుమార్ నేతృత్వంలో గల బిహార్‌లోని ఎన్‌డిఎ ప్రభుత్వం 'వాస్తవానికి రాష్ట్రంలోని ముగ్గురు–నలుగురుఅధికారులసహాయంతోఢిల్లీ నుండి నియంత్రించబడుతోందని రాహుల్‌గాంధీ ఆరోపించారు.

### చేపలుపట్టిన ప్రతిపక్షనేత



బిహార్‌లో ఎన్నికల ప్రచారంలో ఉన్న రాహుల్ గాంధీ ఆదివారం కొంత సమయం చేపలు పట్టారు. బెగుసరాయ్ జిల్లాలో ఒక ర్యాలీలో ప్రసంగించినతర్వాత చేపలు పట్టడానికి వెళ్లారు. ముఖేష్ సాహ్నితో కలిసి ఒక చెరువు మధ్యలోకి చేరుకోవడానికి పడవ ఎక్కారు. చొక్కా, లోదుస్తుల వరకు విప్పి, వల విసిరారు. తన ట్రేడ్ మార్క్ తెల్లటి టీషర్టు, కార్గో ప్యాంటు ధరించి 'రాహుల్ గాంధీ జిందాబాద్' అనే నినాదాల మధ్య సాహ్నిని అనుసరించారు. ఆ ప్రదేశంలో పెద్ద సంఖ్యలో మత్స్యకారులు కూడా ఉన్నారు. వారిలో కొందరు నడుము లోతు నీటిలో నాయకులతో చేరడానికి డైవ్ చేశారు. ఈ ఘటన వీడియో క్లిప్‌ను కాంగ్రెస్ తన ఎక్స్ హ్యాండిల్‌లో షేర్ చేసింది. గాంధీ మత్స్యకారులతో 'వారు తమ పనిలో ఎదుర్కొంటున్న సవాళ్లు, పోరాటాలను' కూడా చర్చించారని పేర్కొంది. చేపలు పట్టడం నిషేధించబడిన మూడు నెలల పాటు సాగే లీన్ పీరియడ్‌లో చేపల పెంపకం కోసం బీమా పథకం, ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సహాయం వంటి ఇండియా కూటమివాగ్దానాలను కూడా సోషల్ మీడియా పోస్ట్ హైలైట్ చేసింది.

## ఆపరేషన్ సిందూర్ షాక్ నుంచి
# పాక్, కాంగ్రెస్ కోలుకోలే...

### బిహార్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, ఆర్‌జెడిపై ప్రధాని మోదీ విమర్శల వర్షం



**ఆరా/నవాడ :** 'ఆపరేషన్ సింధూర్' నుంచి అటు పాకిస్థాన్,ఇటుకాంగ్రెస్ తేరుకోలేకపోతున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆ సమయంలో పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై బాంబులు పడుతున్నప్పుడు ఇక్కడ కాంగ్రెస్ రాజకుటుంబం నిద్రపోలేదని ఎద్దేవా చేశారు. ఆదివారం మోదీ భోజ్‌పూర్, నవాడ జిల్లాల్లో వరుస ర్యాలీలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వి యాదవ్‌ను కాంగ్రెస్ అంగీకరించడానికి ఇష్టపడలేదని, అయితే కాంగ్రెస్ తలపై తుపాకీఎక్కుపెట్టి మరీ ఆర్‌జెడి అవకాశాన్ని దక్కించుకుందన్నారు.జంగిల్‌రాజ్ పాఠశాలలో పాఠాలు నేర్చుకున్నారని,అలాంటి అంశాలు బిహార్‌కు ఎప్పటికీ మేలు చేయవని ఆరోపించారు. బిహార్ ఎన్నికల్లో ఆర్‌జెడిని ఓడించాలని కాంగ్రెస్ కోరుకుంటోందని, నవంబర్ 11న రెండవ దశ పోలింగ్ ముగిసే వరకు వేచి ఉండాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ, యాదవ్ పేరు ప్రస్తావించకుండానే ప్రధాని మాట్లాడుతూ, ఓటర్ అధికార్ యాత్ర ఆర్‌జెడి సొంత అవకాశాలను దెబ్బతీస్తుందని తేజస్వీ భయపడుతున్నాడని, అందుకే, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడికి వ్యతిరేకంగా ఆర్‌జెడి అభ్యర్థిని నిలబెట్టిందన్నారు. ఎన్నికలు ముగియగానే ఆ రెండు పార్టీల నేతలు ఒకరి తలలుఒకరు బద్దలు కొట్టుకుంటారన్నారు. బిహార్ ప్రజలు జంగల్ రాజ్‌ను ఇంకా మర్చిపోలేదని, ఆ పార్టీ దారుణంగా ఓడిపోబోతోందన్నారు. భోజ్‌పూర్, పరిసర జిల్లాలు సాయుధ దళాలలో పెద్ద సంఖ్యలో నియామకాలను అందించడంలో ప్రసిద్ధి చెందాయనిఆయన పేర్కొన్నారు, జాతీయ భద్రత, దానినినిర్ధారించే వారు తన ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైనవారని అన్నారు. 'ఒక ర్యాంకు ఒక పెన్షన్ (ఒఆర్‌ఒపి) ఫలితంగా రూ. లక్ష కోట్లు పంపిణీ చేయబడిందని, ఇది సైనికుల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తోందని అని ఆయన అన్నారు. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేశామని, 'ఉగ్రవాదులను వారి స్వస్థలంలో మట్టికరిపిస్తామని చెప్పామని, ఆపరేషన్ సిందూర్‌తో ఆ వాగ్దానాన్నిమళ్ళీ నెరవేర్చామన్నారు. ఇది దేశాన్ని గర్వపడేలా చేసిందన్నారు.అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హత్య తర్వాత చెలరేగిన అల్లర్లను ప్రస్తావిస్తూ,'1984లో నవంబర్12తేదీల్లో ఢిల్లీలో సిక్కులు ఊచకోతకు గురయ్యారని, దోషులను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహిస్తోందని, ఈ మారణహోమం పట్ల ఆ పార్టీ కాంగ్రెస్ క్షమాపణ చెప్పలేదని మండిపడ్డారు. బిహార్‌లో దాక్కున్న చొరబాటుదారులను కాపాడేందుకే రాహుల్ గాంధీ రాష్ట్రంలో యాత్రను నిర్వహించారు.చొరబాటుదారులను బిహార్ నుంచి తరిమికొట్టాల్సిందే.లేదంటే బిహారీల వనరులనువాళ్లుకబలిస్తారు. బిహార్‌లోని వీర్ కున్వర్ సింగ్ జన్మస్థలం జగదీశ్‌పూర్‌ను డెవలప్ చేయాలని మా కూటమి భావిస్తోంది. 1857 సిపాయిల తిరుగుబాటులో పాల్గొన్న భారత విప్లవ యోధుల్లో వీర్ కున్వర్‌సింగ్‌ముఖ్యులు. భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్నినిలపాలనేధ్యాసకానీ,ఆసక్తికానీ ఆర్‌జెడి,కాంగ్రెస్‌లకుఉండదు. మేం ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళానిర్వహించాం. ఇటీవలే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఛట్ పూజను అపహాస్యం చేసేలా తప్పుడు వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి వాళ్లకు ప్రజలు గుణపాఠం చెప్పాలి. ఛట్ పూజ కోసం బిహార్‌కు వచ్చిన వాళ్లంతా ఓటింగ్ ప్రక్రియ పూర్తయ్యేదాకా రాష్ట్రంలోనే ఉండండి'' అని తెలిపారు.

### జన్‌సురాజ్ కార్యకర్త హత్యకేసు..
## జెడియు మాజీ ఎమ్మెల్యే అనంత్‌సింగ్ అరెస్ట్

**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ జన్‌సురాజ్‌పార్టీ (జెస్‌పి) కార్యకర్త దులార్‌చంద్ యాదవ్ హత్యకు గురవడం కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. జెడియు అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే అనంత్ సింగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కాగా అనంత్‌సింగ్‌పాట్నా జిల్లాలోని మొకామా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జెడియు అభ్యర్థిగా బరిలో ఉన్నారు. దులార్ చంద్ హత్య నేపథ్యంలో పోలీసులు సింగ్‌పై నిఘాఉంచారు. ఆదివారం తెల్లవారుజామున బార్హ్‌లోని ఆయన నివాసానికి వెళ్లి అరెస్టు చేశారు. అనంత్ సింగ్ అనుచరులు మణికాంత్ ఠాకూర్, రంజీత్ రామ్ అనే మరో ఇద్దరిని కూడాఅదుపులోకితీసుకున్నారు.అనంతరం వారిని విచారించేందుకు పాట్నాకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. మొకామాలో జన్‌సురాజ్ పార్టీ అభ్యర్థి పియూష్ ప్రియదర్శి ప్రచారం చేస్తుండగా జెడియు కార్యకర్తలతో జెఎస్‌పి కార్యకర్తలకు గొడవ జరిగింది. అదే సమయంలో పీయూష్ మామ, పార్టీ కార్యకర్త దులార్‌చంద్‌పై కొందరు దుండగులు కాల్పులు జరిపారు. దాంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ హత్య నేపథ్యంలో ఆగ్రహానికి గురైన పీయూష్ మద్దతుదారులు ఆర్‌జెడి అభ్యర్థి వీణా దేవీ కారుపై రాళ్లు రువ్వారు. కాగా ఈ మొత్తం వ్యవహారంపై నివేదిక సమర్పించాలని డిజిపిని ఎన్నికల సంఘం ఆదేశించింది. అల్లర్ల నివారణలో విఫలమయ్యారన్న కారణంపై పట్నా రూరల్ ఎస్‌పి విక్రమ్ సిహాగ్‌ను బదిలీ చేసింది. మరో ముగ్గురు అధికారులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టింది.

### 20 ఏళ్లల్లో బిజెపి-జెడియు బిహార్
## యువత అవకాశాలు లాక్కుంది
### రాష్ట్ర ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించాల్సిన సమయం ఆసన్నమైంది : ఖర్గే



**న్యూఢిల్లీ :** బిహార్ యువత నుండి గత 20 ఏళ్లలో ప్రతి అవకాశాన్ని, కలలను బిజెపి–జెడియు లాక్కుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఇప్పుడు రాష్ట్ర ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మహాఘట్బంధన్ 'న్యాయ్ సంకల్ప్'ను పునరుద్ఘాటించాల్సిన తరుణం వచ్చిందని పేర్కొన్నారు. 'బిహార్ ప్రజలు ఎక్కడికి వెళ్లినా వారు కృషి, ప్రతిభతో తమ నగరాల అదృష్టాన్ని ప్రకాశవంతం చేస్తారని ఖర్గే ఎక్స్‌లో హిందీలో పోస్టు చేశారు. అయితే వారు ఇంకా తమ సొంత బిహార్ విధిని ఎందుకు మార్చలేకపోయారని ప్రశ్నిస్తూ గత 20 ఏళ్లలో బిహార్ యువత నుండి ప్రతి అవకాశాన్ని, ప్రతి కలను బిజెపి–జెడియు లాక్కుందని, దీంతో వారంతా కార్మికులుగా మారవలసి వచ్చిందని మండిపడ్డారు. పారిశ్రామిక రంగంలో ఉపాధి పరంగా బిహార్ దేశంలో 23వ స్థానంలో ఉందని ఆయన అన్నారు. రాష్ట్రం మొత్తం మీద ఈ రంగంలో 1.3 లక్షల మంది మాత్రమే పనిచేస్తున్నారని, వారిలో 36,135 మంది మాత్రమే శాశ్వత ఉద్యోగులు అని ఆయన అన్నారు. ఇప్పుడు మార్పు కోసం సమయం ఆసన్నమైందని, బిహార్ ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించలన్నారు. యువత అభివృద్ధి కోసం మహా కూటమి చేసిన వాగ్దానాలను కలిగి ఉన్న చిత్రాన్ని ఆయన పంచుకున్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రతిపక్ష ఇండియా కూటమి తన మ్యానిఫెస్టోను విడుదల చేసింది. ఇతర విషయాలతోపాటు, ప్రతి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది.

## ప్రభుత్వ ఏర్పాటు తథ్యం
### ఫలితాలు వెలువడిన నాలుగవరోజు ప్రమాణం : తేజస్వీయాదవ్

**పాట్నా :** బిహార్‌లో ప్రతిపక్ష సంకీర్ణం తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన నాలుగు రోజుల తర్వాత ప్రమాణస్వీకారంజరుగుతుందనిఇండియాకూటమిముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ స్పష్టం చేశారు. ఈనెల 14నఫలితాలు ప్రకటించిన తరువాత 8న ప్రమాణ స్వీకారం జరుగుతుందని ఆర్‌జెడి నాయకుడు ఆదివారం విలేకరులకు వివరించారు.ముఖ్యమంత్రినితీష్‌కుమార్‌జెడి(యు)అభ్యర్థిగాబరిలో ఉన్న మోకామా మాజీ ఎమ్మెల్యే అనంత్ సింగ్ అరెస్టుపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్య చేశారు. తీవ్రమైన ఘటన జరిగినందుకు అరెస్టు సబబేనన్నారు. ఆ ప్రాంతంలో ప్రశాంత్ కిషోర్ జాన్ సూరాజ్ పార్టీకి మద్దతు ఇస్తున్న దులార్ చంద్ యాదవ్ హత్యకు సంబంధించి సింగ్ అరెస్టును ప్రస్తావిస్తూ అన్నారు. ఎన్నికల ప్రచారానికి ప్రధాన మంత్రి బిహార్‌నుసందర్శిస్తున్నారని, రాష్ట్రంలో దారుణమైన నేరాలు జరగకుండా ఒక్క రోజు కూడా గడవని పరిస్థితిని గమనించాలని సూచించారు. అయితే మహాఘట్‌బంధన్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ పరిస్థితి మారుతుందన్నారు.

## ఢిల్లీ కాలుష్యంపై ప్రియాంక ఆందోళన

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో ప్రమాదకర స్థాయిలో వాయుకాలుష్యం పెరుగుతుండడంతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తాను ట్యాగ్ చేస్తూ పోస్టు చేశారు.ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్న మురికి పొగను తొలగించడానికిచర్యలు తీసుకోవాలని కోరారు. నగరాన్ని ఆవరించి ఉన్న కాలుష్యం దానిపై వేయబడిన బూడిద రంగు కవచం లాంటిదని ప్రియాంకగాంధీ పేర్కొన్నారు.మనరాజకీయబలవంతాలతో సంబంధం లేకుండా మనమందరం కలిసి దాని గురించి ఏదైనా చేయాల్సిన సమయం ఇదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్య తీసుకోవాలన్నారు. ఈ భయంకరమైన పరిస్థితిని తగ్గించడానికి తీసుకునే ఏ చర్యలకైనా అందరం మద్దతు ఇస్తామని, సహకరిస్తామని చెప్పారు. ఢిల్లీ పౌరులు ఏటా ఈ విషప్రయోగానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారు, ప్రతిరోజూ పాఠశాలకువెళ్లే పిల్లలు,ముఖ్యంగావృద్ధులు,మనమందరంపీల్చుకుంటున్న మురికి పొగను తొలగించడానికిజోక్యం అవసరమని ప్రియాంక సూచించారు. ప్రధాని మోదీ, పర్యావరణమంత్రి యాదవ్, ఢిల్లీ ముఖ్యమంత్రినిచర్యలు తీసుకోవాలని కోరారు. గత రెండు వారాలుగా దేశ రాజధానిలో గాలి నాణ్యత బాగా క్షీణించింది.

### ఢిల్లీ ప్రభుత్వం చేపట్టిన క్లౌడ్ సీడింగ్ ప్రయోగంపై...
## స్వల్ప మెరుగుదలను సాధించిందనడం 'ఒక క్రూరమైన జోక్'
### కాంగ్రెస్ ఎద్దేవా



**న్యూఢిల్లీ :** గాలి నాణ్యతను చేపట్టడానికి ఢిల్లీ ప్రభుత్వం చేపట్టిన క్లౌడ్ సీడింగ్ ప్రయోగంపై ఆదివారం కాంగ్రెస్ విమర్శనాత్మకంగా స్పందించింది. పరిమిత ప్రాంతంలో లేదా రెండు రోజుల్లో స్వల్ప మెరుగుదలను సాధించడం ఒక క్రూరమైన జోక్ అని కాంగ్రెస్ పార్టీ ఎద్దేవా చేసింది.గాలి నాణ్యతను మెరుగుపరచడానికి శీతాకాలం క్లౌడ్ సీడింగ్ ప్రయోగానికి ఢిల్లీ ప్రభుత్వం రూ. 34 కోట్లు ఖర్చుచేసిందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరాం రమేష్ చెప్పారు. 2024 డిసెంబరు 5న కేంద్ర పర్యావరణం, అడవులు మరియు వాతావరణ మార్పుల సహాయ మంత్రిరాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ ఢిల్లీలోగాలినాణ్యతను మెరుగుపర్చడానికి మూడు ప్రత్యేక సంస్థలు ఎన్‌సిటిలోని కమిషన్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్, కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు, భారత వాతావరణ శాఖ క్లౌడ్ సీడింగ్‌కు వ్యతిరేకంగా స్పష్టంగా సలహా ఇచ్చాయని జైరాం రమేష్ తెలిపారు. ఆ తర్వాత 2025 అక్టోబరు 31న అంటే నిన్నగాక మొన్న ఐఐటి ఢిల్లీలోని ప్రసిద్ధ, ప్రతిష్ఠాత్మకమైన సెంటర్ ఫర్ అట్మాస్ఫియరిక్ సైన్సెస్ ఈ విషయమై ఒక వివరణాత్మక నివేదికను విడుదల చేసింది.శీతాకాలపు క్లౌడ్ సీడింగ్ ఢిల్లీలో దారుణమైన గాలి నాణ్యతను మెరుగుపర్చడంలో ఎటువంటి ముఖ్యమైన రీతిలో సహాయపడదని ఇది స్పష్టం చేసిందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శివెల్లడించారు.శీతాకాలపు మేఘాల విత్తనోత్పత్తి కచ్చితంగా చాలా నాటకీయంగా కనిపిస్తున్నదని, ప్రభుత్వం ద్వారా ఏదో స్పష్టంగా జరుగుతుందనే భావన కలిగిస్తోందని ఆయన వివరించారు.రాజ్యసభలో పర్యావరణ శాఖ మంత్రి ఇచ్చిన సమాధానం, ఐఐటి ఢిల్లీ నివేదికను కూడా జైరాం రమేష్ 'ఎక్స్'లో షేరింగ్‌చేశారు. ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్‌సిర్సా సైన్స్ ఆధారిత చర్యలు అమలు ఫలితాలను ఇస్తున్నాయని, నగర ఐక్యూ గణనీయమైన తగ్గుదలను చూపించిందని, డేటా ట్యాంపరింగ్ ఆరోపణలను తోసిపుచ్చిందనిచెప్పిన రెండు రోజుల తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ వ్యాఖ్య లు వచ్చాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా ఈ విషయమై స్పందిస్తూ కాలుష్య కారకాల డేటాను మార్చడం లేదా తారుమారు చేయడం సాధ్యం కాదని తెలియజేశారు. ఢిల్లీలోని బిజెపి ప్రభుత్వం పరిస్థితిని దాచడానికి ఎక్యూఐ డేటాను తారుమారు చేసిందని ప్రతిపక్షం పదేపదే ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వస్తోంది.


**FORMAT C-2**

*(for political party to publish in website, newspapers, TV)*

**Declaration about criminal antecedents of candidates set up by the party**

*(As per the judgment dated 25th September, 2018 of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)*

**Name of Political Party : INDIAN NATIONAL CONGRESS**

**Name of Election : BYE ELECTION TO THE TELANGANA STATE LEGISLATIVE ASSEMBLY**

**Name of State/ UT : TELANGANA STATE**

**Name of the Constituency: 61-JUBILEE HILLS**

**Name of the candidate : NAVEEN YADAV. V**

**4 (A) Pending criminal cases**

| Sl. No. | Name of Court | Case No .and dated | Status of case(s) | Section(s) of Acts concerned and brief description of offence(s) |
|---|---|---|---|---|
| 1 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 575/2021 C.C No. 12608/2021 dt: 26-11-2021 | Examination of accused | U/S. 109, 505(2) & 506 of IPC. Abatement of any Offence, Conducting to public mischief and criminal intimidation |
| 2 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 95/2021 CC No. 11727/2021 dt: 27-10-2021 | Examination of accused | U/S. 506 of IPC. Criminal Intimidation |
| 3 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 93/2021 C.C No. 10432/2021 dt: 01-09-2021 | Examination of accused | U/S. 420 & 506 of IPC Cheating and Criminal Intimidation |
| 4 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 55/2021 C.C No. 8134/2021 dt: 30-06-2021 | Examination of accused | U/S. 341, 506, 509 r/w 143 of IPC Wrongful Restraint, Criminal Intimidation |
| 5 | III ACMM, Nampally, Hyderabad | FIR No. 395/2006, Jubilee Hills PS, Jubilee Hills, Hyderabad dt: 01-11-2006 | Summons to accused | Under section. 406, 420 & 506 of IPC. Criminal Breach of Trust, Cheating & Criminal Intimidation |
| 6 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 340/2021, Jubilee Hills PS, Jubilee Hills, Hyderabad Dt: 2-7-2021 | Under investigation | Under Section. 188, 419, 420, 427, 447, 467, 468 & 471 of IPC and under Section 3 of PDPP Act. Trespass and deliberate disobedience of Order. |
| 7 | XIV ACMM, Nampally, Hyderabad | FIR No. 655/2025, Madhura Nagar Police Station, Hyderabad Dt: 06-10-2025 | Under investigation | 123(1), 123(2) Representation of People Act, 1951, 170,171,174 of BNS. Bribery, undue influence, or illegal inducements during elections |

**5 (B) Details about cases of conviction for criminal offences**

| Sl. No. | Name of Court & date(s) of order(s) | Description of offence(s) & punishment imposed | MaximumPunishment Imposed |
|---|---|---|---|
| 1 | NA | NA | NA |

**T.KUMAR RAO**
Vice President
Authorized Signatory




కాలాతీత సాహిత్యం..

# ‘అమెరికన్ డ్రీమ్’కు ప్రతిబింబం ‘గాట్స్‌బై’

ప్రపంచంలో ఏ దేశంలోనైనా... భాష ఏదైనా... ఒక రచన కలకాలం నిలిచి ఉండాలంటే అది తప్పనిసరిగా ఇతిహాసానికి లేదా మతానికి సంబంధించినవై ఉండాలన్న నిబంధన ఎక్కడా లేదు. అయితే, ఒక రచయిత తన కాలానికంటే చాలా ముందుకు వెళ్లి, దార్శనికతను ప్రదర్శిస్తే, ఆ రచనను చాలా మంది జీర్ణించుకోలేకపోతారు. అంతేకాదు, పాత్రల్లోకి రచయిత దూరిపోయి, వాటి గమనాన్ని మారిస్తేగానీ సంతృప్తి చెందరు. కొన్ని పడికట్టు పదాలు.. మరికొన్ని అరిగిపోయిన డైలాగులు... ఇంకొన్ని కాలం చెల్లిన సంఘటనలను రంగరిస్తేగానీ ఆ రచనను అర్థం చేసుకోరు. అలాంటి ప్రయత్నాలు ఏమీ చేయకుండానే స్కాట్ ఫిట్జ్‌జెరాల్డ్ 1925లో రాసిన ‘ది గ్రేట్ గాట్స్‌బై’ నవల అప్పట్లో ప్రజాదరణ పొందలేదు. అయితే రెండో ప్రపంచ యుద్ధం తర్వాత క్రమంగా ప్రాముఖ్యతను సంతరించుకుంది. నేడు అమెరికన్ నవలా సాహిత్యంలో గొప్ప రచనగా పేర్కొంటున్నారు. శతాబ్ద క్రితం నాటి నవల ఇప్పటికీ సజీవంగా నిలిచి ఉందంటే, ఆ నవల పాఠకులను ఎంతగా ప్రభావిం చేయగలదో అర్థమవుతుంది. అయితే, కథ, కథనం, భాష, శైలి విలక్షణంగా ఉంటాయి కాబట్టే ‘ది గ్రేట్ గాట్స్‌బై’ ఒకపట్టాన కొరుకుడు పడదు. ఈ నవల ప్రధానంగా అమెరికన్ డ్రీమ్ అనే భావనను ప్రశ్నిస్తుంది. కేవలం కలలు కనడంకాదు.. కష్టపడి పని చేయాలని చెప్తుంది. శ్రమిస్తే, ఏ స్థాయిలో ఉన్న వ్యక్తయినా ధనవంతుడవుతాడని, తన కలలు నెరవేర్చుకోగలుగుతాడని గాట్స్‌బై పాత్ర ద్వారా నిరూపిస్తాడు ఫిట్జ్‌జెరాల్డ్. ఈ నవలలో కథకుడు నిక్ కారవే, మిడ్‌వెస్ట్ ప్రాంతం నుంచి వాల్ స్ట్రీట్‌లో ఉద్యోగం కోసం న్యూయార్క్ నగరానికి వస్తాడు. అతను వెస్ట్ ఎగ్ ప్రాంతంలో ఓ చిన్న ఇల్లు అద్దెకు తీసుకుంటాడు. అతని పొరుగున జే గాట్స్‌బై అనే ధనవంతుడు ఉంటాడు. ప్రతిరోజూ అతని భవనంలో ఘన విందులు జరుగుతాయి. ఇక గాట్స్‌బై గురించి అనేక వదంతులు వ్యాప్తిలో ఉంటాయి. అతను మద్యం స్మగ్లర్ అని కొందరు.. కాదు, గ్యాంగ్‌స్టర్ అని మరికొందరు అనుమానిస్తుంటారు. కొందరు యుద్ధ వీరుడని గాఢంగా నమ్ముతారు. ఇక ఇవేవీ పట్టించుకోని గాట్స్‌బై తన పాత ప్రేమికురాలు డైసీ బుకాననన్‌ను తిరిగి పొందడంపై దృష్టి పెడతాడు. డైసీ ఇప్పటికే టామ్ బుకానన్ అనే సంపన్నుడిని పెళ్లి చేసుకుంది. టామ్ అహంకారి, క్రూరుడు, ద్వంద్వ ప్రవృత్తి కలవాడు. గాట్స్‌బై మాత్రం డైసీని గతంలో మాదిరిగానే ఎంతో ప్రేమతోనే చూస్తాడు. నిక్ సహాయంతో డైసీ, గాట్స్‌బై మళ్లీ కలుస్తారు. కానీ ఆ ప్రేమ చిగురించకముందే పరిస్థితులు మారిపోతాయి. టామ్ తన భార్య డైసీని గాట్స్‌బై నుంచి వేరుచేస్తాడు. ఒక ప్రమాదంలో మైర్టిల్ విల్సన్ (టామ్ ప్రేయసి) మరణిస్తుంది. నిజానికి కారు డైసీ నడిపినా, గాట్స్‌బై బాధ్యత తీసుకుంటాడు. చివరికి టామ్ ప్రేరేపణతో గాట్స్‌బైని మైర్టిల్ భర్త విల్సన్, కాల్చి చంపుతాడు. అంతటి ధనవంతుడైనప్పటికీ, గాట్స్‌బై అంత్యక్రియలకు చాలా తక్కువమంది వస్తారు. విందులలో గుంపులు గుంపులుగా గుమికూడినవాళ్లలో ఎవరూ అతని మరణానంతరం కనిపించరు. సమాజ పోకడలకు, మనుషుల స్వభావాలకు, నిఖార్సయిన ప్రేమకు ఈ నవల అద్దం పడుతుంది. ఆరోజుల్లో అత్యధిక శాతం మంది అమెరికన్లు ఒక ఊహాలోకంలో విహరించేవారు. స్వీయనిర్మిత మనిషిగా ఎదగాలని కోరుకుంటూనే, ఆ కలను నెరవేర్చుకోవడానికి ఎలాం టి పనులకైనా వెనుకాడని నైజం వారిలో ఉండేది. సా ధారణ కుటుంబం నుంచి వచ్చిన గాట్స్‌బై కూడా అ లాంటి వాడే. ఎదగాలని, రెండు చేతులా సంపాదించాలని కలలుకంటాడు. అనుకున్నది సాధిస్తాడు. అయితే, అతను సంపదను సరైన మార్గంలో సంపాదించడు. అక్రమ వ్యాపాలాతో ఆర్జిస్తాడు. సంపాన కోసం వక్ర మార్గం పట్టినప్పటికీ, ప్రేమ విషయంలో మాత్రం చిత్తశుద్ధిని ప్రదర్శిస్తాడు. ప్రేమికురాలు డైసీ మరొకరిని వివాహం చేసుకున్నప్పటికీ, ఆమెను మరచిపోలేక పోతాడు. తిగిరి ఆమెను పొందడమే ఏకైక లక్ష్యంగా ఎంచుకుంటాడు. అతను తన కల కోసం అంతా త్యాగం చేసినా, ఆకల అసాధ్యమని చివరికి నిరూపితం కావడం విషాదకరం. ధనవంతుడిని కా వాలనుకోవడం మంచిదే... కానీ, అం దుకు ఎలాంటి మార్గం ఎం చుకున్నా తప్పులేదనుకోవడం అతని అవకాశవాదం. డైసీని ప్రేమించడంలో ఆశ్చర్యం లేదు. అది సహ జం. కానీ, ప్రియురాలికి వివాహమైనప్పటికీ, ఆమెనే పొందాలనుకోవడం అసహజం. ఇలా నైతిక, అనైతికల మధ్య ఊగిసలాడుతూ అతని జీవితం అత్యంత విషాదంగా ముగుస్తుంది. ఈ నవలలో మరో పాత్ర గాట్స్‌బై కలల రాణి డైసీ బుకానన్. ఆమెది అద్భుతమైన అందం. ఆకర్షణ అనంతం. మృదుత్వం ఆమె సొం తం. కానీ, మా నసిక స్థైర్యం, నైతికత మాత్రం అంతంత మాత్రమే. ఆమె కు భద్రత అత్యవసరం. ఎందుకంటే, భర్త టామ్ చాలా ధనవంతుడు. సమాజంలో పలుకుబడి ఉన్నవాడు. అందుకే అతనిని ఎంచుకుంటుంది. ఒకవైపు టా మ్‌ను ఎంపిక చేసుకొని, మరోవైపు గాట్స్‌బై కోసం కన్నీరు కార్చడం ఆమె మానసిక సంఘర్షణకు, ద్వంద్వ ప్రవృత్తికి నిదర్శనం. గాట్స్‌బైని కోరుకున్నప్పటికీ, అతని పట్ల తన ప్రేమను నిరూపించుకోలేకపోతుంది. అతనితో బంధాన్ని నిలబెట్టుకునే ధైర్యం చేయలేకపోతుంది. గాట్స్‌బై మాదిరిగానే డైసీ లో కూడా రెండు భిన్న మనస్తత్వాలు క నిపిస్తాయి. తొలుత ప్రేమించిన గాట్స్‌బైని వదులుకుంటుంది. టామ్‌ను వివాహం చేసుకున్న తర్వాత గాట్స్‌బై విలువ తెలుసుకుంటుంది. అయితే, అతను తన గురించి ఎంతో ఆరాటపడుతున్నాడని తెలిసినప్పటికీ, టామ్ నుంచి బయటపడే ధైర్యం చేయలేకపోతుంది. అయితే, గాట్స్‌బై కోసం కన్నీరు కార్చకుండా ఉండలేకపోతుంది. అత్యంత విలక్షణమై స్వభావాలు కలిగిన డైసీ పాత్రలు సమాజంలో ఇప్పటికీ మనకు కనిపిస్తునే ఉంటాయి. ఇక మూడో పాత్ర టామ్ బుకానన్. అమెరి కా ధనిక వర్గానికి, నియంతృత్వ పోకడలకు అతను ఓ ప్రతినిధిగా కనిపిస్తా డు. అతనిలో అహంకారం, జాత్యహంకారం, పురుషాధిక్యత స్పష్టంగా కనిపిస్తాయి. గాట్స్‌బై, డైసీ మాదిరిగానే టా మ్‌లోనూ భిన్న రూపాలు కనిపిస్తాయి. ఒకవైపు అతను మైర్టిల్‌తో అక్రమ సంబంధం పెట్టుకుంటాడు. దానిని ని ర్భయంగా కొనసాగిస్తుంటాడు. కానీ, గాట్స్‌బైని తన భార్య డైసీ కలిస్తే మా త్రం సహించలేడు. తనకు ఒక న్యా యం.. డైసీకి మరో న్యాయం అనుకుంటాడు. చివరికి గాట్స్‌బైని తాను అక్రమ సంబంధం కొనసాగిస్తున్న మైర్టిల్ భర్త విల్సన్‌తోనే హత్య చేయిస్తాడు. ధనం.. పలుకుబడి ఉన్నా యి కాబట్టి తనకు ఎదురులేదనే తీరు అడుగడుగునా ప్రదర్శితమవుతునే ఉంటుంది. ఈ నవలలో క థకుడు ని క్ కారవే నైతిక విలువలకు ప్రాధాన్యం ఇస్తాడు. గాట్స్‌బై డబ్బు ఎలా సంపాదించాడనే ప్రశ్నతో అతనిపై అనుమా నం పెంచుకుంటాడు. కానీ చివరిలో గాట్స్‌బైపై గౌరవా న్ని పెంచుకుంటాడు. రచయిత ఫిట్జ్‌జెరాల్డ్ తన అభిప్రాయాలను చెప్పడానికి నిక్ పాత్రను ఉపయోగించుకోవడం అప్పట్లో కొత్త ఒరవడి ని సృష్టించింది. ధనవంతులు, ఉ న్నత వర్గాల వారి చేతు ల్లో సామాన్యులు ఏ విధంగా నలిగిపోయారో తెలియచేస్తుంది మైర్టిల్ విల్సన్ పాత్ర. భయంకరమైన ఆర్థిక సమస్యలు... వెంటాడుతున్న దారిద్ర్యం.. ఉన్నతంగా జీవించాలనే కోరిక.. ఒక పేద వర్గానికి చెం దిన మహిళకు ఇ లాంటి ఆలోచనలు సహజం. అయితే, ఆమె టామ్‌కు ప్రేయసిగా మారడం అనేది ఉన్నతంగా ఎదిగేందుకు దగ్గరిదారి వెతుక్కోవడమే. టాప్ ప్రేయసిగా మారిపోవడం మైర్టిల్ అత్యాశకు, అనైతికకు అద్దం పడుతుంది. మరోవైపు పేద మహిళలను ఉన్నత వర్గాలు ఏ విధంగా లొంగబరుచుకుంటారనే విషయాన్ని కూడా ఈ పాత్ర మనకు చెప్తుంది. ఈమె చివరికి డైసీ డ్రైవ్ చేసిన కారులో మరణిస్తుంది. కాగా, జోర్డాన్ బేకర్ ప్రొఫెషనల్ గాల్ఫ్ క్రీడాకారిణి. మోసం, అబద్ధం ఆమె లక్షణాలు. సమాజపు కపటత్వానికి ప్రతీక. పాత్రలను సామాజిక అంశాలు, పరిస్థితులకు ప్రతీకలుగా ఎంచుకోవడం రచయిత విశాల దృష్టికి అద్దం పడుతుంది. అమెరికన్ డ్రీమ్ పతనం అంటే గా ట్స్‌బై కథ అమెరికన్ డ్రీమ్ విరగిపోవడమే. అతను పేదరి కం నుంచి పైకి ఎగబాకాడు. కానీ సంపద అతనికి ప్రేమ, గౌరవం, నిజమైన ఆనందం ఇవ్వలేదు. సంపద, వర్గాలకు టామ్, డైసీ, గాట్స్‌బై ప్రతిరూపాలు. పేద వర్గానికి ప్రతినిధులుగా విల్సన్ దంపతులను పేర్కోవచ్చు. ఈ మూడు వర్గాల మధ్య పోరాటమే ఈ నవల. గాట్స్‌బై డైసీ పై చూపిన ప్రేమ శుద్ధమైనదే అయినా, వాస్తవానికి అది మోహం. డైసీ అతని కలలలో మాత్రమే నిజమైనది. జాజ్ యుగంలో సంపన్నులు విలువలను కోల్పోయారు. విందులు, మద్యం, అనైతిక సంబంధాలు వారి అలవాట్లుగా మారాయి. సమాజ కోణాలే టామ్, గాట్స్‌బై, డైసీ, మైర్టిల్ పాత్రలు. ఈ నవల్లో ఉదహరించిన గ్రీన్‌లైట్ అనేది డైసీని పొందాలన్న గాట్స్‌బై కల. ఆషెస్ వ్యాలీ అనేది పేదరికం, మానవ విలువల వినాశనం. టిజె ఎక్లిబర్గ్ కళ్ళు అంటే స మాజాన్ని గమనించే దేవుని కళ్ళు. నీటి మీద దూరాన్ని కలలకీ, వాస్తవానికి మధ్య దూరంగా పేర్కోవచ్చు. ఈ నవలలో ఫిట్జ్‌జెరాల్డ్ అద్భుతమైన భాషను ఉపయోగించాడు. ఇందులో కవిత్వం, చమత్కారం రెండూ కలగలసి పాఠకులను సమ్మోహింప చేస్తాయి. నవలలో ‘ఫస్ట్ పర్సన్’ ద్వారా కథను నడిపించడం అప్పట్లో ఒక కొత్త ఒరవడి సృష్టించింది. నవలలోని పలు వర్ణనలు ప్రతీకాత్మకంగా ఉంటాయి. గాట్స్‌బైని ఒక రహస్యమయ జీవితంగల వ్యక్తిగా ఒకవైపు, మానవీయ కోణంలో మరోవైపు చూపించడంలో రచయిత సఫలమయ్యాడు. షేక్స్‌పియర్ ఓథెల్లోలో ప్రేమలో మోహం విషాదానికి దారి తీసినట్లు, గాట్స్‌బై విషాదం కూడా అదే తరహాలో ఉంది. దీనిని అ మెరికన్ సాహిత్యంలో ఒక అద్భుతమైన నవలగా ప్రముఖ రచయిత ఎర్నెస్ట్ హెమింగ్వే ప్రశంసించాడు. ‘గాట్స్‌బై మానవ ఆకాంక్షల అమరుడు’ అంటూ లయనెల్ ట్రిల్లింగ్ వ్యాఖ్యానించాడు. దీనిని ఆధునిక విషాద కావ్యంగా హారల్డ్ బ్లూమ్ విశ్లేషించాడు. అమెరికన్ డ్రీమ్’ వైఫల్యాన్ని చూపించిన ఆధునిక కావ్యం ది గ్రేట్ గాట్స్‌బై. గాట్స్‌బై జీవితం కష్టపడి సంపద సంపాదించిన వ్యక్తి విజయకథలా కనిపించినా, అది విరిగిపోయిన కలల గాథ. డైసీని తిరిగి గెలుచుకోవడం అతని ప్రధాన ఆశయమైనప్పటికీ, సమాజపు వర్గాలు, కపటత్వం, విలువల పతనం అతన్ని చివరికి చంపేశాయి. సంపదతో అన్నీ సాధ్యమవుతాయని అనుకోకూడదని, మానవ విలువలు లేకపోతే కలలన్నీ శూన్యమవుతాయనీ ఈ నవల మనకు స్పష్టం చేస్తుంది. గొప్ప విలువలను పొందుపరచుకున్నది కాబట్టే ఇది కాలాతీత రచనగా నిలిచిపోతుంది.





‘ది గ్రేట్ గాట్స్‌బై’ని శతాబ్ద క్రితం నాటి సమాజం అంత సులభంగా అంగీకరించలేదు. ‘అమెరికన్ డ్రీమ్’ అంటే పార్టీలు, విలాసాలు, అక్రమ సంబంధాలు, ప్రేమలు, వైఫల్యాల కలగలుపుగా రచయిత స్కాట్ ఫిట్జ్‌జెరాల్డ్ పేర్కొనడం చాలా మందికి నచ్చలేదు. అంతేకాదు, పాత్రల మనస్తత్వాలను మార్చడానికి రచయిత ఎక్కడా ప్రయత్నించకపోవడం, ఎవరి పరుధుల్లో వారు పరిమితం కావడంతో, విషాదాంతంగా ముగియడం పాఠకులు జీర్ణించుకోలేకపోయిన కొన్ని అంశాలు. డైసీకి వివాహం జరిగిందని తెలుసుకొని గాట్స్‌బై తన వైఖరి మార్చుకున్నా లేక టామ్‌ను వివాహం చేసుకున్న డైసీ అతనికి నమ్మక ద్రోహం చేయకుండా, గాట్స్‌బైని నిర్లక్ష్యం చేసినా, అది రచయిత పాత్రల్లోకి చొచ్చుకుపోవడమే అయ్యేది. కానీ, ఫిట్జ్‌జెరాల్డ్ అలా చేయకపోవడం పాఠకులకు అప్పట్లో రుచించలేదు. డైసీ భర్త టామ్ మరో మహిళ మైర్టిల్‌తో అక్రమ సంబంధం పెట్టుకోవడం కూడా చాలా మందిని ఇబ్బందికి గురి చేసింది. నిజాలను నిజాలుగానే చూపించడం చాలా మందికి రుచించలేదు. నాటకీయ పరిణామాలు చోటు చేసుకొని, హఠాత్తుగా పాత్రలన్నీ పరివర్తన చెంది, తమతమ ఆలోచనా విధానాలు మార్చుకొని, కథ సుఖాంతమైతే ‘ది గ్రేట్ గాట్స్‌బై’కి వందేళ్ల క్రితమే గొప్ప పేరు వచ్చి ఉండేది. కానీ, అది తాత్కాలకమే. దీర్ఘకాలంలో లక్షలాది నవల్లో ఒకటిగా మారిపోయేది. కాలగర్భంలో కలిసిపోయేది. కానీ, విలక్షణ పాత్రలు, సమకాలీన సామాజిక అంశాలతో కూడుకున్నది కాబట్టే, ఇంతకాలం నిలిచి ఉంది. ఒక గొప్ప క్లాసిక్‌గా ప్రపంచ సాహితీ రంగంలో సుస్థిర స్థానాన్ని సంపాదించింది.

– సత్యశ్రీ


## చదవాల్సిన పుస్తకం

### దోపిడీ రాజకీయాలపై కొరడా ‘1984’

రాజకీయ దుర్మార్గం, దోపిడీ, అధికార దుర్వినియోగంపై ప్రముఖ ఆంగ్ల రచయిత జార్జి ఆర్వెల్ ఝుళిపించిన కొరడా‘1984’ నవల. ఇందులో రెండు పార్శ్వాలు సమ్మిళితమై, ముందుకు వెళతాయి. మొదటికి దుర్మార్గపు రాజకీయాలను ఎండగట్టడమైతే, రెండోది రాబోయే వ్యవస్థ ఎలా ఉండాలో చెప్పడం. మనిషి స్వేచ్ఛ, ఆలోచన, వ్యక్తిత్వాన్ని నాశనం చేసే రాజకీయ వ్యవస్థకు ఆర్వేల్ చేసిన శాశ్వత హెచ్చరిక ఈ నవల. ఇది కేవలం ఒక కల్పిత కథ కాదు.. ఇది మనిషి చరిత్రలో పునరావృతమవుతూనే ఉన్న అధికార దుర్వినియోగానికి నిదర్శనం కూడా. ఈ నవల 1949లో ప్రచురితమైంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచం అంతా భద్రత పేరుతో నియంత్రణలోకి వెళ్తున్న కాలంలో, ఆర్వెల్ రాసిన ఈ కథ, ఆ భయానక భవిష్యత్తును ముందుగానే ఊహించింది. కథ నేపథ్యం ఓషియానియా అనే ఊహా దేశం. అక్కడ బిగ్ బ్రదర్ అనే ఒక దైవసమానమైన నాయకుడు ప్రజల ప్రతి కదలికను గమనిస్తాడు. పార్టీ అనే ప్రభుత్వం అన్నింటినీ నియంత్రిస్తుంది. చరిత్రను, సత్యాన్ని, చివరికి ఆలోచనలను కూడా శాసిస్తుంది. ప్రధాన పాత్ర విన్‌స్టన్ స్మిత్, మినిస్ట్రీ ఆఫ్ ట్రూత్‌లో పనిచేస్తాడు. కానీ అతని పని నిజాన్ని రాయడం కాదు. పార్టీకి అనుకూలంగా చరిత్రను మారుస్తూ, పాత నిజాలను తుడిచేయడం. అతను తన మనసులో సత్యం అంటే ఏమిటి? అనే ప్రశ్నతో తిరుగుతాడు. జూలియా అనే మహిళతో ప్రేమలో కూడా పడతాడు. కానీ ప్రేమ, స్వేచ్ఛ, వ్యక్తిగత ఆలోచన వంటివన్నీ ఆ రాజ్యంలో ఘోరమైన నేరాలు. పార్టీ అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను అనుసరిస్తూ ఉంటుంది. తనకు అనుకూలమైన ప్రచారం చేస్తుంది. ప్రజల ఆలోచనల్లోనూ అలాంటి భావనలనే నాటుతుంది. అంటే ఒకేసారి రెండు విరుద్ధమైన విషయాలను నమ్మేలా వారిని మార్చేస్తుంది. ఇది తార్కికతను, నైతికతను చంపే విధానం. నియంత్రణ ఎలా మనసులోకి చొరబడుతుందో ఈ కథ ద్వారా చూపిస్తాడు ఆర్వెల్/ కేవలం ప్రభుత్వాలే కాదు, సమాజం కూడా భయంతో, అలవాటుతో, మౌనంతో స్వేచ్ఛను కోల్పోతుంది. నవలలో ‘బిగ్ బ్రదర్ ఈజ్ వాచింగ్ యూ’ అనే వాక్యం ఒక భయానక చిహ్నంగా నిలుస్తుంది. ప్రతి వ్యక్తి పర్యవేక్షణలో ఉన్నాడనే భావన మొట్టమొదటిగా మనసులోని స్వేచ్ఛను హరిస్తుంది. దీనిని రాజకీయ వ్యంగ్యంగా కాకుండా, పాఠకుల మెదళ్లలో ఆలోచనలు జొప్పించే రచనగా పేర్కోవాలి. ఎందుకంటే, నిజం అంటే ఏమిటి? స్వేచ్ఛ అంటే ఏమిటి? అనే ప్రశ్నలకు ఆర్వెల్ స్పష్టమైన సమాధానం ఇవ్వడు. కానీ ప్రశ్నలను మనలో బలంగా నాటుతాడు. సత్యం ప్రభుత్వాల చేతిలో మారిపోయినప్పుడు, మనసు ఎలా దారి తప్పుతుందనే విషయాన్ని ఈ నవల మనసులపై బలమైన ముద్ర వేస్తుంది. భాష సాదా గానూ, అర్థం లోతైనదిగా ఉంటుంది. ప్రతి వాక్యం ఆలోచింపచేస్తుంది. విన్‌స్టన్ చివరికి ఓడిపోతాడు, కానీ అతని ఓటమి మనలో ఒక స్పష్టమైన తిరుగుబాటు అవగాహనను కలిగిస్తుంది. భయానికి ఎదురుతిరగాలన్న ఆలోచన కూడా విప్లవమే అని అర్థమవుతుంది. ‘టు ఫ్రీ ఈజ్ టు సే దట్ టూ అండ్ టూ మేక్ ఫోర్’ అంటాడు రచయిత ఆర్వెల్. ‘రెండు రెండ్లు నాలుగు అని చెప్పగలడాన్ని స్వేచ్ఛగా పేర్కొంటాడు. ‘సత్యాన్ని చెప్పే ధైర్యమే స్వేచ్ఛ’ అంటూ, ఒకే వాక్యంలో అనంతమైన అర్థాన్ని చాటుతాడు. మన మనసుల్లో నాటుతాడు. ఈ నవల చివరి భాగం చదివిన తర్వాత ప్రతి ఒక్కరి మనసు బరువెక్కుతుంది. ప్రపంచంలో అతి కొన్ని దేశాలను మినహాయిస్తే, పాఠకులందరికీ మనం కూడా ఒక ఓషియానియాలో ఉన్నామా? అనిపిస్తుంది. సాంకేతిక పర్యవేక్షణ, సమాచార వక్రీకరణ, భయప్రచారం అన్నీ ఇప్పటికీ ఉన్నాయి కాబట్టి, దశాబ్దాలు గడిచినా, ఈ నవల చదువుతుంటే, సమకాలీన రాజకీయ పరిస్థితులను చూస్తున్నట్టుగానే అనిపిస్తుంది. ఈ నవల మనకు సత్యం విలువను, స్వేచ్ఛ బాధ్యతను గుర్తు చేస్తుంది. ఇది నిరంకుశతపై రాసిన శాశ్వత గ్రంథం. అది మనిషి ఆలోచనను అణచివేసే శక్తులపై ఒక హెచ్చరిక.




## స్త్రీవాద సాహిత్యానికి ‘క్లారెట్’ కానుక!




ఒక కథ... అది కూడా సుమారు 6000 పదాలతో కూడిన చిన్న కథ ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేపుతుందని, ఒక బలమైన వాదనకు పునాది వేస్తుందని ఎవరూ ఊహించరు. కానీ, కార్లెట్ అన్నా పార్కిన్స్ గిల్మన్ (3 జులై 1860–17 ఆగస్టు 1935) అలాంటి అరుదైన రచన చేసింది. ఆ కథే 1892లో ప్రచురితమైన ‘ది ఎల్లో వాల్‌పేపర్’. ఇది కథకాదు.. 19వ శతాబ్దపు మహిళల వ్యథ. వారి మానసిక ఆరోగ్యాన్ని, కుటుంబ వ్యవస్థలోని అణచివేతను తీవ్రంగా ప్రశ్నించే శక్తివంతమైన ఫెమినిస్టు రచన. ఈ కథను తన సొంత జీవితంగా ఒక మహిళ వివరిస్తుంది. అయితే, ఆమె పేరును రచయిత్రి గోప్యంగా ఉంచుతుంది. ఆ రోజుల్లో మహిళలకు ఎలాంటి స్వేచ్ఛ లేదని రచయిత్రి క్లారెట్ చెప్పకనే చెప్తుంది. ‘మేరీ’ అనే పేరు ఒకే ఒకసారి కనిపిస్తుంది. అందుకని ఈ కథను మేరీ కథగా భావించవచ్చు. కథ విషయానికి వస్తే, కథ నాయిక ప్రవసానంతర మానసిక కుంగుబాటుతో బాధపడుతూ ఉంటుంది. ఆమె భర్త స్వయంగా ఒక వైద్యుడు. విశ్రాంతి తీసుకోవడం అత్యవసరమని, తద్వారానే ఆమె మళ్లీ మామూలు మనిషి అవుతుందని అంటాడు. ఆ పేరుతో ఆమెను నర్సరీ గదిలో ఒంటరిగా ఉంచేస్తాడు. ‘విశ్రాంతి’ పేరుతో ఆమె ఆలోచనలకు కళ్లెం వేస్తారు. సృజనాత్మకతను నిషేధిస్తారు. ఎల్లో వాల్‌పేపర్ కథ నాయిక ఒంటరితనానికి, సమాజపు పితృస్వామ్య నియమాలకు, మహిళలను అణచివేస్తున్న తీరుగు ప్రతీక. ఆమె ఆ వాల్‌పేపర్‌లో ఒక మహిళ బంధించి ఉందని కథానాయిక ఊహిస్తూ ఉంటుంది. తన ఊహే నిజమనే భ్రమలోకి వెళ్లిపోతుంది. వైద్యుడైన కథానాయిక భర్త విశ్రాంతి పేరుతో ఆమెను ఒక గదిలో బంధించడం ఆ నాటి సామాజిక పరిస్థితులకు అద్దం పడుతుంది. అప్పట్లో మహిళలకు ఆటపాటలు నిషిద్ధం. ఏకాంతమే శరణ్యం. కనీసం స్నేహితురాళ్లు కూడా ఉండకూడదు. మహిళలు ఎదుర్కొనే ఎలాంటి రుగ్మతకైనా ‘విశ్రాంతి’ మాత్రమే మార్గమంటూ, వారిని ఒంటరిని చేసేవారు. నిజానికి ఇది చికిత్సకాదు. మహిళలపై పరోక్ష దాడి. దీని వల్ల వారి మానసిక సమస్యలు పెరుగుతాయేగానీ తగ్గవు. రచయిత్రి క్లారెట్ సైతం దాదాపు ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంది. ఆ అనుభవంతోనే ఈ కథ రాసింది. భర్తతో కథానాయికను ‘లిటిల్ గర్ల్’ అనిపించడం కూడా రచయిత్రి గొప్ప ఎత్తుగడ. ఇది స్త్రీ స్వాతంత్ర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని, ఆలోచనలను, స్వేచ్ఛా భావనలను పూర్తిగా తుడిచివేసే ప్రయత్నం. ‘ఏమీ తెలియని అమాయకురాలు’ అని ముద్ర వేయడం ద్వారా మహిళలకు స్వేచ్ఛను నిరాకరించే కుట్ర. ‘నేను బయటకు వచ్చాను. మీ వల్లకాదు.. నా వల్లే’ అనిపించడం ద్వారా కొత్త ముగింపు నిస్తుంది రచయిత్రి. సామాజిక విమర్శను ఈ విధంగా వ్యక్తీకరిస్తుంది. ఈ కథ మహిళ స్వాతంత్ర్య పోరాటానికి, పితృస్వామ్య వైద్య వ్యవస్థలోని అణచివేతను వ్యక్తీకరించడంలో దృఢమైన గుర్తింపు పొందింది. ఎంతో మంది సాహిత్య విశ్లేషణలు దీనిని అత్యంత బలమైన ముద్ర వేసిన ఫెమినిస్టు కథల్లో ఒకటిగా కీర్తించారు. అది నిజమని ఈ కథ చదివిన వారెవరికైనా అర్థమవుతుంది. రచయిత్రి అభిప్రాయం స్పష్టమవుతుంది.

## నాటి సాహిత్య పరిమళాలేవి?

సారస్వత ప్రపంచంలో ప్రతి భాషకు ఒక ఉజ్వలమైన భూతకాలం ఉంటుంది. అదే నేటి వర్తమానానికి దిశానిర్దేశం చేసి, రేపటి భవిష్యత్తుకు బాటలు వేస్తుంది. తెలుగు భాషా సౌందర్యం, సంస్కృతీ వైభవం వేల సంవత్సరాలుగా మన పూర్వ కవుల కలాల నుండి జాలువారిన గ్రంథాలలో నిక్షిప్త మై ఉన్నాయి. నేటి ఆధునిక జీవన వేగంలో పరుగులు తీస్తున్న తరుణంలో, నిన్నటి తరాల సాహిత్య వారసత్వాన్ని ముఖ్యంగా మహాభారత కవులైన నన్న య, తిక్కన, ఎర్రన త్రయం నుండి ప్రబంధ యుగపు అష్టదిగ్గజాల వరకు వెలసిన ప్రాచీన కావ్యాలను ఎందుకు పరిశీలించాలి? అనే ప్రశ్న తలెత్తుతుంది. ఈ ప్రాచీన సారస్వతం కేవలం చరిత్రకు సంబంధించిన గ్రంథం కాదు; ఇది మన సంస్కృతికి మూలస్తంభం, మన భాషకు ప్రాణవాయువు, మన వ్యక్తిత్వ వికాసానికి దర్పణం.

#### భాషా నిర్మాణ విశ్లేషణ, శబ్ద సౌందర్యం

ప్రాచీన తెలుగు సాహిత్య అధ్యయనం మన భాషా సంస్కృతుల మూలాలను తెలుసుకోవడానికి కీలకం. నన్నయ భట్టారకుడి నుంచి పోతన, శ్రీనాథుడు, పెద్దన, క్షేత్రయ్య వంటి కవిశ్రేష్ఠులు తమ కావ్యాలలో, ప్రబంధాలలో, శతకాలలో ఉపయోగించిన తెలుగు పదజాలపు లోతులు, పదబంధాల సొగసులు నేటి భాషావేత్తలకు, రచయితలకు ఒక గొప్ప పాఠశాల. ఆ ప్రాచీన తెలుగు భాష శబ్ద సౌందర్యాన్ని, భావ గాంభీర్యాన్ని మనం పూర్తిగా ఆస్వాదించాలం టే ఈ అమూల్య నిధిని మననం చేయాలి. ప్రాచీన కవులు ఛందస్సు, అలంకారాలు, వ్యాకరణ పటిమ విషయంలో అద్భుతమైన నియమ నిబద్ధతను పా టించారు. దేశీ, మార్గ కవితా రీతులను మేళవించి, అక్షర రమణీయతను సా ధించారు. ప్రాచీన కవిత్వంలోని పదాల ఎంపిక, కూర్పులో ఉండే ఔచిత్యం, నేటి రచయితలకు భాషాపరమైన క్రమశిక్షణను అందిస్తుంది. పదాలే కాకుం డా, ఈ సాహిత్యంలో నిక్షిప్తమై ఉన్న సామెతలు, జాతీయాలు, నుడికారాలు భాషా వినియోగానికి మెరుగులు దిద్దుతాయి. ఈ కావ్యాల పరిశీలనతో భా షా పటిమ, పదబంధాల ప్రయోగంలో ఉండే నైపుణ్యం అవగతమవుతాయి.

#### సామాజిక, చారిత్రక దర్పణం

ప్రాచీన తెలుగు సాహిత్యం కేవలం కల్పిత కథల సమాహారం కాదు; అది ఆ యా కాలాల సామాజిక, చారిత్రక పరిస్థితులకు అద్దం పడుతుంది. పల్నాటి వీరచరిత్ర వంటి కావ్యాలు నాటి వీరత్వం, యుద్ధ సంస్కృతిని వివరిస్తే, శ్రీనాథుడి రచనలు నాటి దారిద్ర్యం, రాజాశ్రయ వైభవం మరియు ఆనాటి దుస్థితిని సజీవంగా చిత్రీకరిస్తాయి. ప్రబంధాలలో వర్ణించిన రాజుల ఆచార వ్యవహారాలు, వేషధారణ, రాజధాని నగరాల శోభ, అంతఃపురాల తీరుతెన్నులు ఇవన్నీ చరిత్రకారులకు విలువైన సమాచారాన్ని అందిస్తాయి.ఆనాటి స్త్రీల స్థి తిగతులు, కుల మతాల సంబంధాలు, ఆర్థిక కార్యకలాపాలు, వ్యవసాయ పద్ధతులు వంటి సామాజిక అంశాలను సాహిత్యం ద్వారానే మనం తెలుసుకోగలం. ఈ అధ్యయనం మన పూర్వీకుల జీవన విధానాన్ని, వారి ఆలోచనా ధోరణిని అర్థం చేసుకోవడానికి ఒక గొప్ప వారధిగా నిలుస్తుంది. ప్రాచీన సారస్వత ప్రధాన లక్ష్యం కేవలం వినోదం అందించడమే కాదు, అది ధర్మాన్ని, నీతిని, వైరాగ్యాన్ని కూడా బోధిస్తుంది. పోతన భాగవతంలోని భక్తి తత్వం, సుమతీ శతకం, వేమన శతకంలోని లౌకిక నీతి, సామాజిక విమర్శనాత్మక దృక్పథం ఇవన్నీ కాలంతో సంబంధం లేకుండా, నిత్య జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి, ఉత్తమ జీవన మార్గాన్ని అనుసరించడానికి మార్గదర్శనం చేస్తాయి. వేమన పద్యాలలో నిక్షిప్తమైన నిష్కర్షమైన విమర్శ, ఆధునిక సమాజంలో కూడా ఆచరణీయమైన మానవ సంబంధాల తత్వాన్ని వివరిస్తాయి. ఈ రచనలు మనలో సహనం, దయ, సత్యనిష్ఠ, దాన గుణం వంటి ఉదాత్తమైన మానవ విలువలను పెంపొందించి, కేవలం ధనార్జన యంత్రాలుగా కాకుండా వివేకం కలిగిన పౌరులుగా మనల్ని తీర్చిదిద్దడానికి దోహదపడతాయి. ప్రాచీన సాహిత్యంలోని శాశ్వత విలువలు ఆధునిక మానవుడి ఆత్మాన్వేషణకు, తాత్విక వివేచనకు ప్రాతిపదికలు. ప్రపంచీకరణ, సాంకేతిక విప్లవం నేపథ్యంలో, యువత తమ సాహితీ వారసత్వాన్ని విస్మరించే ప్రమాదం ఉంది. పాత తెలుగు సాహిత్యాన్ని చదవడం అనేది మన పూర్వీకుల జ్ఞానాన్ని, అనుభవాన్ని గౌరవించడం మాత్రమే కాదు, మన సాహితీ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడానికి మనం చేస్తున్న పవిత్ర ప్రయత్నం. నన్నయ భారతం నుండి కందుకూరి వీరేశలింగం గారి యుగం వరకు సాగిన సాహిత్య ప్రవాహం మన తెలుగుదనపు ఔన్నత్యాన్ని, మన ఉమ్మడి చరిత్రను సగర్వంగా చాటుతుంది. మన మూలాలను, మన చరిత్రను మనం బలంగా తెలుసుకున్నప్పుడే, ప్రపంచంలో మనం ఎక్కడ ఉన్నా, మన తెలుగు భాషా వైభవాన్ని గర్వంగా ప్రకటించగలం. ప్రాచీన తెలుగు సాహిత్యం అనేది కేవలం గతానికి సంబంధించిన వస్తువు కాదు. అది మన వర్తమానాన్ని ప్రకాశింపజేసి, భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే దివ్యమైన కాంతి. ఈ సాహిత్యం మన భాషకు పట్టుకొమ్మ, మన సంస్కృతికి జీవనది. ఈ అక్షయ సారస్వత సంపదను ప్రతి తెలుగు పాఠకుడూ, రచయితా అధ్యయనం చేయడం అనేది తమ వ్యక్తిగత వికాసానికి, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు అనివార్యమైన కర్తవ్యం.

ఈ వారం కవితలు

## పల్లె తల్లి బాధలు


కోడి కూతలు మాయమై..
సెల్ అలారమ్ మోతలు మోగె
భానుడి స్పర్శ తాకినాకె..
ఊరంతా ఒళ్లు విరిచి లేచే
యాప పుల్లలు చిన్నబోయి..
టూత్ బ్రష్లు నోట్లో నాట్యమాడె !

సద్దన్నం అంతరించి..
ఇడ్లీ, చాయ్లు పుట్టుకొచ్చె
ఊరు సావడి ఎడారై..
టివీలకు అతుక్కు పోయే
ఇంటి అరుగులు మూగబోయి..
సెల్ ఫోన్లో ఊరి జనం దూరె !

పొద్దుటి నుంచే పల్లె గాలిలో..
గుప్పున గుడుంబా వాసన కమ్మె
ఊరి జనం ఛీప్ లిక్కరు తాగి..
పల్లె దారులెంట ఊగి తూగె
ఇరుగు పొరుగు బంధాలు తరిగి..
యూట్యూబ్ ముచ్చట్లలోమునిగె !

బర్రె పాలు అరుదై పోయి..
ప్యాకెట్ పాలు దర్శనమిచ్చె
కూరగాయల పంట కరువై
పోయి..
ఊరంతా దుకాణాలకు పరుగిడె
కోతుల దాడులకు భయపడి..
పల్లె పల్లంతా తలుపులు మూసె !

కాలి నడక, సైకిల్ దూరమై..
బైకులు, ఆటోలు పుట్టుకొచ్చె
పనిబాటలకు పల్లె జనమంతా..
పట్నం పనులకు ఎగబడె
పెంకుటిండ్లు కూలి పోయి..
కాంక్రీట్ కొంపలు ప్రత్యక్షమాయె
!



సాగు భూమి ధరలు కొండెక్కి..
పట్నం ఆసాముల పంచన చేరె
అన్నదాత నాగలి తుప్పపట్టి..
ట్రాక్టర్ మోతలు సాలు పట్టె
పల్లె వాసనలు పలుచబడి..
పట్నం మేకప్ రంగులు వేసె !

ఎద్దు ఎగుసం మాయమై&
యాంత్రీకరణ పుట్టు కొచ్చె
నీతి న్యాయ బంధాలు కొండెక్కి..
వ్యాపార సంబంధాలు మెలిచె
పెళ్లి పందిళ్లు పాత కథలై..
టెంట్ షామియానాలు వెలిసె !

సర్కారు బడి పోరగాండ్లు..
ప్రైవేటు బడుల దారి పట్టె
మానవత్వాలు మాసి పోయి..
నకిలీ ఇకమతులు పక్కున నవ్వె
ఏక తాటిపై నడిచిన పల్లె..
ఎక్కెక్కి ఏడుస్తూ చేతులెత్తేసె !

– ఎంఎస్ఆర్

## కల్పితాల కాలం..!

మాయాజాలం పడగ
విప్పి వాస్తవాన్ని
కాటేసి చంపేస్తోంది
కల్పితాల పుట్ట పగిలినాక
సత్యం నోరు మూగబోయింది

కంటికి ఇంపుగా అల్లికలతో
మెలికలు పెట్టే కాలం వచ్చింది
గారడీల జిత్తులతో ఎత్తులేస్తూ
గమ్మత్తులు కలిగించే తీరు
అంతటా వ్యాధిలా
వ్యాపించింది

అరచేతి అద్దంలో చూస్తూ
సమస్తాన్ని పిడికిల్లో బిగిస్తూ
గిరికీలు కొట్టించే
కాలమొచ్చింది
వాస్తవ అవాస్తవాల మధ్యలో
మనిషి జుట్టు పీక్కునే జీవితం
రంగుల రాట్నమై
తిరుగుతోంది
సృష్టించే బొమ్మల కొలువులో
మనిషి కూడా
కలిసిపోయే స్థితి
ప్రతి నిమిషం ఎదురౌతోంది

వాస్తవాధీన రేఖపై
నడవాల్సిన మానవ
నిజస్వరూపం ముక్కలై
ఫేక్ వీడియోల చుట్టూ
తిరుగుతోంది
కాల్పానికతకు ఊపిరి పోస్తూ
నిజాన్ని సమాధి చేసే
పనిలో వుంది

– నరెద్దుల రాజారెడ్డి

## రహదారిని పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్

ప్రజాపక్షం/ఆళ్లపల్లి:ఆళ్లపల్లి మండల పరిధిలోని మర్కోడు నుండి కరకగూడెం మండల పరిధిలోని రేగళ్ల గ్రామం వరకు సుమారు పది కిలో మీటర్ల ఉన్న గుట్ట రహదారిని ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. ఎన్నో ఏళ్ల నుండి ఈ రహదారికి అటవీ శాఖ అనుమతులు లేక నిధులు మంజూరైన పనులు నిర్మాణం కాకుండా మధ్యలోనే ఆగిపోయాయి. రహదారి పూర్తి అయితే మేడారం, మణుగూరు, వరంగల్, చత్తీష్ఘడ్ వెళ్లడానికి ఖమ్మం టూ మణుగూరు వెళ్లడానికి ప్రయాణికులకు చాలా సులువుగా ఉంటుంది. కానీ ఎన్ని ప్రభుత్వాలు మారిన పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్ కరకగూడెం నుండి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి ఈ రహదారి గుండా వెళ్లారు. కలెక్టర్ పర్యటనతో ఆళ్లపల్లి కరకగూడెం మండలాల వాసులకు ఆశ కలుగుతుంది. కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఈ రహదారికి అటవీ శాఖ అనుమతులు తీసుకువచ్చి రహదారిని నిర్మించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## సామూహిక సత్యనారాయణ వ్రతాలు

ప్రజాపక్షం/రఘునాథపాలెం : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణ వ్రతాలను దేవాలయాల్లో నిర్వహించారు. మండల పరిదిలోని వివెంకటాయపాలెం గ్రామంలో గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీ అన్నపూర్ణసమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు మంత్రోఛ్చారణతో వ్రతాన్ని నిర్వహించారు. వ్రతంలో పలువురు దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయకమిటి ఆధ్వర్యంలో



భక్తులకు ఎలాంటి ఇబ్బందికలగకుండా చూశారు. వ్రతాలు పూర్తయిన తర్వాత భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

## మూడ్ జమిలి కుటుంబానికి పరామర్శ



ప్రజాపక్షం/కారేపల్లి: తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్ తల్లి జమిలి ఇటీవల మరణించిన విషయం విధితమే. ఆ కుటుంబాన్ని వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్ ఆదివారం పరామర్శించారు. పేదరికంలో ఉండి కూడా వ్యవసాయ కూలీ జీవనాధారంగా ఉంటూనే పిల్లలను ప్రజాసేవకు అంకితం చేయడంలో జమిలి పాత్ర పేర్కొనదగినదిన, అందులో భాగంగానే శోభన్ విద్యార్థి ఉద్యమం నుండి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడిగా ఎదిగాడని ఈ కాలంలో ఎన్నో సమస్యల పరిష్కారానికి ఎన్నో ఉద్యమాలు నిర్వహించిన పరిస్థితి ఉన్నదని ఇదంతా వారి తల్లి కుటుంబం తోడ్పాటు లేకుండా జరగలేదని అందుకే జమిలి జీవితం ధన్యమని తెలిపారు. భవిష్యత్తులోనూ ఆ దారిలో నడవాలని జమిలీకి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, జాస్తి రమేష్, సిఐటియు జిల్లా నాయకులు కే నరేంద్ర, జమిలి కుటుంబ సభ్యులు, కుమారులు, కోడళ్ళు పాల్గొన్నారు.

## దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/పాల్వంచ : మణుగూరులోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పాల్వంచ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పూసల విశ్వనాథం అన్నారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఎవైనా సమస్యలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించుకోవాలే తప్పా దాడులకు దిగటం సరైన పద్ధతి కాదన్నారు. పార్టీ కార్యాలయం పై దాడి చేయటం అత్యంత దుర్మార్గమని ఖండించారు.దోరణులను సహించబోమన్నారు. పక్కా ప్రణాళికతో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు కలిసి బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేశారని ఆరోపించారు. దాడికి పాల్పడ్డ వారిని తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు.

## రైతులకు తుపాన్ నష్టపరిహారం రూ.30వేలు ఇవ్వాలి



ప్రజాపక్షం/వైరాః భారీ వర్షాలకు నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.30వేలు అందించి రైతులను ఆదుకోవాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత రెండు మూడు నెలల నుంచి కురిసిన వర్షాలకు పెసర, మినుము, పత్తి పంటలకు తీవ్ర నష్టం జరిగి రైతులు ఆర్థికంగా కోలుకోని స్థితికి వెళ్లారని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేలు నష్టపరిహారం రైతులకు ఏ మూలాన సరిపోదని అధిక పెట్టుబడులు పంటలకు పెట్టి తుఫాన్ వలన పూర్తిగా నష్టపోయారని అన్నారు. రైతుకు ఎకరానికి రూ.30వేలు, కౌలు రైతుకు రూ.50వేలు ప్రభుత్వం ఇచ్చి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వైరా మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, సిపిఎం వైరా డివిజన్ నాయకులు తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్,నాయకులు రమణ, ఎన్.శంకరయ్య, షేక్ రిహానా పాల్గొన్నారు.

## భద్రాచలం, కొత్తగూడెంలో ప్రజావాణి

ప్రజాపక్షం/ భద్రాద్రి కొత్తగూడెం : ప్రజల సౌకర్యార్థం భద్రాచలం సబ్ కలెక్టర్, కొత్తగూడెం ఆర్‌డిఓ కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ జితేష్‌వి. పాటిల్ ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. సోమవారం జరిగే ప్రజావాణికి సుదూర ప్రాంతాల నుండి ప్రజలు వస్తున్న కారణంతో వారి సౌకర్యం కోసం డివిజన్‌ల వారీగా నిర్వహించటానికి తగు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. భద్రాచలం డివిజన్ పరిధిలో భూ సమస్యల పరిష్కారం, కొత్తగూడెం డివిజన్ వారికి కొత్తగూడెం ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కారం కోసం ధరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఇతర సమస్యలపై కలెక్టర్ కార్యాలయ ఇన్‌వార్డ్‌లో ధరఖాస్తులను సమర్పించి రశీదులు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు భారీగా తరలిరండి

ప్రజాపక్షం/ఇల్లందు: డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు భారీ తరలి రావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్ అన్నారు. ఆదివారం ఇల్లందు మండలంలోని రాజీవ్‌నగర్ ఏరియాలో గడప గడపకు సిపిఐ కార్యక్రమంలో ప్రచారాన్ని విస్తృతంగా చేసి, విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన సిపిఐ పార్టీ పేద గిరిజన బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం,పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు బంధం నాగయ్య, మండల పట్టణ కార్యదర్శులు బొప్పిశెట్టి సత్యనారాయణ, బాస శ్రీనివాస్, గుగులోత్ కృష్ణ, వడ్ల శ్రీను, బసిపాక రవి, రాందాస్, రాఘవేంద్రరావు, సాంబమూర్తి, పాల్గొన్నారు.

## ఇసుక నిల్వలు సీజ్

ప్రజాపక్షం/పాల్వంచ : ఎట్టకేలకు రెవిన్యూ అధికారులు స్పంధించి అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను శనివారం రాత్రి సీజ్ చేశారు. గత కొంత కాలంగా మండల పరిధి రంగాపురం గ్రామ సమీపంలోని కిన్నెరసాని వాగు నుండి రాత్రి వేళల్లో ట్రాక్టర్లతో ఇసుకను దగ్గరలోని మామిడి తోటలో నిల్వ చేస్తారు. కొత్తగూడెం, ఖమ్మం తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారని పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనితో రెవిన్యూ అధికారులు స్పంధించారు. ఈనేపద్యంతో పక్కా సమాచారంతో తహశీల్దార్ దారా ప్రసాద్ ఆదేశాలతో శనివారం రాత్రి రెవిన్యూ అధికారులు, పోలీస్ సిబ్బందితో కలిసి మామిడి తోటను పరిశీలించారు. నిల్వ చేసిన సుమారు పది ట్రాక్టర్ల ఇసుకను గుర్తించి సీజ్ చేశారు. జిపిఓలు ముత్యం, శివశంకర్, రమేష్, పాల్వంచ గ్రామీణ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్

ప్రజాపక్షం/ భద్రాచలం : ఏడూళ్ళ బయ్యారం పాఠశాలలో జరిగే రాష్ట్ర, జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు పకడ్బంధీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్‌వి. పాటిల్ అన్నారు. పినపాక మండల పరిధి ఏడూళ్ళ బయ్యారం జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో ఈ నెల 8, 9,10 వ, తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి బాల బాలికల అండర్ 17 కబడ్డీ పోటీలు మరియు 2026 జనవరిలో నిర్వహించే జాతీయ స్థాయి బాలుర కబడ్డీ పోటీలకు సంభందించి జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ఈ సంధర్భంగా పినపాక జెడ్‌పిహెచ్ ఎస్‌హైస్కూల్ ఆవరణంలో కబడ్డీ పోటీల కోసం చేపటుతున్న ప్రాంగణ నిర్మాణం, కోర్టుల స్థల వ్యవస్థాపన, వసతి, భద్రతా చర్యలు, మౌళిక సదుపాయాల ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరుగబోయే కబడ్డీ పోటీలు భవిష్యత్‌లో జాతీయస్థాయి పోటీలకు వేదికగా మారబోతున్నాయని అన్నారు. జిల్లా ప్రతిష్టతకు ఏమాత్రం భంగం కలగకుండా ఏర్పాట్లు అత్యుత్తమంగా చేయాలన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలనుండి క్రీడాకారులు, అధికారులు, వీక్షకులు పెద్దసంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. వారికి ఎలాంటి లో టుపాట్లు తలెత్తకుండా సకల సౌకర్యాలు కల్పించటానికి ప్రణాళికా బ ద్ధంగా ముందుకు సాగాలన్నారు. క బడ్డీ పోటీల నిర్వాహణకు మొ త్తం నాలుగు కోర్టులను ఏర్పాటు చేయాలని, చూడటానికి వచ్చే వారి రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ట్రాఫిక్ కంట్రోల్ దృష్ట్యా కోర్టులను సముచిత దూ రంలో ఏ ర్పాటు చేయాలని ఆదేశించారు. పా ఠశాల ప్రహరిగోడను తాత్కాలికంగా తొలగించి పకనే ఉన్న అటవీశాఖ నర్సరీ ప్రదేశాన్ని వినియోగించడం ద్వారా స్థలం ఎక్కువగా అందుబాటులోకి వస్తుందన్నారు. దీనితో క్రీడలను సౌకర్యవంతంగా నిర్వహించగలుగుతామన్నారు. గ్రౌడింగ్ కోసం గ్రావెల్‌ను వెంటనే సమకూర్చి పనులు పూర్తి చేయాలని సంభంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యుత్, నీటి సరఫరా, శానిటేషన్, ఆరోగ్య శిభిరం, ఫస్ట్ ఏయిడ్ తదితర సదుపాయాలు,



పార్కింగ్ స్థలాలు, వాహనాల రాకపోకల నియంత్రణ, భద్రతా సిబ్బంది నియామకం వంటి అంశాలపై ప్రతిశాఖ సమన్వయంతో సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలనిసూ చించారు. యువజన సర్వీసులు మరి యు క్రీడాశాఖ, విద్యాశాఖ, పోలీస్‌శాఖ, పంచాయిరాజ్‌శాఖ, విద్యుత్, అటవీ, ఆరోగ్య శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలన్నారు.

## సింగరేణిలో మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల పరిష్కరించండి

### కూనంనేని సాంబశివరావుకు బాధితుల వినతి



ప్రజాపక్షం/సుజాతనగర్: సింగరేణిలో మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల పరిష్కారం కొరకు ఆదివారం కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుకు బాధితులు కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సింగరేణిలో 30 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకుని అనారోగ్య కారణాల వలన కార్పొరేట్ మెడికల్ బోర్డు వారిచే ఇన్వాలిడేట్ అయి, డిపెండెంట్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకుంటే విజిలెన్స్ అధికారులు మారుపేర్లతో ఉద్యోగం చేశారని, రెండు పేర్లు ఉన్నాయనే కారణంతో దరఖాస్తు చేసుకున్న మాకు డిపెండెంట్ ఉద్యోగం ఇవ్వకుండా గత 15 సంవత్సరాల నుండి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలియజేశారు. మాకు సకాలంలో సింగరేణి ఉద్యోగం రాక, ఎలాంటి ఉపాధి మార్గం లేక, ఎన్నో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ కుటుంబ పోషణ భారంగా వెళ్ళదీస్తున్నాము అన్నారు. గతంలో మారుపేర్ల సమస్యను పరిష్కరించి విజిలెన్స్ పెండింగ్ కేసుల బాధితులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని, సింగరేణి యాజమాన్యం, కార్మిక జాతీయ సంఘాలు కలిసి లేబర్ కమిషన్ సమక్షంలో ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు.పాయం సూరయ్య, వాసం రా ములు, భూక్య నాగేష్, భూక్య పాప, కేలోత్ జేత్యా, కేలోత్ రమేష్, పెం టయ్య, కేలోత్ బాలు, లాలు, నరేష్ పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/ములకలపల్లి: మండల పరిధిలోని పొగుళ్లపల్లి గ్రామంలో టిఎన్ఆర్ ట్రస్ట్ అధినేత నూతన గృహప్రవేశం కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాలు పాల్గొన్నారు. తన తండ్రి తాండ్ర నారాయణరావు పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్న తాండ్ర వెంకటేశ్వరరావుకు ఆ భగవంతుని ఆశీస్సులు కలగాలని ప్రార్ధించారు.గోపాల్‌రావు, సిపిఐ నాయకులు నరాటి ప్రసాద్, పలువురు సిపిఐ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 26న ఖమ్మంలో శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి

ప్రజాపక్షం/చింతకాని: డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ కు చింతకాని మండల వ్యాప్తంగా విరివిగా చందాలిచ్చి అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కొదుమూరు గ్రామంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. భారతదేశ గడ్డపై సిపిఐకి వందేండ్లన్నారు. దీనికి గుర్తుగా శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను నిర్వహిస్తున్నామని తెలిపారు.నాటి నుండి తాడిత , పీడిత ప్రజల కోసం ఎన్నో ప్రజాఉద్యమాలు నిర్వహించి పోరాటాలు చేసిన సిపిఐ కి చరిత్రలో తిరుగులేని స్థానం ఉందన్నారు. అనేక ప్రజా ఉద్యమాలను వందేండ్ల మహా ప్రస్థానంలో నిత్యం ప్రజాసమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐ సొంతమన్నారు.ఏ పార్టీకి లేని ఘన చరిత్ర సిపిఐ కి ఉందన్నారు. భూస్వాముల చెర నుండి లక్షలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచిపెట్టిన ఘన చరితను లిఖించుకున్న సిపిఐ శ తాబ్ది ఉత్సవాల ముగింపు సభకు చింతకాని మం డలం నుంచి అన్ని వర్గాల ప్రజలు అదిక సం ఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, పావులూరి మల్లిఖార్జున్, రవి, పార్టీ మండల కార్యదర్శి గోపాలరావు, ఏఐకెఎస్ మండల కార్యదర్శి వెంగళరావు, శాఖ కార్యదర్శి నిరుడు గోవిందరావు, మాజీ సర్పంచ్ సుజాత కృష్ణ, మాజీ ఎంపీటీసీ హేమ నాగార్జున, నాయకులు వెంకన్న, శ్రీను, వెంకటేశ్వర్లు, శ్రీను, హుస్సేన్,భాను పాల్గొన్నారు.



# గడప గడపకూ సిపిఐ

### వందేండ్ల చరిత్ర ప్రజల దరికి

### విరివిరిగా చందాలు ఇవ్వండి

ప్రజాపక్షం/పాల్వంచ : భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో అడుగిడి వందేండ్లు పూర్తి చేసుకొన్న సంధర్భంగా నిర్వహిస్తున్న శతాబ్ది ఉత్సవాలల్లో భాగంగా డిసెంబర్ 26న, ఖమ్మంలో జరిగే భారీ జన సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సబ్యులు ముత్యాల విశ్వనాధం పిలుపునిచ్చారు. మండల పరిధి పాండురంగాపురం, సూరారం గ్రామాలలో ఆదివారం శతాబ్ది ఉత్సవాల కరపత్రాలను ఇంటింటికి పంచిపెట్టారు. ప్రజల నుండి విరాళాలు సేకరించారు. ఈ సంద్బంగా విశ్వనాధం మాట్లాడుతూ గడప గడపకు సిపిఐ పార్టీ వందేండ్ల చరిత్రను ప్రజల దరికి తీసుకెళ్ళి పోరాటాలను, ఉద్యమాలను సబ్బండ వర్గాలకు తెలియజేయాలని పా ర్టీ శ్రేణులకు సూచించారు. బ్రిటీష్ పాలకుల చెరనుండి దేశాన్ని విముక్తి చేసేందుకు జరిగిన స్వాతంత్రోద్యమంలో సిపిఐ పాత్ర గొప్పదన్నా రు. సంపూర్ణ స్వాతం త్ర్యం కావాలని నినదించిన పార్టీ సిపిఐ అన్నారు. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేయటంతోనే పార్టీపై నిషేధం విధించారన్నారు. కాన్పూర్, మీట్, పెషావర్ తదితర కుట్ర కేసులను సిపిఐ నాయకులపై అక్రమం గా బనాయించి జైల్లో నిర్భంధించారని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం కార్మిక, విద్యార్థి, రైతు, యువజన, మహిళా తదితర ప్రజా సంఘాలను నిర్మించి నాటి నుండి నేటి వరకు అనేక ప్రజా ఉద్యమాలను చేసి ప్రజల గుండెల్లో నిలిచిన ఏకైక పార్టీ సిపిఐ అని పునరుద్ఘాటించారు. సిపిఐ వందేండ్ల చరిత్రను సాగించిన పోరాటాలను, చేపట్టిన ఉద్యమాలను, ప్రజలకు సాధించి పెట్టిన హక్కులను తెలియజేయాలన్నా రు. భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసి పేద ప్రజలకు లక్షలాది ఎకరాల భూములను పంచిపెట్టిన ఘన చరిత్ర సిపిఐ సొం తమన్నారు. డిసెంబర్ 26న, ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు వస్తున్నారని కావునా కర్షకులు, కార్మికులు, ఉద్యోగులు, మేదావులు, అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా కమిటి సబ్యులు ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, మండల కార్యవర్గ సబ్యులు మన్నెం వెంకన్న, నాయకులు జక్కుల లింగేశ్వర్, బానోత్ లచ్చిరామ్, లింగంపల్లి నాగేశ్వరరావు, చెన్నశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## నూతన పిఆర్‌సి నివేదికను వెంటనే ప్రకటించాలి

ప్రజాపక్షం/కారేపల్లి: తెలంగాణ రాష్ట్రంలోని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పిఆర్‌సి కమిటీ రిపోర్టును వెంటనే ప్రకటించి అమలు చేయాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ అన్నారు. సింగరేణి మండల 12వ మహా సభ ఖమ్మం యూటిఎఫ్ భవన్‌లో జరిగింది. టిఎస్‌యూటిఎఫ్ ప్రారంభించిన ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం ద్వారా మరణించిన 48 మందికి 6లక్షల చొప్పున 3కోట్ల రూపాయలు బాధిత కుటుంబానికి ఇచ్చి సామాజిక భాద్యతలో భాగంగా అయిందని తెలిపారు. కార్యదర్శులుగా పి రామారావు, ఎన్ శివకోటి, జీ సంతులాల్, ఏ సుజాత, జీ సిహెచ్ కృష్ణజ్యోతి, కే నరేంద్ర, ఎస్ పవన్ కళ్యాణ్, బి బాలకృష్ణ, డి కిరణ్, వీరితో పాటు అకడమిక్ కమిటీ కన్వీనర్ డీ ఈర్య, మహిళా కన్వీనర్ బి సునీత, క్రీడా కన్వీనర్ శ్రీరాములు, సాంస్కృతిక కమిటీ కన్వీనర్ మత్తోజ్ సోమయ్యచారి, సోషల్ మీడియా కన్వీనర్ బానోత్ మురళి, అలాగే మండలంలోని అన్ని కాంప్లెక్స్ లకు కన్వీనర్, కో కన్వీనర్‌లను ఎన్నుకున్నారు. ఈ మహాసభకు భారీ మొత్తంలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేశారు.



## చలికాలంలో హైబిపి పేషెంట్లు అప్రమత్తంగా ఉండాలి

### విజయవంతమైన వైద్యశిబిరం



ప్రజాపక్షం/ బోనకల్ : చలికాలంలో హైబిపి పేషెంట్లు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ బిపి షుగర్ జనరల్ వైద్య నిపుణులు టి.పవన్‌కుమార్, కార్డియాలిజిస్ట్ గుదికొండ కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో అమరజీవి తూము ప్రకాశ్‌రావు జ్ఞాకార్థం ప్రతి ఆదివారం నిర్వహించే వైద్యశిబిరంలో భాగంగా ఆదివారం నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో హైబిపి అనేది చాలా మందికి వస్తోందని, ఒకప్పుడు కేవలం వయస్సు మీద పడిన వాళ్లకే వచ్చేదని అన్నారు. కాని ఇప్పుడు యుక్త వయస్సులో ఉన్నవారు కూడా హైబిపి బారిన పడుతున్నారని అన్నారు. ఇందుకు ఒత్తిడే ప్రధాన కారణమని తెలుస్తోందని, దీని వల్ల చాలా మందికి గుండె జబ్బులతో పాటు హార్ట్ ఎటాక్‌లు వస్తున్నాయన్నారు. పలు అధ్యయనాల ప్రకారం చలికాలంలో హార్ట్ ఎటాక్‌లు ఎక్కువగా వస్తాయని తేలిందని, ఈ సీజన్‌లో రక్త ప్రసరణ సరిగ్గా ఉండదని, దీంతో బిపి పెరిగి ఫలితంగా హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా అధికంగా మాంసం తినేవారికి, మద్యం తాగే వారికి గుండె జబ్బులు ఎక్కువగా వస్తాయని, చలికాలంలో వీలైనంత వరకు వాటికి దూరంగా ఉండాలన్నారు.

## భవనం కోసం భగ్గుమన్న మణుగూరు..

ప్రజాపక్షం/మణుగూరుః ప్రశాంత రాజకీయ వాతావరణానికి నిలయమైన మణుగూరు ప్రాంతంలో పార్టీ భవనం కోసం మంటలు భగ్గుమన్నాయి.. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యేల మధ్య వైరం మరోసారి మంటల రూపంలో బట్టబయలైంది. సాధారణ పార్టీ కార్యాలయ భవనం విధంశాలకు నిలయంగా మారిన సంఘటన మణుగూరులో చోటు చేసుకుంది. ఆదివారం ఉదయం 9 గంటలకు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుండి కార్యకర్తలు పట్టణంలోని క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు.అనంతరం కార్యాలయాన్ని ఆక్రమించుకొని కార్యాలయానికి రం గులు మార్చి కార్యాలయం పై కాంగ్రెస్ జెండాను పెట్టి కార్యాలయానికి భవన్ భవనంగా నామకరణం చేసి కార్యాలయాన్ని కాంగ్రెస్ ఆధీనులకు తెచ్చుకున్నారు.

### మా పార్టీ కార్యాలయాన్ని మేమే స్వాధీనం చేసుకున్నాం

గత 30 సంవత్సరాల క్రితం మణుగూరు కి చెందిన పిల్లారి శెట్టి గాంధీ బాబు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కోసం స్థలాన్ని పార్టీకి దానమిచ్చారని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ చెందిన స్థలంలో ఆ తర్వాత కాలంలో వచ్చిన రేగా కాంతారావు కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కాంగ్రెస్ పార్టీ సహకారంతో ఇక్కడ భవనం నిర్మించారని, ఈ కార్యాలయం నుండే కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు నిర్వహణ జరిగేదని, 2019 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన రేగా కాంతారావు టిఆర్ఎస్ పార్టీ తీర్థం తీసుకొని, కాంగ్రెస్ కార్యాలయాన్ని కూడా కబ్జా చేశారని, అధికార బలంతో కాంగ్రెస్ కార్యకర్తలను భవనం చుట్టుపక్కలకు రాకుండా నిరుక్షంగా కార్యాలయాన్ని కబ్జా చేశాడని, నేడు మేము మా పార్టీ కార్యాలయాన్ని మేమే స్వాధీనం చేసుకున్నామని నేతలు అంటున్నారు.



### భౌతిక దాడులకు భయపడేది లేదు.. న్యాయంగా పోరాడుతాం.. రేగా కాంతారావు

నేను లేని సమయం చూసి భౌతిక దాడులు చేస్తే చూస్తూ ఊరుకోనని, దాడులకు ప్రతి దాడులు చేయగల సత్తా నాకు ఉందని, నేను చేయదలిస్తే మణుగూరు భగ్గు మంటుందని రేగా వ్యాఖ్యానించారు. టిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్న అనంతరం సాయంత్రం ఐదు గంటలకు రేగా కాంతారావు మణుగూరు చేరుకొని టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎవరు అధైర్య పడవద్దని, రెచ్చగొట్టే మాటలకు ఎవరు మెచ్చిపోవద్దని తప్పు చేసిన వాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి బిఆర్ఎస్ పార్టీ లీగల్ టీం సిద్ధంగా ఉందని, భౌతిక దాడి ద్వారా అందరూ ఒకేసారి మనకు చిక్కారని న్యాయపరంగా ఒక్కొక్కరి అంతు చూసే వరకు వదిలిపెట్టేది లేదని, రాష్ట్రంలో నడుస్తున్న అరాచక పాలనకు మణుగూరు సంఘటన నిదర్శనం అని, భౌతిక దాడులకు భయపడే ప్రసక్తి లేదని టిఆర్ఎస్ పార్టీ ఉద్యమ పార్టీ అని ఈ సంఘటన ఉద్యమంలో తీసుకొని ముందుకు వెళతామని పార్టీ కార్యకర్తలు అందరూ సమన్వయంతో ఉండాలని ఆయన కోరారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన రేగా కాంతారావు పార్టీ మారి పార్టీని స్వాధీనం చేసుకున్నాడు.. నేడు అదే కర్మ సిద్ధాంతం పునరావృత్తమైందని, కర్మ ఎక్కడికి పోదని, పార్టీ ఆఫీసు రంగులు మారడం తప్ప మణుగూరు ప్రజల తల రాతలు మారటం లేదని, మణుగూరు పట్టణం ఇసుక మాఫియా తప్ప రోడ్ల అభివృద్ధి లేదని, ప్రధాన రహదారి పరిస్థితి చాలా అధ్వానంగా ఉందని, రోడ్డు ప్రమాదాలకు కేరాఫ్ నిలయంగా మారిందని, ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవటం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## రైతులు అధైర్య పడకండి అండగా ఉంటాం

ప్రజాపక్షం/భూపాలపల్లి :మొంత తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులు ఎవరు అధైర్య పడరాదని ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని మండలంలోని గుమ్మడివెల్లి గ్రామంలో ఎమ్మెల్యే వ్యవసాయ అధికారులతో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రెండు రోజుల క్రితం మొంత తుఫాను ప్రభావంతో వరి, పత్తి, మిరప తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఎవరు అధైర్య పడరాదని ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని అన్నారు. మన రైతులు అనేక కష్టాలు పడి పండించుకున్న పంట ఒక్క రాత్రిలో తుఫాన్ వల్ల నాశనం అయిందని అన్నారు. రైతుల చెమట చుక్కల విలువ తెలిసిన ప్రభుత్వం మనది. తుఫాన్ తో నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని మన ధైర్యాన్ని కల్పించారు. ప్రభుత్వం పక్షాన రైతు బాటలో ఉండని, రైతు కష్టానికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రైతు క్షేత్రాలను పరిశీలించిన అధికారులు



ప్రజాపక్షం/జనగామ: మొంథా తుఫాన్ తాకిడికి గురై నష్టపోయిన రైతుల క్షేత్రాలను వ్యవసాయ శాఖ అధికారులు ఆదివారం జిల్లా వ్యాప్తంగా పరిశీలించారు. జిల్లాలోని అన్ని మండలాలలో తుఫాన్ తాకిడికి రైతుల వరి, పత్తి పంట నష్టపోయినందున దానికి సంబంధించిన వివరాలను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం క్షేత్రస్థాయిలో పర్యటించి నమోదుచేస్తున్నారు. జిల్లా వ్యవసాయాధికారి అంబికా సోని జిల్లాలోని దేవరుప్పుల మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన మధు, కుమార్ కి చెందిన 6 ఎకరాల పత్తి పంటను పరిశీలించారు. అనంతరం పాలకుర్తిలోని లక్ష్మి నారాయణపురం, గూడూరు, జాఫర్గఢ్ లోని తిమ్మాపూర్ గ్రామంలో పంటను పరిశీలించారు. రైతులు సమ్మయ్య, సాగరం గ్రామానికి చెందిన శ్రీనివాస్ తో మాట్లాడారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



ప్రజాపక్షం/ నర్సంపేట : ప్రభుత్వం మద్దతు కల్పించేందుకు ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదలు అన్నారు. నర్సంపేట పట్టణంలోని, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లలో పత్తి, మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు వారు కోరుకున్న రోజే స్లాట్ బుకింగ్ చేసుకొని పత్తి తీసుకువస్తే కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా ధ్యానం, మొక్కజొన్న రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయవద్దని అధికారులను, వ్యాపారులను ఆదేశించారు. రైతులు కూడా తేమ శాతం ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండేలా చూసుకొని తీసుకురావాలని కోరారు .ఈకార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్డీఓ రాంరెడ్డి, ఆర్డీవో ఉమారాణి , డిసిఓ నీరజ ,డీఎం సివిల్ సప్లయర్ సంధ్యారాణి , డిసిఎస్ఓ కిష్టయ్య,మార్కెట్ ఛైర్మన్ పాలాయి శ్రీనివాస్, హరీశ్ రెడ్డి, పిసిసి మెంబర్లు రంజిత్ రెడ్డి, రామానంద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి తదితర నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లి దేవాలయ వార్షిక మహోత్సవానికి ఎంపి కావ్య



ప్రజాపక్షం/హసన్‌పర్తి : హసన్‌పర్తి మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి దేవాలయంలో ఐదవ వార్షికోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పెద్దమ్మతల్లి సమేత పెద్దిరాజు స్వామి వార్ల కళ్యాణ మహోత్సవంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగాహాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఎంపికి దేవస్థాన కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తరువాత ఎంపీ డాక్టర్ కడియం కావ్య పెద్దమ్మతల్లి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, అమ్మవారి కరుణ కటాక్షాలతో ప్రతి కుటుంబం సుఖశాంతులతో, ఆరోగ్యంగా, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాఅని అన్నారు. గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేసిన దేవాలయ అభివృద్ధికి, సదుపాయాలపై అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ముదిరాజ్ కమ్యూనిటికీ భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఎంపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కమిటీ అధ్యక్షులు పృథ్వీరాజ్, డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, మాజీ అధ్యక్షులు పెద్దమ్మ నరసింహరాములు, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, వీసం సురేందర్ రెడ్డి, జన్ను రవీందర్, పుల్ల రవీందర్, కిరణ్, సురేష్, గంగన్న, రాజు, మహిళ డివిజన్ అధ్యక్షురాలు అనూష ఇతర ప్రజా ప్రతినిధులు, దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి: రవీంద్ర నాయక్



ప్రజాపక్షం / వరంగల్ : వరద ప్రభావిత ప్రాంతాలలో వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకుంటూ వైద్యాధికారులు, సిబ్బంది వచ్చే వారం రోజులపాటు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ డి .రవీంద్ర నాయక్ ఆదేశించారు. ఆదివారం ఆయన హనుమకొండ వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ ఏ అప్పయ్య, డాక్టర్ బి సాంబశివరావులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి అక్కడ తీసుకుంటున్న చర్యలు , నిర్వహిస్తున్న వైద్య శిబిరములను పరిశీలించారు. బృందావన్ కాలనీ, ఎన్టిఆర్ నగర్, వరంగల్ లో సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న వైద్య శిబిరమును సందర్శించారు. ఈ సందర్భంగా ఎంజిఎం వైద్యాధికారి డాక్టర్ అర్చన ను గత మూడు రోజులుగా వారి పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే వివరాలు , నిర్వహిస్తున్న వైద్య శిబిరములు , క్యాంపులకు చికిత్స నిమిత్తం ఎలాంటి సమస్యలతో వస్తున్నారు. తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నీరు నిలువ ఉండడం , నీరు,ఆహార పదార్థాలు కలుషితం కావడం , పరిశుభ్రతకు సంబంధించిన సమస్యల వల్లఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది కాబట్టి వారం రోజులపాటు అప్రమత్తంగా ఉంటూ ఇంటింటి సర్వే నిర్వహిస్తూ చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు చికిత్స అందిస్తూ అవసరమైన వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేయాలని, అలాగే కలుషిత నీరు ఆహార పదార్థాల ద్వారా డయేరియా ,డీసెంట్రీ వంటి వ్యాధులు రాకుండా వారికి త్రాగునీరు అలాగే తినే ఆహార పదార్థాల గురించి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించాలన్నారు. అనంతరం హనుమకొండ డిఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారులతో,ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పరిస్థితిని సమీక్షించిన అనంతరం వచ్చే వారం రోజులపాటు వైద్యాధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని , కలుషిత నీరు కలుషిత ఆహార పదార్థాల వలన అలాగే దోమల వలన వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ సిబ్బందితో సమన్వయంగా పనిచేస్తూ ఉండాలన్నారు. ఈ సమావేశంలో వరంగల్ డిఎంహెచ్వో డాక్టర్ బి సాంబశివరావు, హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్ ఏ అప్పయ్య, అడిషనల్ డీఎంహెచ్వో డాక్టర్ టి మదన్మోహన్రావు , టీబీ నియంత్రణాధికారి డాక్టర్ హిమబిందు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఇక్తదార్ అహ్మద్ , డాక్టర్ జ్ఞానేశ్వర్,డాక్టర్ మంజుల, జిల్లా మాస్ మీడియా అధికారి వి అశోక్ రెడ్డి, వరంగల్ డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ ప్రకాష్ డాక్టర్ కొమురయ్య , డాక్టర్ మోహన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## ముంపు ప్రభావిత ప్రాంతాల్లో

# నష్టంపై త్వరగా సర్వే

హనుమకొండ

కలెక్టర్ స్నేహ శబరీష్



ప్రజాపక్షం/హనుమకొండ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన కాలనీల్లో జరిగిన నష్టంపై ప్రాథమిక అంచనా కోసం చేపట్టిన సర్వేను త్వరగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సర్వే బృందాలను ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నగరంలోని ముంపునకు గురైన పలు కాలనీల్లో జరిగిన ఇండ్లు, ఇంట్లోని సామగ్రి, వాహనాలు, తదితరాలకు నష్టం వాటిల్లగా ప్రభుత్వం నుండి పరిహారం అందించేందుకు ప్రాథమిక అంచనాకు సర్వే బృందాలు ముంపు కాలనీల్లో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నాయి. సర్వే బృందాలు ఉదయం 8 గంటల నుండి వరద ముంపునకు గురైన కాలనీల్లో ఇంటింటికి చేరుకుని ఆన్లైన్ యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. వరద ముంపునకు లోనైన సమ్మయ్య నగర్, అమరావతి నగర్, వివేక్ నగర్, టీవీ టవర్ కాలనీ, గుండ్ల సింగారం ఇందిరమ్మ కాలనీ, రాయపుర, ఇతర కాలనీలలో ఆన్లైన్ యాప్ ద్వారా 146 మంది సిబ్బంది 61కాలనీల్లో జరిగిన నష్టంపై బాధిత కుటుంబాల నుండి వివరాలు నమోదు చేస్తున్నారు. జరిగిన ఆస్తి, వస్తువులు, వాహనాల వివరాలతో కూడిన ఫోటోలను ఆన్లైన్లో నమోదు చేస్తున్నారు. ముంపు కాలనీల్లో జరిగిన నష్టం వివరాల నివేదిక ఆధారంగా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా పరిహారం అందనుంది. సర్వే బృందాలను వీలైనంత త్వరగా వరద ముంపు ప్రభావిత కాలనీల్లో జరిగిన నష్టంపై సర్వేను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సర్వే ప్రగతిని కలెక్టర్ ఎప్పటికప్పుడు అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. కాలనీల్లో అధికారుల సమక్షంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వేను కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. హనుమకొండలోని రాయపురా, ఇతర కాలనీలో సర్వే బృందాలు నమోదు చేస్తున్న వివరాలను ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ పరిశీలించారు. అదేవిధంగా హనుమకొండ, కాజీపేట, హసన్ పర్తి తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, భావ్ సింగ్, చల్లా ప్రసాద్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాజీపేట డివిజన్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ సర్వే బృందాలను మార్గనిర్దేశం చేస్తున్నారు.

**కొనసాగుతున్న సహాయక చర్యలు:** తీవ్ర వరద ముంపునకు గురైన కాలనీల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వివేక్ నగర్, అమరావతి నగర్, సమ్మయ్య నగర్, టీవీ టవర్ కాలనీ, జవహర్ కాలనీ, న్యూ శాయంపేట రోడ్డు, తదితర కాలనీల్లో వరద ఉధృతికి కొట్టుకు వచ్చిన బురద, చెత్తాచెదారాన్ని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది తొలగిస్తున్నారు. ఇండ్లతోపాటు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల నుండి బురద మట్టిని, చెత్తా చెదారాన్ని తీసేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ పనులు ముమ్మరంగా సాగుతుండగా సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ రవీందర్, తహసిల్దార్లు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు.

**వివరాల నమోదును పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో హనుమకొండలోని పలు కాలనీల్లో వరద ముంపుతో ఇండ్లు, సామగ్రి, ఇతరత్రా నష్టం కలుగగా శనివారం సర్వే బృందాలు సేకరించిన వివరాలను కలెక్టరేట్ కార్యాలయంలో కంప్యూటరీకరణ చేస్తుండగా ఆదివారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. డేటా ఎంట్రీ సిబ్బంది ముంపు కాలనీల్లో నష్టపోయిన వారి వివరాలను నమోదు చేస్తుండగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సేకరించిన అన్ని వివరాలను డేటా ఎంట్రీ చేయాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. సర్వే వివరాలను సోమవారం నాటికి ఆన్లైన్ చేయాలన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, హనుమకొండ, కాజీపేట తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, భావ్ సింగ్, ఇతర అధికారులు ఉన్నారు.

## రవీందర్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



ప్రజాపక్షం/ములుగు: విధి నిర్వహణలో అసువులు బాసిన గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ ధరావత్ రవీందర్ కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఏఐటియుసి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. శనివారం దేవగిరిపట్నం గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తూ మృతి చెందిన ధరావత్ రవీందర్ అంతిమయాత్రంలో పాల్గొన్న జంపాల రవీందర్ మాట్లాడుతూ నామమాత్రపు వేతనాలతోని గ్రామ పంచాయతీలలో మల్టీపర్పస్ వర్కర్స్‌గా పనిచేస్తూ, అవే వేతనాలతో జీవనం సాగిస్తున్న కుటుంబాలు, కార్మికుడు మృతి చెందితే ఆ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు ఉన్నాయన్నారు. అందుకే వివిధ కారణాల ద్వారా అసువులు బాసిన మల్టీపర్పస్ వర్కర్స్ కానీ, కారోబార్లుగా పనిచేస్తున్న వారికి కానీ ఎలా మృతి చెందినా రూ.10లక్షలు ఆ కుటుంబానికి అందించే విధంగా పంచాయతీరాజ్ శాఖ చర్యలు తీసుకోవాలని అన్నారు. అందులో భాగంగా నిన్న మృతి చెందిన ధరావత్ రవీందర్ కుటుంబానికి పది లక్షలు అందించే విధంగా జిల్లా పంచాయతీ అధికారి కృషి చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా ములుగు జిల్లా కేంద్రానికి సంబంధించిన బలుగూరి సారయ్య విధి నిర్వహణలో మృతి చెందినప్పుడు అధికారులందరూ పరిహారం అందిస్తామని చెప్పి ఆ మాటలు విస్మరించారన్నారు. అందుకే ధరావత్ రవీందర్ కుటుంబానికి చెల్లించని పక్షంలో జిల్లాలోని పంచాయతీ కార్మికులందరిని సమీకరించి ఏఐటియూసి ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం ముట్టడి చేయడం జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి నిరంజన్‌తో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి మండల సహాయ కార్యదర్శి బోడ రమేష్, కారోబార్ మధార్, మహ్మద్ నజ్మ, తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బొడిమె సదయ్య, కార్మిక సంఘం నాయకులు చిలువేరు రవి, కుడికాల సమ్మయ్య, తప్పెట్ల మల్లయ్య, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు అన్ని విధాలా సహకారం

నగర మేయర్ గుండు సుధారాణి



ప్రజాపక్షం/ఖిలా వరంగల్ : వరద ప్రభావిత బాధితులకు అన్ని విధాల సహకారం అందిస్తామని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఆదివారం వరంగల్ పరిధిలో వరద ప్రభావానికి గురైన ఎన్‌టిఆర్ కాలనీ, రామన్నపేట, సంతోషిమాత కాలనీ ఫేజ్ 1, ఫేజ్ 2, గంగ పుత్ర కాలనీ ప్రాంతాలలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించి సమర్థవంతంగా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వరదల వలన నష్టపోయిన గృహాలను గుర్తించి సంబంధిత సమాచారాన్ని నమోదు చేయడం జరుగుతుందని భారీ వర్షాల వలన ఏర్పడిన బురదతో పాటు చెత్తా, చెదారం తొలగింపు ప్రక్రియ జరుగుతున్న విధానాన్ని పరిశీలించిన మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశం మేరకు కొనసాగుతున్న అసెస్మెంట్‌ను మేయర్ కమిషనర్ ఇరువురు పరిశీలించారు. వార్డు ఆఫీసర్లు రెవెన్యూ సిబ్బంది జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి అంచనా వేసి వాస్తవ సమాచారాన్ని అందజేయాలని వరంగల్ ప్రాంతంలో 5 జెసిబిలు హన్మకొండ ప్రాంతంలో 6 జెసిబిలు, ట్రాక్టర్‌ల సహాయంతో వరద వలన ఏర్పడిన బురదను తొలగించడం జరుగుతుందని అన్నారు. హన్మకొండ ప్రాంతంలోని ప్రగతినగర్, వివేక్‌నగర్, కాలనీ ప్రాంతాల్లో పర్యటించిన మేయర్ వదర ముంపుకు గురైన ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి మాట్లాడుతూ వరద ప్రభావంతో ఏర్పడ్డ బురద వ్యర్థాలను తొలగించడానికి 3 జెసిబిలు హిటాచీ యంత్రాలను వినియోగించి ట్రాక్టర్‌ల ద్వారా చెత్తను తొలగిస్తున్నామని ఈ సందర్భంగా మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, సానిటరీ సూపర్‌వైజర్‌లు గోల్కొండ శ్రీను, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ మెగా టెక్‌టైల్స్ పార్క్‌లో వరద నీరు

పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద



ప్రజాపక్షం / వరంగల్ : ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గీసుగొండ మండలంలోని కాకతీయ మెగా టెక్‌టైల్స్ పార్క్‌లో వరద నీరు చేరిన పరిస్థితిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ టెక్‌టైల్స్ పార్క్ వద్ద గల నాలను, రాళ్ళమాటు చెరువు మత్తడిని కలెక్టర్ పరిశీలించారు. టెక్‌టైల్స్ పార్క్ పరిసరాలను కలెక్టర్ పరిశీలించి వర్షపు నీరు పార్క్ ప్రాంతంలోకి ఎలా ప్రవేశించిందని, దానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాళ్ల మాడు చెరువు, పార్కు కు పై భాగంలో ఉన్న బొల్లి కుంట, సంగెం గ్రామాల నుండి వరద నీరు ప్రవహించి టెక్టైల్ పార్క్ లో చేరుకున్నదని అధికారులు వివరించారు. పరిశ్రమల కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా నాలా రిటేనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టుటకు చర్యలు అధికారులను సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు మరలా తలెత్తకుండా తగిన శాశ్వత చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. అనంతరం సంగెం మండలానికి వెళ్లే రహదారిలో గల కల్వర్టును కలెక్టర్ పరిశీలించి కల్వర్టును బలోపేతం చేయుటకు మరమ్మతులు చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఈఈ సునీత, ఆర్ అండ్ డిఈ, డీఈ వేణు, తాహసిల్దారులు రియాజుద్దీన్, రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## అవసరార్థులను ఆదుకోవడంలో లయన్స్ ఇంటర్నేషనల్ ముందంజ

లయన్స్ ఇంటర్నేషనల్ 320ఎఫ్ డిస్ట్రిక్ గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య



ప్రజాపక్షం/ములుగు: అవసరార్థులను ఆదుకోవడంలో లయన్స్ ఇంటర్నేషనల్ ముందుంటుందని లయన్స్ ఇంటర్నేషనల్ 320ఎఫ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య అన్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, ఉమెన్ ఓరియంటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఫ్లడ్ రిలీఫ్ సర్వీస్ ఆక్టివిటీ ద్వారా గత కొన్ని రోజులుగా అకాల వర్షాల వలన నష్టపోయిన నిరుపేద కుటుంబాలకు 13 రకాల వస్తువులతో కూడిన ఒక కిట్ దాదాపు 1500 విలువ చేసే కిట్ బ్యాగును ఒక బ్లాంకెట్‌ను సుమారు 200 కుటుంబాలకు అందజేయబడిందని ములుగు వెంకటాపురం గ్రామాల ప్రజలకు సర్వీస్ ఆక్టివిటీ కింద ఈ యొక్క కిట్ బ్యాక్ బ్లాంకెట్‌ను లయన్స్ ఇంటర్నేషనల్ 320ఎఫ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్య మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ అవసరార్థులను ఆదుకోవడంలో ముందుంటుందని ఈ ప్రాంతాలలో ములుగు లయన్స్ క్లబ్ యొక్క సేవలు మరువలేనివని అవసరార్థులను ఆదుకోవడంలో ముందుంటున్నారని అన్నారు. లయన్స్ క్లబ్ ములుగు ఆధ్వర్యంలో పర్మినెంట్ ప్రాజెక్టు కింద జనరిక్ మెడికల్ షాపు ఎంతో మంది పేద ప్రజలకు సర్వీస్ అందిస్తుందని అన్నారు. పిడిజి పొట్లపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ఎక్కడో చికాగో పట్టణంలో ప్రారంభమైన లయన్స్ సేవా సంస్థలు ఈ రోజు మారుమూల ప్రాంతాలలో కూడా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విడిజి హరికిషన్ రెడ్డి, డిసిఎస్ ఆర్ ప్రకాశం, డిసిటి సిహెచ్ రఘునాథరెడ్డి, డిస్ట్రిక్ చీఫ్ సెక్రటరీ సర్వీస్ మార్గం ప్రభాకర్, డిసిసి జి సురేష్ కుమార్, జిఎస్‌టి రేపూరి రమణారెడ్డి, ఆర్‌సి రాజేందర్, తిరుపతి, ములుగు లయన్స్ క్లబ్ సెక్రటరీ లయన్ చుంచు రమేష్, ట్రెజరర్ ఆడెపు రాజు, లిటిల్ ఫ్లవర్ స్కూల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చెన్నకేశవులు



ప్రజా పక్షం/నెక్కొండ: సిపిఐ వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యునిగా నెక్కొండ మండలానికి చెందిన కందిక చెన్నకేశవులు ఎంపికయ్యారు. తమ్మెర భవన్‌లో జరిగిన సిపిఐ జిల్లా సమితి సమావేశంలో ఎన్నికను జిల్లా కార్యదర్శి షేక్ భాషమియా ప్రకటించారు. విద్యార్థి దశ నుంచే సిపిఐ అనుబంధ సంఘాల్లో చురుకుగా పనిచేస్తూ కార్మిక నాయకుడిగా, నెక్కొండ మండల కార్యదర్శిగా, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడిగా సేవలందించిన చెన్నకేశవులు ఉద్యమ పటిమను గుర్తించి ఈ అవకాశం కల్పించినట్లు తెలిపారు.

## ప్రజల సహకారంతోనే నియోజకవర్గ అభివృద్ధి

గణపురం పోలీస్ స్టేషన్ ప్రహరీ గోడ, షాపింగ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన



ప్రజాపక్షం/భూపాలపల్లి : ప్రజలు, అధికారుల సహకారంతోనే భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి నియోజకవర్గం గణపురం పోలీస్ స్టేషన్ ప్రహరీ గోడ, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే లతో కలిసి భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు, అధికారులు అందరి సహకారంతోనే భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమన్నారు. అదేవిధంగా, గాంధీనగర్ నుండి జంగాలపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులకు రూ.20 కోట్ల నిధులు, హనుమాన్ కట్ట నుండి కొత్తపల్లి వరకు రూ.18 కోట్ల నిధులతో సిడిఎఫ్ నిధులతో పాటు కేంద్ర నిధులతో మండల కేంద్రాన్ని టూరిజం హబ్ గా అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కోటగుళ్ళు, రెడ్డిగుళ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. త్వరలోనే కాటేజిలతో పాటు బోటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. స్టేషన్ ఆవరణలో 2 ఎకరాల స్థలం ఉందని అందులో పోలీసుల కొత్త క్వార్టర్స్ నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, గణపురం సర్కిల్ సీఐ కరుణాకర్ రావు, గణపురం ఎస్సై అశోక్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఉన్నారు.

## ఉన్నతాధికారుల వేధింపులతోనే జాలింషా మృతి

లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పూల్‌సింగ్ ఆరోపణ



ప్రజాపక్షం/మహాదేవపూర్: ఉన్నతాధికారుల వేధింపుల వల్లనే పలిమెల సెక్షన్ అధికారి జాలిం షా మృతి చెందాడని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పూల్ సింగ్ ఆరోపించారు.ఆదివారం మండలకేంద్రంలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెక్షన్ అధికారి జాలింషా మృతికి కారణమైన అధికారులను ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసారు.ఓ రైతు చెట్లు నరికిన విషయంపై 80 వేలు ఫైన్‌తోపాటు సస్పెంచ్ చేస్తామని జిల్లా స్థాయి ఉన్నతాధికారులు బెదిరింపులకు గురి చేయడంతో జాలింషా మానసిక వేదనకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేసారు.ఇదే కాకుండా గతంలో నిధులు స్వాహా చేసారని ఆరోపించారు.దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారన జరిపి జాలింషా మృతికి కారణమైన అధికారులను విధుల నుండి తొలగిస్తూ మృతుని కుటుంబానికి 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా,కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్,లండాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ముకులోత్ శ్రీనివాస్ నాయక్,ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మహా ముత్తారం మండల గౌరవ అధ్యక్షుడు లింగమల్ల సదవల్లి రావు,మండల అధ్యక్షుడు రామగిరి రాజు,రేకెల్లి లక్ష్మణ్,పంగా సురేందర్ పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు కొట్టుకు పోయిన ర్యాంపు



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు హనుమకొండలోని హనుమాన్ నగర్ లో రోడ్డు పై ర్యాంపు వరదలకు కొట్టుకు పోయింది. దీంతో ఆ ప్రాంతంలో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. పెగడపల్లి డబ్బాల నుండి గుండ్ల సింగారం వెళ్లే దారిలో ప్రధాన రోడ్డుకు అనుసంధానంగా హనుమాన్ నగర్ ఫేస్2 కాలనీ వద్ద ర్యాంపు నిర్మించారు. ఈ ర్యాంపు వరదలకు కొట్టుకు పోయి వాహనాలు వెళ్లే వీలు లేకుండా అయింది. దీంతో గత నాలుగైదు రోజులుగా హనుమాన్ నగర్ ఫేస్ 2 కాలనీ వాసులు రోడ్డు పైకి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై దృష్టి సారించాలని వేడుకుంటున్నారు. రోడ్డు పైకి వాహనాలు వెళ్లే అవకాశం లేకుండా ఉండడంతో దూరంగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తున్నదని, తక్షణమే ర్యాంపు నిర్మించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# క్రీడ

## దంచేసిన సుందర్..

### భారత్ ఘన విజయం

పొట్టి సిరీస్‌లో భారత జట్టు బోణీ కొట్టింది. గెలవక తప్పని మ్యాచ్‌లో సమిష్టి ప్రదర్శనతో ఆస్ట్రేలియాకు చెక్ పెట్టింది. కంగారులు నిర్దేశించిన 187 పరుగుల ఛేదనలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(24), తిలక్ వర్మ(2 9)లు దూకుడుగా ఆడారు. నాథన్ ఎల్లిస్ మూడు వికెట్లు తీసినా ఆసీస్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు వాషింగ్టన్ సుందర్(49 నాటౌట్). డెత్ ఓవర్లలో రెచ్చిపోయిన వాషీ.. జితేశ్ శర్మ(22 నాటౌట్) జతగా ధనాధన్ ఆడి అద్భుత విజయాన్ని అందించాడు. ఐదు టీ20ల సిరీస్‌లో మొదటి మ్యాచ్ వర్షార్పణం కాగా.. ఇరుజట్లు చెరొక విజయంతో 1–1తో సమంగా ఉన్నాయి. ఆసియా కప్ ఛాంపియన్‌గా తొలి టీ20 సిరీస్ ఆడుతున్న భారత జట్టు విజయంతో సిరీస్‌లో నిలిచింది. రెండో మ్యాచ్‌లో పేస్‌కు పడిపోయిన టీమిండియా ఈసారి పక్కా వ్యూహంతో ఆసీస్‌ను దెబ్బకొట్టింది. విజయంతో సిరీస్‌లో ముందంజ వేయాలనుకున్న ఆతిథ్య జట్టు ఆశలకు చెక్ పెట్టింది.



### ఎల్లిస్ దెబ్బతీసినా..

మూడో టీ20లో ఆస్ట్రేలియాను కట్టడి చేసిన భారత్ ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(25) సిక్సర్లతో దడ పుట్టించాడు. తొలి ఓవర్లోనే సిక్సర్ల్ బాదిన అభిషేక్.. సీన్ అబాట్ వేసిన రెండో ఓవర్ చివరి మూడు బంతులను 4, 6, 4 గా మలిచాడు. అయితే.. రెండో టీ20లో హేజిల్‌వుడ్ మాదిరిగా నాథన్ ఎల్లిస్(3–36) ఈసారి దెబ్బకొట్టాడు. చితక్కొడుతున్న అభిషేక్‌ను షార్ట్‌పిచ్ బంతితో బోల్తా కొట్టించిన ఎల్లిస్ కాసేపటికే ఫామ్‌లో లేని శుభ్‌మన్ గిల్(15)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. మూడు వికెట్లు పడినా తన దైన షాట్లతో అలరించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(24) టిమ్ డేవిడ్ ఓవర్లో మిడాన్ దిశగా సులువైన క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ప్రధాన ఆటగాళ్లు ఔటైనా.. తిలక్ వర్మ(29) జతగా అక్షర్ పటేల్(17) ధనాధన్ ఆడాడు. నాలుగో వికెట్‌కు 35 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని ఎల్లిస్ విడదీశాడు. అయినా సరే.. వాషింగ్టన్ సుందర్ (49 నాటౌట్) మాత్రం తడబడకుండా అబాట్ వేసిన 14వ ఓవర్లో రెచ్చిపోయిన అతడు వరుసగా 4, 6, 6 తో 19 రన్స్ పిండుకున్నాడు. కానీ.. ఆ మరుసటి ఓవర్లోనే బార్ట్‌లెట్ సంధించిన స్లో డెలివరీకి తిలక్ వికెట్ కీపర్‌కు దొరికాడు. జితేశ్ శర్మ(22 నాటౌట్) అండగా మరో వికెట్ పడకుండా జట్టును గెలిపించారు. 19వ ఓవర్ మూడో బంతికి జితేశ్ బౌండరీ బాదడంతో 5 వికెట్ల తేడాతో టీమిండియా జయకేతనం ఎగురవేసింది. భారత్, ఆస్ట్రేలియా మధ్య నాలుగో టీ20 నవంబర్ 6న జరుగనుంది.

### దేవిడ్ స్టోయినిస్ చెలరేగగా

టాస్ ఓడి బౌలింగ్ ఎంచుకున్న భారత జట్టు ఆరంభంలో ఆస్ట్రేలియాను ఒత్తిడిలోకి నెట్టింది. అర్ష్‌దీప్ సింగ్ (335) విజృంభణతో మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును టిమ్ డేవిడ్(74), మార్కస్ స్టోయినిస్(64) అర్ధ శతకాలతో ఆదుకున్నారు. టాపార్డర్ విఫలమైనా జట్టుకు భారీ స్కోర్ అందించే బాధ్యత తీసుకున్న ఈ ఇద్దరూ పెద్ద షాట్లతో విరుచుకపడి స్కోర్ వంద దాటించారు. డేవిడ్ ఔటయ్యాక గేర్ మార్చిన స్టోయినిస్.. మాథ్యూ షార్ట్(26 నాటౌట్) దంచేశాడు. దాంతో.. కంగాఊ టీమ్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి186 పరుగులు చేసింది.



## సెంచరీ చేజార్చుకున్న పంత్

### అనధికారిక టెస్టులో భారత 'ఏ' జట్టు భారీ విజయం!



తొలి అనధికారిక టెస్టులో భారత 'ఏ' జట్టు జయభేరి మోగించింది. పునరాగమనం మ్యాచలో చెలరేగిన రిషభ్ పంత్ (90) దక్షిణాఫ్రికా 'ఏ' బౌలర్లను ఉతికేసిన సెంచరీ చేజార్చుకున్నా జట్టు విజయంలో కీలకమయ్యాడు. పంత్ వెనుదిరిగాక మానవ్ సుతార్(20 నాటౌట్), అన్షుల్ కంభోజ్(37 నాటౌట్)లు పట్టుదలగా ఆడి జట్టుకు 3 వికెట్ల విజయాన్ని అందించారు. సూపర్ విక్టరీతో రెండు టెస్టుల సిరీస్‌లో భారత్ 1–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.బెంగళూరులోని సీఈవో మైదానంలో భారత ఏ జట్టు గొప్పగా పుంజుకొని దక్షిణాఫ్రికా ఏకు చెక్ పెట్టింది. తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైన కెప్టెన్ రిషభ్ పంత్(90) .. రెండో ఇన్నింగ్స్‌లో మెరుపు హాఫ్ సెంచరీతో చెలరేగాడు. దక్షిణాఫ్రికా బౌలర్లకు చుక్కలు చూపించిన పంత్ తన సూపర్ ఫిఫ్టీతో లక్ష్యాన్ని కరిగించాడు. చివరి రోజు 156 పరుగులు అవసరమైన వేళ సెంచరీ చేజార్చుకున్నాడు. ఆయుష్ బదొని (34) ఉన్నంత సేపు దూకుడుగా ఆడాడు. ఆ తర్వాత మానవ్ సుతార్(20 నాటౌట్), అన్షుల్ కంభోజ్(37 నాటౌట్)లు మరో వికెట్ పడకుండా జట్టును గెలిపించారు. రెండు ఇన్నింగ్స్‌లో కలిపి 8 వికెట్లు తీసిన తనుష్ కొతియాన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. రెండో అనధికారిక టెస్టు నవంబర్ 6న జరుగనుంది.

### 32కే మూడు వికెట్లు

తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగుల ఆధిక్యాన్ని సమర్పించుకున్న టీమిండియా.. మూడో రోజు ప్రత్యర్థిని కుప్పలకూల్చింది. ఓవర్‌నైట్ స్కోర్ 30/0తో ఇన్నింగ్ ఆరంభించిన దక్షిణాఫ్రికా ఏ జట్టుకు తనుష్ కొతియాన్ (4–26), అన్షుల్ కంభోజ్(3–39)లు షాకిచ్చారు. వీరిద్దరూ హడలెత్తించగా 199కే కుప్పకూలింది. ఓపెన్ లెసెగో సెనొక్వెనె(37), జుబయిర్ హంజా(37)లు టాప్ స్కోరర్లు. కాసేపటికి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత జట్టు 32కే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రిషభ్ పంత్(90) తనదైన స్టయిల్లో రెచ్చిపోయి జట్టు విజయానికి బాటలు వేశాడు.

తొలి ఇన్నింగ్స్‌లో తనుష్ కొతియాన్(4–83), గుర్నూర్ బ్రార్(2–45)ల విజృంభణతో సఫారీ టీమ్ 309కి ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు సాయి సుదర్శన్(32), ఆయుశ్ మాత్రే(65)లు శుభారంభం ఇచ్చినా మిగతావాళ్లు స్వదినియోగం చేసుకోలేకపోయారు. పేసర్లను దీటుగా ఎదుర్కొన్న ఓపెనర్లు తొలి వికెట్‌కు 91 రన్స్ జోడించారు. కానీ, సఫారీ స్పిన్నర్ సుబ్రయేన్(5–61) కీలక వికెట్లు తీసి దెబ్బకొట్టాడు. గాయం నుంచి కోలుకొని కెప్టెన్‌గా ఆడుతున్న రిషభ్ పంత్(17) స్వల్ప స్కోర్‌కే సెలే ఓవర్లో ఔటయ్యాడు. ఆ తర్వాత ఆయుశ్ బదొని(38).. తనుష్ కొతియాన్(13)లు కుదురుకున్నా పెద్ద స్కోర్ చేయలేకపోయారు. దాంతో.. 234కే టీమిండియా ఆలౌటయ్యింది.

# ఆరోగ్యం

## ఫోకస్




## ఎలక్ట్రోమాగ్నెటిక్ తరంగాలు!

ఇటీవలైన నిర్వహించిన శాస్త్రీయ పరిశోధనలు మెదడుకు సంబంధించిన కొత్త కోణాన్ని వెలుగులోకి తెచ్చాయి. ఆ పరిశోధనల నివేదికను ప్రకారం, మన మస్తిష్కం అత్యంత తక్కువ శక్తిగల ఎలక్ట్రోమాగ్నెటిక్ (అత్యల్ప తరంగదైర్ఘ్య) తరంగాలు విడుదల చేస్తుంది. ఇవి సుమారు 1 నుండి 30 హెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ రేంజ్‌లో ఉంటాయి. ఈ తరంగాలు మన న్యూరాన్లు ఫైర్ అవుతున్నప్పుడు ఏర్పడతాయి. తక్కువ ఫ్రీక్వెన్సీ గల ఈ అల్ట్రా తరంగాలు మన తలపై నుంచి బయటకు వెళ్లి పర్యావరణంలో ఉన్న ఎలక్ట్రోమెగ్నెటిక్ తరంగాలను కలుస్తాయి. కొంత మంది వ్యక్తులతో ఈ తరంగాల నమూనాలు సరిగ్గా సరిపోతాయి. అంటే మెదడు సారూప్య తరంగాలతో అనుసంధానం అవుతాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీనివల్ల మనలో ఒకరి పట్ల మరొకరికి ఆసక్తి లేదా సత్సంబంధాలు ఏర్పడతాయి. లేదా అకారణ విరోధం కూడా రావచ్చు. అందుకే, పాఠశాలల్లో, కళాశాలల్లో, కార్యాలయాల్లో లేదా కొత్తగా ఇల్లు మారినప్పుడు పరిసర ప్రాంతాల్లో కొంతమంది ఒకే సమయంలో పరిచయమైనప్పటికీ, ఒకొక్కరితో ఒక్కో రకంగా వ్యవహరిస్తాం. అందరితోనూ అదే సాన్నిహిత్యం లేదా ముభావం ఉండదు. ఈ ఎంపికకు మెదడు పంపిస్తున్న ఎలక్ట్రోమాగ్నెటిక్ తరంగాల నమూనాలు కలవడం లేదా కలవకపోవడమే కారణమన్నది శాస్త్రవేత్తల అభిప్రాయం. అయితే, ఈ పరిశోధన ప్రస్తుతానికి ప్రారంభ దశలో ఉంది. మెదడు నుంచి ఈ విధంగా తరలంగాలను మరో చోటకు పంపడం (దీనినే కొంత మంది టెలిపతీగా పేర్కొంటారు), ప్రత్యక్షంగా సందేశాలు పంపడం అనేవి ఇంకా పూర్తి స్థాయిలో నిరూపించబడలేదు.మన మస్తిష్క తరంగాలు ద్వారా ఒకరికొకరు ప్రభావితం కావడంతో కొత్త న్యూరోసైన్స్, మానసిక ఆరోగ్యం, భవిష్యత్తులో మాటలు, రాత వంటి అంశాలకు మాత్రమే పరిమితం కాకుండా, మరింత అత్యాధునిక కమ్యూనికేషన్ విధానాలు వచ్చే అవకాశం ఉంటుందని పరిశోధకులు భావిస్తున్నారు. కానీ, ఇంకా నిరూపణ కాలేదు.

## శ్వాసపై ధ్యాస అవసరం!



మనం ఊపిరి పీల్చే విధానం తక్షణమే మన మనసును, శరీరాన్ని మార్చగలదు. తాజా అధ్యయనాల ప్రకారం, మనం ఊపిరి పీల్చే సరళి మన మానసిక, శారీరక స్థితిపై బలమైన ప్రభావం చూపుతుంది. ఊపిరి పీల్చుకున్న తర్వాత, కొద్దిసేపు శ్వాసను బిగించి, నెమ్మదిగా విడిచిపెడితే మానసిక ప్రశాంతత సాధ్యమవుతుంది. దీని వల్ల నాడీ వ్యవస్థలోని 'పారాసింపాథెటిక్ నర్వస్ సిస్టమ్' ప్రభావితం అవుతుంది. మన శరీరాన్ని ప్రశాంతంగా, సంతులితంగా, శక్తిని తిరిగి పొందేలా మారుస్తుంది. త్వరితంగా లేదా లోతుగా ఊపిరి పీల్చడం కారణంగా ఒత్తిడి, ఉద్వేగం పెరుగుతుంది. కానీ, ఈ సాధారణ శ్వాస పద్ధతితో, మన హృదయ స్పందన తగ్గుతుంది, వెతులాట, అదే విధంగా మానసిక ఉత్సాహం, ఏకాగ్రత మెరుగుపడతాయి. క్రీడాకారులు, కళాకారులు, ధ్యాన సాధకులు చాలాకాలంగా ఈ శ్వాస నియంత్రణ ద్వారా ఫలితాలు, భావోద్వేగ నియంత్రణ పొందుతున్నారని గుర్తించారు. సులభమైన సాధన మనం కేవలం కొన్ని నిమిషాలు పైలా ఊపిరి బయటకు వదిలే కాలాన్ని పెంచితే, ఒత్తిడిగిన స్థితి నుంచి ప్రశాంతంగా ఉండే స్థితిలోకి మారవచ్చు. దీనిని అభ్యాసం చేయడానికి ప్రత్యేక పరికరాలు అవసరం లేదు. మనలోనే ఉన్న సాధనం ఇది. ప్రతి రోజు ఉదయాన కొన్ని నెమ్మదిగా, ఆలోచనతో ఊపిరి పీల్చడం అలవర్చుకోవడం ద్వారా మన నాడీ వ్యవస్థ ప్రశాంతంగా ఉంటుంది. దీని వల్ల ఏకాగ్రత, స్థైర్యం, శరీరమనస్సు ఆరోగ్యం మెరుగవుతుంది. పారాసింపతటిక్ నాడీ వ్యవస్థఈ చిన్న మార్పు మన ఆంతరిక శాంతికి, ఆరోగ్యానికి మార్గం తెరుస్తుంది. మంచి ఆరోగ్యం, ఏకాగ్రత కోసం ఉదయం మొదలు మన ఊపిరి పద్ధతిని గమనించడం చాలా మంచిది.

## ఒత్తిడి మంచిదే..



మనలో చాలా మంది ఒత్తిడి అనేది ఎల్లప్పుడూ హానికరమని భావిస్తారు. కానీ నిజం ఏమిటంటే, మెదడు పదునుగా ఉండాలంటే మస్తిష్కానికి కొంతమేర ఒత్తిడి అవసరం. అప్పుడప్పుడు వచ్చే తేలికపాటి, నియంత్రిత ఒత్తిడి 'యూస్ట్రెస్' (Eustress) అవసరమని నిపుణులు అంటున్నారు. తాజా అధ్యయనాలను అనుసరించి, ఈ 'యూస్ట్రెస్' వల్ల కొన్ని సవాళ్లకు మెదడు అలవాటు పడుతుంది. కొత్త విషయాలు నేర్చుకుంటుంది. జీవితం చాలా సులభంగా లేదా సవాళ్ల లేనిదిగా మారితే, జ్ఞాపక శక్తి, ఏకాగ్రత, సమస్య పరిష్కారం వంటి సామర్థ్యాలు క్రమంగా తగ్గిపోవచ్చు. గుణాత్మక ఒత్తిడి మెదడులో న్యూరోప్లాస్టిసిటీని ఉత్తేజపరుస్తుంది. అంటే తన నాడీ సంబంధాలను పునర్నిర్మించే, బలపరచే సామర్థ్యం పెరుగుతుంది. మన కంఫర్ట్ జోన్‌కి భిన్నమైన పనులు చేరుతాయి. కొత్త నైపుణ్యాన్ని నేర్చుకోవడం, క్లిష్ట సమస్యలను పరిష్కరించడం, కొత్త బాధ్యతలు స్వీకరించడం, లేదా అర్థవంతమైన లక్ష్యాల వైపు కృషి చేయడం వంటి లక్షణాలు అలవడతాయి. డోపమైన్, నోరీఫైన్ ఫ్రైన్ వంటి న్యూరోట్రాన్స్‌మిటర్ల విడుదలకు దారితీస్తాయి. ఇవి జాగ్రత్త, ప్రేరణ, మానసిక సహనాన్ని పెంచుతాయి. అయితే, ఆరోగ్యకరమైన ఒత్తిడికి దీర్ఘకాలిక, అధికమైన ఒత్తిడికి మధ్య తేడాను తెలుసుకోవడం ముఖ్యం. తాత్కాలిక ఒత్తిడి పనితీరును మరియు మెదడు వికాసాన్ని పెంచవచ్చు, కానీ నియంత్రణ లేకుండా దీర్ఘకాలం కొనసాగే ఒత్తిడి హిపోకాంపస్ వంటి ప్రాంతాలను క్షీణింపజేసి, భావోద్వేగ నియంత్రణను దెబ్బతీస్తుంది. అందుకే, సరైన సమతుల్యత కనుగొనడం కీలకం. మానసికంగా ఉత్తేజపరిచే పనుల్లో పాల్గొనడం, సాధ్యమైన లక్ష్యాలను సెట్ చేయడం, తేలికపాటి సవాళ్లను స్వీకరించడం ద్వారా మన మెదడు సౌలభ్యాన్ని నిలబెట్టుకొని కాలక్రమేణా బలపడుతుంది. దీనికి విశ్రాంతి, మైండ్‌ఫుల్‌నెస్, స్వీయ సంరక్షణను కలిపి కొనసాగించడం వలన ఒత్తిడి మన అభివృద్ధి సాధనంగా ఉపయోగపడుతుంది.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## ఖమ్మం బహిరంగసభకు ఐదు వేల మంది సమీకరణ

### సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** డిసెంబర్ 26 న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వై .దామోదర్ రెడ్డి అన్నారు. ఆదివారం సిపిఐ భువనగిరి మండల, పట్టణ సమితిల సమావేశం మండల సహాయ కార్యదర్శి ఉడుత రాఘవులు అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మంలో జరిగే శత వసంతాల బహిరంగ సభకు జిల్లా నుండి 5000 మందిని సమీకరించాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు మాట్లాడుతూ వందేళ్ళ కాలంలో దేశంలో అనేక పార్టీలు పుట్టాయని పోయాయని కానీ సిపిఐ ఒక్కటే 29 రాష్ట్రాలలో మనుగడలో ఉందన్నారు. ప్రజలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా వారికి గుర్తుకు వచ్చేది ఎర్రజెండా అనే విషయాన్ని అందరూ గమనించాలన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి ఇమ్రాన్, సిపిఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, నాయకులు చొప్పరి సత్తయ్య, బబ్బూరి అంజమ్మ, మరిపెల్లి రాములు, బద్దం వెంకటరెడ్డి, షర్ఫుద్దీన్, కూరాకుల అబ్బులు, బింగి కృష్ణ, ఎదునూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

### ఎఐటియుసి ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్



**ప్రజాపక్షం/పెద్దపల్లి/మందమర్రి :** సింగరేణి కార్మికుల సమస్యలపై స్ట్రక్చర్ మీటింగ్‌లలో యాజమాన్యం అంగీకరించిన సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకైనా సిద్ధమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణిలో 2014నుండి 2023 వరకు కార్మికుల సమస్యలపై స్ట్రక్చర్ మీటింగులు జరగలేదని, రాజకీయ జోక్యం తోనే కార్మికులకు సంబంధించిన ప్రకటనలు చేసేవారన్నారు. 2023లో ఎఐటియుసి గుర్తింపు సంఘంగా గెలిచిన అనంతరం వివిధ స్థాయిల్లో జరిగిన స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో యూనియన్ పెట్టిన కార్మికుల సమస్యల్లో కొన్ని యాజమాన్యం పరిష్కరించినప్పటికినీ, అమలు పరచడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. కోల్ ఇండి యా మాదిరిగానే అలవెన్సులపై ఇన్కమ్ టాక్స్ యాజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేస్తే యాజమాన్యం లాభాల్లో వాటా కోల్ ఇండియాలో లేదు ఇక్కడ ఇస్తున్నామని ఇవ్వకుండా దాటవేత ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపించారు, యాజమాన్యం మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం రీజియన్ పరిధిలోని వికె కోల్ మైన్ మరియు జేకే ఎక్స్‌టెన్షన్ ఓసి లను పర్మనెంట్ ఉద్యోగుల తోనే నడపాలని, అదేవిధంగా మారుపేర్లతో ఉద్యోగాలు చేస్తున్న వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించి, విజిలెన్స్ ద్వారా విచారణ జరిపి పెండింగ్‌లో ఉన్న వారికీ ఉద్యోగావకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణిలో డిస్మిస్ ఐన ఉద్యోగులకు ఒకసారి మళ్లీ ఉద్యోగావకాశం కల్పించాలని, డిసిప్లినరీ చర్యల కోసం 150 మస్టర్లు చేయాలనే సర్క్యులర్‌ను యాజమాన్యం రద్దు చేయాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ పరీక్షను తక్షణమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. డిమాండ్‌ల సాధనకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల ఆరున అన్ని గనులు, డిపార్ట్మెంట్లలో మెమోరాండాలు, నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా ఎనిమిదిన జిఎం కార్యాలయాల ముందు ధర్నా నిర్వహిస్తామని, కార్మిక సమస్యల పరిష్కారం కోసం అన్ని సంఘాలను కలుపుకొని దశలవారీగా పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో ఎఐటియుసి కేంద్రఉపాధ్యక్షులు ఎల్.ప్రకాశ్, ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లాగౌడ్, వై.వి.రావు, జీగురు రవీందర్, రంగు శ్రీను, సంకె అశోక్, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న,ఏ.రవికుమార్, గొడిశల నరేశ్, అటికేటి రాజు, బి.శ్రీరాములు, కొప్పుల లింగయ్య, కొరిమి శ్రావణ్‌కుమార్, పెరుమాండ్ల రమేశ్ గౌడ్, ఎవిఎస్.ప్రకాశ్ ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రజాసంఘాల బలోపేతానికి కృషి

### సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య,

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఖమ్మంలో డిసెంబర్ 26న లక్షలాది మందితో సిపిఐ నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభ విజయవంతం చేయాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఐ రాజేంద్రనగర్ మండల కౌన్సిల్ సమావేశం స్థానిక ఎఆర్ దేవరాజ్ భవన్ సిపిఐ కార్యాలయంలో మండల కార్యదర్శి సిహెచ్ నర్సిరెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి పాలమాకుల జంగయ్య, మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు హాజరైనారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ మండలంలో ప్రజాసంఘాల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ఎక్కడైతే పోటీ చేయతలుచుకున్నామో అక్కడ పార్టీ అభ్యర్థులు గెలిచే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలని పార్టీ శ్రేణులను కోరారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, ఎంఎ రియాజ్, కన్యగారి లక్ష్మి, మండల సహాయ కార్యదర్శి ఎస్‌కె.షఫీ, రాజేంద్రనగర్ మండల కార్యాలయ కార్యదర్శి జి.సత్యం, చింతల్‌మెట్ కార్యదర్శి సయ్యద్ ఖాజా, మండల కౌన్సిల్ సభ్యులు ఎస్.గంగారాం, ఎం.రామచంద్రయ్య, నాగార్జున చారి, ఎర్రబోడ కార్యదర్శి పాండు, రేష్మ, మౌనిక, బండారి శాంతమ్మ, ఊర్మిళ, బుజ్జి,శాలిని,వాణి భవాని,ఎస్ కొండన్న,ఆంజనేయులు, ఖలీల్, ఎర్రబోడ కృష్ణ, మొగులయ్య, రాములమ్మ,తదితరులు పాల్గొన్నారు.




## నేరేడుచర్లకు 20న సిపిఐ ప్రచార జాత

### సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ (నేరేడుచర్ల) :** సిపిఐ శత వసంతాల వార్షికోత్సవాల బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న ప్రచార జాత సూర్యాపేట జిల్లాలో తొలుత నేరేడుచర్లలో ఈనెల 20న రానున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం నేరేడుచర్ల మండలం కేంద్రంలోని సిపిఐ కార్యాలయం ప్రజాభవన్‌లో పార్టీ శత వార్షికోత్సవాల కరపత్రాలను విడుదల చేసిన ఆనంతరం ఆయన మాట్లాడారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించి కార్మిక, కర్షక, మహిళ, విద్యార్థి, యువజన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య నిలబడి ప్రజల కొరకు పోరాటం చేస్తున్న పార్టీ సిపిఐ అన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు దూళిపాళ ధనుంజయ నాయుడు మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సిపిఐ ముందుకు కొనసాగుతుందన్నారు. ప్రజలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా వారికి గుర్తుకు వచ్చేది ఎర్రజెండా అనే విషయాన్ని అందరూ గమనించాలని అన్నారు. ఆకలి ఉన్నంత కాలం, పోరాటం ఉన్నంత కాలం కమ్యూనిస్టు పార్టీ సజీవంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను, బిసి హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమర్రాజు వెంకట్, శివ, హేమంత్ పాల్గొన్నారు.

## కార్పొరేట్ దిగ్గజాల అక్రమ సంపదను జాతీయం చేయాలి

### మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి సురేష్



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** దేశంలో కార్పొరేటు దిగ్గజాల అక్రమ సంపాదనను కేంద్ర ప్రభుత్వం జాతీయం చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. ఎఐటియుసివ్యవస్థాపక వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల మైదానంలో ఎఐటియుసి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ పాలనలో దేశ సంపాదన సృష్టించే కష్టజీవులకు ఆకలి కన్నీళ్లు మిగిలాయన్నారు. నాయా దేశభక్తి పేరుతో ప్రజలను వంచిస్తూ దేశ సంపదను కార్పొరేట్ దిగ్గజాలకు అప్పజెప్పుతో ఆర్థిక నేరగాలకు కేంద్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తూ దేశ ఆర్థిక రంగాన్ని దివాలా తీయిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కాంట్రాక్టు ఉద్యోగులందరికీ క్రమబద్ధీకరించాలని కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాయిప్రకాష్, రవికుమార్, రామకృష్ణ, నరేష్, చిట్టెమ్మ, భీమమ్మ, ఉషారాణి, అనసూయ, లక్ష్మి, మంజుల, భాగ్యలక్ష్మి , మాధవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## పత్తికి క్వింటాకు రూ.పదివేలు

### సిపిఐ అదిలాబాద్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/అదిలాబాద్/నిర్మల్ :** పత్తికి క్వింటాకు పదివేల రూపాయలు ఇవ్వాలని సిపిఐ అదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇతర పంటలకు ఎనిమిది వేల రూపాయలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం పంటల కొనుగోలు బాధ్యత తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలోని తలమడుగు మండలంలోని మాసభపల్లి గ్రామంలో జరిగిన సిపిఐ సభకు హాజరైన ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. రైతు సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రైతు సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం కేవలం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్టబెట్టడానికి పని చేస్తుందని ఆయన ఆరోపించారు. ఉపాధి అవకాశాలు కల్పించకుండా దేశంలో యువతను నిర్వీర్యం చేస్తుందన్నారు. శ్రామికుల రాజ్యం రావాలంటే పేద ప్రజలందరూ కులమత భేదాలను విడిచిపెట్టి ఏకం కావాల్సిన ఆవశ్యకత ఉందని ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తామని మోదీ చెప్పిన హామీ నెరవేర్చలేదన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు ధరలు తగ్గిస్తాం ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తాం లాంటి ప్రజాకర్షక నినాదాలతో అధికారంలోకి వచ్చిన బిజెపి అవేమీ అమలు చేయడం లేదని దేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలు భావోద్వేగాలు రెచ్చగొడుతూ వరుసగా అధికారం నిలబెట్టుకుంటుందని విమర్శించారు. 42 శాతం బిసిలకు, ఆదివాసీల పోడు భూములకు బిజెపి అడ్డుకట్ట వేస్తోందని ఆరోపించారు. యూపీఏ 1 ప్రభుత్వంలో చారిత్రాత్మక సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ పథకం అటవీ హక్కుల చట్టం తీసుకురావడానికి సిపిఐ కృషిచేసిందని తెలిపారు. అటవీ హక్కుల చట్టం ద్వారా దేశంలో గిరిజన బలహీన వర్గాలకు చెందిన 50 లక్షలకు పైగా కుటుంబాలు కోటి ఎకరాల భూమిపై హక్కు పొందేందుకు సిపిఐ పోరాటం చేసిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలను పరిపూర్ణంగా అమలు చేయాలని కోరారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా పేదలపక్షాన పోరాటం చేస్తామన్నారు. కమ్యూనిస్టు పార్టీ మరింత బలపడటానికి పార్టీ శ్రేణులు కృషిచేయాలన్నారు. సిపిఐ శత వసంతాల సందర్భంగా ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు జిల్లా నుండి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పెందూరు మాధవ్ సిపిఐ జెండా ఎగురవేశారు. కుంటాల రాములు, షేక్ పాషా, మహబూబ్ ఖాన్, కంలే రాందాస్, ఖండాల గణేష్, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం పలికిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కె.లక్ష్మ ణ్ కు అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్ ఆదివారం స్వాగతం పలికారు.పట్టణంలోని అటవీ వసతి గృహంలో అదనపు కలెక్టర్,న్యాయమూర్తికి పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు.న్యాయమూర్తికి స్వాగతం పలికిన వారిలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి,ఎ.ఎస్పిరాజేష్ మీనా, ఆర్‌డిఒ రత్న కళ్యాణి,ఇతర అధికారులు,తదితరులు ఉన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

శ్రీరాంపూర్ ఎస్ఐ మేకల సంతోష్



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:**రహదారి ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతతో రోడ్డు భద్రత నియమాలు పాటించాలని శ్రీరాంపూర్ ఎస్ఐ మేకల సంతోష్ అన్నారు. ఆదివారం ఏరియాలోని పాత గ్రామపంచాయతీ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సంబంధిత ధ్రువపత్రాలు డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలన్నారు. అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాలను నడుపుతూ ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దన్నారు. మూలమలుపుల వద్ద పాఠశాలల ప్రాంతాలలో నెమ్మదిగా వెళ్లాలన్నారు. ఎట్టి పరిస్థితులలో సెల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలను నడపరాదని హెచ్చరించారు. అలాగే మైనర్లకు వాహనాలను ఇవ్వకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఎస్ఐ మున్వర్, సిహెచ్ సత్యనారాయణ, శశాంక్, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/తాండూర్:**బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో తాండూర్ మండలం రేపల్లె వాడ గ్రామంలో ఉన్న మహేశ్వరి జిన్నింగ్ మిల్లులో సోమవారం సిసిఐ ద్వారా పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ కమిటీ మార్కెట్ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, రైతులు తమ పంటను అమ్మదలుచుకుంటే సిసిఐ నిబంధనల ప్రకారం కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుక్ చేసుకొని కేంద్రానికి రావాలని ఆయన కోరారు.

## దొంగను పట్టుకున్న పోలీసులు

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:**శ్రీరాంపూర్ ప్రాంతంలోని సి టైపు క్వార్టర్స్‌లో రెండు రోజుల క్రితం శుక్రవారం ఒక గుర్తు తెలియని దొంగ మహిళపై దాడికి పాల్పడి కలకలం సృష్టించాడు. సదరు మహిళ ఫిర్యాదు మేరకు శ్రీరాంపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని, విచారణ చేపట్టి శనివారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మహిళ తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం మధ్యాహ్నం నిందితుడు నెట్వర్క్ (డిష్) రిపేర్ చేస్తానంటూ వచ్చి, ఆమె మెడలోని గొలుసులు అపహరించేందుకు ప్రయత్నించాడు. భయంతో ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడంతో నిందితుడు పారిపోయాడని తెలిపారు. ప్రజలు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులు కనిపిస్తే 100 డయల్ పోలీసులకు సమాచారం అందివ్వాలని ఎస్ఐ మేకల సంతోష్ సూచించారు.

## సరిహద్దు గ్రామాల్లో రేషన్ బియ్యం దందా

మహారాష్ట్రకు అక్రమ రవాణా.. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

**ప్రజాపక్షం/సిర్పూర్ టి:**తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా మళ్లీ చెలరేగింది. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సరిహద్దు గ్రామాలు సిర్పూర్ టి మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి ప్రభుత్వ రేషన్ బియ్యం రహస్యంగా మహారాష్ట్ర గ్రామాలకు తరలిపోతోందని సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, రేషన్ షాపుల్లో తక్కువ ధరకు అందిస్తున్న బియ్యం కొంతమంది మధ్యవర్తులు కొని ఐచర్ వ్యాన్, బొలెరో ఆటోలు, ద్విచక్ర వాహనాల ద్వారా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఈ అక్రమ దందా వెనుక కొంతమంది వ్యాపారులు, మధ్యవర్తులు రేషన్ డీలర్లు ఉన్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రతి నెల రేషన్ పంపిణీ సమయంలో సరఫరా తక్కువగా వస్తుండటంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వల్ల ఈ దందా కొనసాగుతుందని గ్రామస్థులు ఆరోపించారు. ఈ పరిస్థితిని అరికట్టేందుకు అధికార యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/నర్సాపూర్:**నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డులో ఉన్న ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రెండవ వార్డు మాజీ కౌన్సిలర్ లతా రమేష్ యాదవ్ మాట్లాడుతూ, పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రమాదకరంగా ఉందన్నారు. పాఠశాల నూతన భవనం మంజూరు కోసం ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోలేదన్నారు. అయితే డెక్కన్ రౌండ్ టేబుల్ ట్రస్ట్ ఇండియా 189 ముందుకు వచ్చి 50 లక్షల వ్యాయంతో పాఠశాల నూతన భవనం, మరుగుదొడ్ల నిర్మాణానికి ట్రస్ట్ చైర్మన్ ఆదిత్య కేడియ కుటుంబ సమేతంగా భూమి పూజ చేశారన్నారు. ఈ పాఠశాల భవనం మూడు నెలల్లో పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు అన్నారు. పాఠశాల భవనం నిర్మించేందుకు ముందుకు వచ్చిన రౌండ్ టేబుల్ ట్రస్ట్ ఇండియా 189 సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు లతా రమేష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్వీస్ పాల్గొన్నారు.

## జుక్కల్ నియోజకవర్గంలో పూర్తికాని రోడ్డు పనులు

ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు

**ప్రజాపక్షం/పిట్లం:** జుక్కల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో రోడ్లు అధ్వాన్నంగా మారాయిని లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ కాట్రోత్ రవీంధర్‌నాయక్ పేర్కొన్నారు. పిట్లం మండలకేంద్రంతో పాటు మండలకేంద్రం నుండి మద్దెల్‌చెర్వు వరకు రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని వాపోతున్నారు. నూతనంగా వేస్తున్న రోడ్లకు నీళ్ళు చల్లకపోవడంతో వాహనదారుల రాకపోకల సమయంలో దుమ్ము లేచి ఇబ్బందకరంగా తయారైందని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం మారి 3 సంవత్సరాలు కావస్తున్నా ఇంకా రోడ్లు పూర్తికాకపోవడం విచారకరమని, వెంటనే రోడ్ల పనులు ప్రారంభించి పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్డుపై వెళ్తున్న వారి పాలిట శాపంగా మారిందని రవీంధర్‌నాయక్ పేర్కొన్నారు.

# తడిసి ముద్దయిన ధాన్యం



**ప్రజాపక్షం/ఎడపల్లి:**ఆదివారం సాయంత్రం ఎడపల్లి మండలంలో కురిసిన అకాల వర్షానికి రైతులు ఆరబెట్టిన వేలాది క్వింటాళ్ల ధాన్యం మళ్లీ తడిసి ముద్దైంది. దాదాపు గంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షం కారణంగా, కోసి రోడ్లపై, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం మొత్తం నీటిలో కొట్టుకుపోయి నిరూపయోగంగా మారింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంటను వర్షం నుంచి కాపాడుకునేందుకు రైతులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఉదయం ఎండగా ఉండగా సాయంత్రం ఒక్కసారి వర్షం కురియడంతో రోడ్లపై, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం భారీ వర్షానికి పూర్తిగా తడిసి, అక్కడక్కడ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. ఎడపల్లి మండలంలో పలువురు రైతులకు చెందిన వరిధాన్యం గత వారం రోజులుగా కురిసిన వర్షానికి మొలకలు వచ్చాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పండించిన పంట అకాల వర్షాల వల్ల తడిసి నల్లగా మారడమే కాకుండా మొలకలు వచ్చాయని, ఆదివారం మళ్లీ కురిసిన వర్షానికి వర్షార్పణం అయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన పంట కళ్లముందే తడిసిపోవడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి, ధాన్యం కొనుగోలుకు గ్రేడింగ్ నిబంధనలు సడలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు యుద్ధ ప్రాతిపదికన సర్వే చేసి, నష్ట పరిహారం అందించాలని కోరుతున్నారు.

## దళారులను నమ్మిమోసపోవద్దు

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపు



**ప్రజాపక్షం/-నిజాంపేట్:**దళారులను నమ్మి రైతులు ఆరుకాలం కష్టించి పండించిన పంటను తక్కువ ధరలకు విక్రయించవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. నిజాంపేట మండలం కల్వకుంట గ్రామం లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 18,600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని, రైతులకు సహకరించాలని నిర్వాహకులకు ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే రైతులు నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటుందో..! తెలియడం లేదు కాబట్టి రైతులు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు.

## వీధి కుక్కల బీభత్సం..చిన్నారిపై దాడి!

పరిస్థితి విషమం-నిర్మల్ నుండి హైదరాబాద్ తరలింపు..



**ప్రజాపక్షం/నిర్మల్/సారంగాపూర్:**నిర్మల్ జిల్లా, సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి గ్రామంలో వీధి కుక్కలు మరోసారి భయానక వాతావరణాన్ని సృష్టించాయి.గ్రామానికి చెందిన సయ్యద్ సహాద్ అనే 1.5 సంవత్సరాల చిన్నారిపై వీధి కుక్కలు అ త్యంత దారుణంగా దాడి చేశాయి.చిన్నారి తన ఇం టి ఆవరణలో ఆడుకుంపటుండగా,కుక్కలు అకస్మాత్తుగా గుంపుగా వచ్చి దా డికి పాల్పడ్డాయి.ఈ దాడిలో చిన్నారి ముఖభాగం, తలపై తీవ్రమైన గాయాలయ్యా యి.దీంతో విపరీతమైన రక్తస్రావం జరిగింది.కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై చిన్నారిని చికిత్స నిమి త్తం నిర్మల్ ఆసుపత్రికి త రలించారు .అయితే,నిర్మల్ ఆసుపత్రిలోని వైద్యులు చి న్నారి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని,మెరుగైన వై ద్యం అవసరమని తెలిపారు.దీంతో కుటుంబ సభ్యు లు,ప్రాణాలు కాపాడుకునే ఆత్రుతతో,తక్షణమే చిన్నారిని హైదరాబాద్‌లోని ఒక ప్రధాన ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం చిన్నారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స మాచారం.ఈ దారుణ ఘటనపై గ్రామస్థులు తీవ్ర ఆవేదన,ఆగ్రహం వ్యక్తం చేశారు.గత కొంతకాలంగా తమ ప్రాంతంలో కుక్కల దాడులు రోజురోజుకి పెరుగుతున్నాయని,పిల్లలు, వృద్ధుల భద్రతపై ఆందోళన చెందుతున్నామని తెలిపా రు .ఈ విషయాన్ని స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని,తక్షణమే వీధి కుక్కల బెడదను నివారించడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.అత్యవసరంగా హైదరాబాద్‌కు తరలించడంతో చికిత్సకు భారీగా ఖర్చువుతున్న నేపథ్యంలో,చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు ఆర్థిక సాయం అందించాలని కుటుంబ సభ్యులు దయార్ద్ర హృదయులను,ప్రజలను వేడుకుంటున్నారు.

## 18.70 కోట్లతో సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధి

ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



**ప్రజా పక్షం/కాగజ్ నగర్:**కాగజ్‌నగర్ సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు అయ్యాయని శాసన సభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు అన్నారు. కాగజ్ నగర్ పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాగజ్ నగర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం యుఐడిఎఫ్ పథకం నుండి రూ.18.70 కోట్ల నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ నిధులతో పట్టణంలోని పలు కూడళ్లను వార్డులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. రహదారులు భవనాల శాఖ పరిధిలోని 55 కిలోమీటర్ల రహదారులను హైబ్రిడ్ అన్యుయిటీ మోడల్ (హెచ్‌ఎమ్) ఫేజ్ 1 కింద తీసుకున్నామని చెప్పారు. ఇందులో భాగంగా కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్–సిర్పూర్, సిర్పూర్–మాకిడి, కల్వాడ–ఒడ్డుగూడ వయా దహేగాం మార్గాల్లో డబుల్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే, పంచాయతీరాజ్ శాఖకు చెందిన 36 కిలోమీటర్ల రోడ్లను కూడా హెచ్‌ఎమ్ ఫేజ్ 1 కింద అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రహదారులు భవనాల శాఖకు చెందిన తలోడి, సలుగుపల్లి డబుల్ బిటి రోడ్డు కోసం 25 కోట్ల రూపాయల సెంట్రల్ రోడ్డు ఇన్ఫ్రాస్ట్రక్చర్ నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ విషయంలో చొరవ తీసుకున్న కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇటీవల ముఖ్యమంత్రికి పలు ప్రతిపాదనలు పెట్టానని, ఆ నిధులు కూడా మంజూరు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్ర చారి, పట్టణ అధ్యక్షులు ఆర్మీ శివ, మాజీ కౌన్సిలర్ బాల్క శ్యామ్, కుమార స్వామిపాల్గొన్నారు.

## నిధుల కొరతతో హరితహారానికి మోడు రూపం



ఎడపల్లి మండలంలో డివైడర్ మొక్కల నరికివేత

**ప్రజాపక్షం/ఎడపల్లి;**నిజామాబాద్‌బోధన్ ప్రధాన రహదారి వెంబడి ఎడపల్లి మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో రోడ్డు డివైడర్లలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కల నిర్వహణ గ్రామ పంచాయతీలకు పెను భారంగా మారింది. ఈ మొక్కలకు నిత్యం నీరు పోసి, అందంగా ఆహ్లాదకరంగా పెంచాల్సిన బాధ్యతను గ్రామ పంచాయతీలకు అప్పగించడంతో, నిధుల కొరత కారణంగా ఈ బాధ్యతను మోయలేక అధికారులు వాటిని నరికివేయిస్తున్నారు. రోడ్డు డివైడర్లలో పచ్చదనాన్ని కాపాడటానికి, రహదారులను ఆహ్లాదకరంగా ఉంచడానికి నాటిన మొక్కల నిర్వహణకు అవసరమైన నిధులు గ్రామ పంచాయతీలకు లేకపోవడంతో, పంచాయతీ అధికారులు విచిత్రమైన నిర్ణయం తీసుకుంటున్నారు. మొక్కలు పెరిగితే వాటికి నిత్యం నీరు పోయాల్సి వస్తుందని, ఇందుకు కూలీలకు చెల్లించడానికి డబ్బులు లేవని పేర్కొంటూ మొక్కు కొద్దిగా పెరగగానే వాటిని మొదళ్లకు నరికివేస్తున్నారు. చిగురించిన మొక్కలను సైతం కొంత పెరగగానే తిరిగి మొదళ్లకు నరికి మోడులుగా మారుస్తున్నారు. దీని వల్ల ఒకప్పుడు పచ్చదనంతో ఆహ్లాదంగా కనిపించిన రహదారులు, ప్రస్తుతం ఎండిపోయిన మోడులుగా మారిన మొక్కలతో అంద విహీనంగా తయారవుతున్నాయి. ఈ సందర్భంలోనే స్థానిక మండల ప్రజలు అధికారుల తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మొక్కలను నరకడానికి ఉపాధి కూలీలను ఉపయోగించుకుంటున్న అధికారులు, వాటికి నిత్యం నీరు పోసి సంరక్షించడానికి కూడా ఉపాధి కూలీలను ఉపయోగించుకోవచ్చు..? కదా..? మొక్కల సంరక్షణ బాధ్యతను కూడా ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టవచ్చు కదా..? అని ప్రశ్నిస్తున్నారు. నిధుల కొరత నిజమైతే, పచ్చదనాన్ని కాపాడే విషయంలో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకుండా మొక్కలను నరికివేయడం పట్ల పర్యావరణ ప్రేమికులు, ప్రజల నుంచి విమర్శలు వెల్లువెతుతున్నాయి. మొక్కల నిర్వహణకు శాశ్వత నిధుల కేటాయింపు చేయలని, లేదంటే డివైడర్ ప్లాంటేషన్ బాధ్యతను ఆర్థికంగా బలంగా ఉన్న ఇతర శాఖలకు అప్పగించాలని ప్రజలు కోరుతున్నారు.

## భూభారతి దరఖాస్తుల స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలు

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ :**భూభారతి దరఖాస్తుల పరిష్కారం కోసం చేపట్టిన 10 రోజుల స్పెషల్ డ్రైవ్ చేపట్టడంతో సత్ఫలితాలు వచ్చాయని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారం పై జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూభారతి దరఖాస్తులు వేగవంతంగా పరిష్కరించడానికి జిల్లాలో 22 అక్టోబర్ నుండి 01 నవంబర్ వరకు, 10 రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. గడిచిన 10 రోజుల్లో, తాసిల్దార్ ల పరిధిలో 183, ఆర్డీవోల పరిధిలో 661 మరియు జిల్లా కలెక్టర్ స్వయంగా 168 ఫైల్స్ క్లియర్ చేసి జిల్లా మొత్తం లో 1012 దరఖాస్తులను శాశ్వతంగా పరిష్కరించడం జరిగిందని వివరించారు. ఇదే సమయంలో 1424 ఫైల్స్ తాసిల్దార్లు వాళ్ల పరిధిలో విచారణ పూర్తి చేసి ఆర్డిఓ లకు పంపడం జరిగిందని తెలిపారు. అదే విధంగా 76 ఫైలు ఆర్డివోలు అడిషనల్ కలెక్టర్కు మరియు 61 ఫైల్లు అడిషనల్ కలెక్టర్ నుండి కలెక్టర్కు వెళ్లడం జరిగిందన్నారు. మొత్తం జిల్లాలో ఈ 10 రోజుల వ్యవధి లో సుమారుగా 1012 దరఖాస్తులను శాశ్వతంగా పరిష్కరించడం, అదే విధంగా 1561 దరఖాస్తుల ను పై లెవెల్ కి పంపడం ద్వారా, స్పెషల్ డ్రైవ్ లో మొత్తం 2573 ఫైల్స్ వివిధ స్థాయిలలో క్లియర్ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, సమస్త రెవెన్యూ సిబ్బందిని అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో పెండింగ్లో ఉన్న దరఖాస్తులు అన్నింటిని సాధ్యమైనంత త్వరగా నిజాయితీగా, నిష్పక్షపాతంగా పరిష్కరించాలని రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు.

# 'మా బిడ్డ ప్రాణం తీశావు!'

టీచర్ నిర్లక్ష్యంపై వేణునగర్ గ్రామస్తుల ఆగ్రహావేశాలు..



**ప్రజాపక్షం/నిర్మల్/ఖానాపూర్:**భారీ వర్షంలో ఇందిరమ్మ గుంతలో మునిగి ఐదేళ్ల చిన్నారి మృతి.టీచర్‌ను తొలగించి,నష్టపరిహారం ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు,నిర్మల్ జిల్లా,పెంబి మండలం,వేణునగర్ గ్రామంలో గత శనివారం జరిగిన హృదయ విదారక ఘటన గ్రామాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది.అంగన్వాడీ టీచర్ నిర్లక్ష్యం కారణంగా ఐదేళ్ల పసి పాప ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం తవ్విన నీటి గుంతలో పడి ప్రాణాలు కోల్పోయింది.ఈ దుర్ఘటనతో చిన్నారి తల్లిదండ్రుల ఆవేదన,గ్రామస్తుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది.

**నిర్లక్ష్యం వెనుక ఉన్న ప్రశ్న ఒక్కటే..**

''శనివారం భారీ వర్షం కురుస్తున్నప్పుడు,పిల్లలను ఒంటరిగా ఇంటికి పంపాల్సిన అవసరం ఏం వచ్చింది..?పిల్లల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అంగాన్వాడీ టీచర్,వారిని తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించాల్సిన కనీస బాధ్యతను విస్మరించడం తీవ్ర నిర్లక్ష్యంగా తేలింది.అంగన్వాడీ టీచర్ స్థానికంగా ఉండి,పిల్లల భద్రతను పర్యవేక్షించక పోవడమే ఈ దుర్ఘటతనకు ప్రధాన కారణమని గ్రామస్తులు మండిపడుతున్నారు.అంతేకాకుండా,పాఠశాల సమీపంలోనే ప్రమాదకరంగా నీరు నిండిన గుంతలు ఉన్నప్పటికీ,వాటి గురించి అప్రమత్తం చేయకపోవడం టీచర్ వైఫల్యమే అని స్పష్టం చేశారు.గతంలో కూడా జిల్లాలో ఇలాంటి నిర్లక్ష్య సంఘటనలు జరిగినా,అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని గ్రామస్తులు ఆరోపించారు.


**కఠిన చర్యలు,పరిహారం డిమాండ్..**

చిన్నారి మృతి విషయం తెలుసుకుని సిడిపిఓ శ్రీలత వెంటనే వెణునగర్ గ్రామానికి చేరుకున్నారు.బాధిత కుటుంబాన్ని పరామర్శించి,సంఘటనపై వివరాలు సేకరించారు.పోలీసులు కూడా సంఘటనా స్థలానికి వచ్చి విచారణ చేపట్టారు.అంగన్వాడీ టీచర్ నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ ప్రాణాలు కోల్పోయిందని గ్రామస్తులు,బాధిత కుటుంబం లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదులో,బాధ్యతాయుతమైన పదవిలో ఉండి నిర్లక్ష్యం వహించిన ఆ అంగన్వాడీ టీచర్‌ను వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని,ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అంతేకాకుండా ,చిన్నారి మృతి చెందిన తల్లిదండ్రులకు నష్టపరిహారం అందించడంతో పాటు,కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కూడా ఇప్పించాలని వారు కోరారు.

**సిడిపిఒ శ్రీలత హామీ..**

ఈ సందర్భంగా ఇంచార్జ్ సిడిపిఓ శ్రీలత మీడియాతో మాట్లాడుతూ,''మీరు ఇచ్చిన ఫిర్యాదును జిల్లా అధికారులకు అందజేస్తానని,నిర్లక్ష్యం వహించి నిండు ప్రాణానికి కారణమైన అంగన్వాడీ టీచర్‌పైచర్యలు తీసుకునేందుకు రిపోర్ట్ చేస్తామని'' తెలిపారు.ఇకపై అంగన్వాడీ టీచర్లు విధిగా స్థానికంగా ఉండి విద్యార్థులను పర్యవేక్షించాలని,నాలుగు గంటల తర్వాత వారి తల్లిదండ్రులకు భద్రంగా అప్పగించాలని ఆమె స్పష్టం చేశారు.ఒక నిర్లక్ష్యపు చర్య ఒక నిండుపానాన్ని బలి తీసుకుంది.ఈ విషాదం అధికారులకు కనువిప్పు కలిగించి,పిల్లల భద్రతకు కఠినమైన ప్రమాణాలు అమలు చేస్తారో లేదో వేచి చూడాలి...

## రెచ్చిపోతున్న మొరం మాఫియా



**ప్రజాపక్షం/ఎడపల్లి:**యేళ్ల తరబడి ప్రకృతి సంపదగా నిలిచిన గుట్టలు, కొండలు రాత్రికి రాత్రే హరించుకుపోతున్నాయి. మొరం మాఫియా, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కనుసన్నల్లో గుట్టలు, కొండలను తవ్వేస్తున్నారు. అభివృద్ధి పనుల పేరిట ముసుగు కప్పి మొరం దందాకు దర్జాగా తెరలేపుతున్నారు. ప్రకృతి సంపద హరించుకుపోతున్నా.. ప్రశ్నించాల్సిన అధికారులు, అడ్డుకోవాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తుంది. గుట్టల మాయం వెనక రెవెన్యూ అధికారుల పాత్ర కీలకంగా మారింది. రెవెన్యూ అధికారుల కన్నుసన్నల్లోనే బహిరంగంగా గుట్టలను తవ్వేస్తున్నారు. పనిదినాలు, సెలవుదినాలు అనే తేడా లేకుండా మొరం తవ్వకాలు జరుపుతూ రవాణా చేస్తున్నారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్కాపూర్, గుండారం రెవెన్యూ పరిధిలోని ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామ శివారులో పెద్ద ఎత్తున మొరం దందా కొనసాగుతుంది. మొరం తరలింపు మాత్రం ఆదివారాల్లో నిషేదం. ఈ క్రమంలో గత ఆదివారాల్లో సైతం మొరం తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్, ఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, అయితే ఇదంతా సంబంధిత అధికారులు అండదండలతోనే కొనసాగుతుందని పలువురు పేర్కొంటున్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## నేడు ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం

ప్రజాపక్షం/గోదావరిఖని : రామగుండం మండలం ఎన్‌టిపిసి సాయిసేవా సమితి అవరణలో రేకూర్తి కంటి ఆస్పత్రి సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని వాసవి ఆధ్వర్యంలో ఈనెల 3న సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత కంటి ఆపరేషన్ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ జోన్ ఛైరపర్సన్ నార్ల ప్రసాద్, ఐ విజన్ కో ఆర్డినేటర్ కోదాటి ప్రవీణ్, అధ్యక్షులు కొమురవెల్లి సుధాకర్, కార్యదర్శి నట రాజ శేఖర్, కోశాధికారి కట్కూరి శ్రావణ్, క్లబ్ సర్వీస్ ఛైర్ పర్సన్ కొముర వెల్లి రాహుల్ తెలిపారు. ఈ శిబిరంలో కంటిచూపులో లోపాలున్న వారిని వైద్యులు పరీక్షించనున్నట్లు తెలిపారు. కంటి శస్త్రచికిత్స అవసరమైన వారిని గుర్తించి ఉచిత బస్సులో రేకూర్తి కంటి ఆస్పత్రికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేయించి కంటి అద్దాలు, మందులు, భోజన వసతి ఉచితంగా అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఈ శిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు ప్రతులను అందజేయాలని వారు కోరారు.

## పురుడు పోసిన 108 సిబ్బంది



ప్రజాపక్షం/రామగిరి : రామగిరి మండలం ఆదివారం బేగంపేట గ్రామానికి చెందిన గోవిందుల మౌనిక (28) మహిళకు పురిటి నొప్పులు ప్రారంభం రావడంతో కుటుంబ సభ్యులు 108 కి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అంబులెన్స్ సిబ్బంది ఇంటికి రాగనే మహిళకు పురిటి నొప్పులు తీవ్రతరం కావడంతో 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నిమ్మతి శ్రీనివాస్ చాకచక్యంగా వ్యవహరించి వారి ఇంటిలోనే డెలివరీ చేశారు ఈ మహిళ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది ప్రాథమిక చికిత్స అనంతరం తల్లి,బిడ్డలను తదుపరి చికిత్స కోసం పెద్దపల్లిలోని మాత శిశు ఆసుపత్రికి తీసుకెళ్లారు ప్రస్తుతం తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నారని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు సకాలంలో స్పందించిన 108 అంబులెన్స్ సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నిమ్మతి శ్రీనివాస్, పైలట్ మామిడి సంపత్ లకు మాతా శిశు ఆరోగ్య సిబ్బంది కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: మానసిక వేదనతో పురుగుల మంతు తాగి ఓ వ్యక్తి ఆత్మ హత్య చేసుకున్న సంఘటన జగదేవ్‌పూర్ మండలంలోని అంతాయిగూడ గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తిగుల్ల బాలయ్య(34) అనే వ్యక్తి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇతనికి 8 సంవత్సరాల క్రితం కళ్యాని అనే యువతితో వివాహం జరిగింది. అయితే వీరి దాంపత్యం జీవితం ఇప్పటి వరకు సాఫీగా జరిగుతున్నప్పటికీ వారికి సంతానం కలుగక పోవడంతో బాలయ్య గత కొంత కాలంగా తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో గత నెల 28న రాత్రి వేళలో మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు వారు పేర్కొన్నారు. సిద్దిపేటలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్సా పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రామగుండంలో పోలీసు నిషేధాజ్ఞలు కొనసాగింపు: సిపి



ప్రజాపక్షం/గోదావరిఖని : సాధారణ పౌరులు ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడగిస్తున్నట్లు రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజే, డ్రోన్‌లపై కూడ నిషేధాజ్ఞలు పొడగిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. అదేవిధంగా కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ కూడ అమలులో ఉంటుందన్నారు. ఏలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. ఈ విషయమై ముందస్తు అనుమతులు పొందాలన్నారు. బంద్‌ల పేరిటా వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురి చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకై నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్నివర్గాల ప్రజలు సహకారం అందించాలని సీపీ కోరారు.

## సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు



ప్రజాపక్షం/పాలకుర్తి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేలా చర్యలు తీసుకుంటామని రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ సతిమణి మనాలి ఠాకూర్ తెలిపారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించారు. ప్రతి గ్రామంలోని మహిళలు, వృద్ధులు, యువతీ, యువకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు చేసిన అభ్యర్థనలు, విజ్ఞప్తులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

## నామమాత్రంగా తోలి విడత ఉపాధి గ్రామసభలు



ప్రజాపక్షం/మల్లాపూర్ : నిరుపేద కుటుంబాలకు వంద రోజులు పనికల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనుల మొదటి విడత పనుల గ్రామ సభలు తూతూ మంత్రంగానే కొనసాగుతున్నాయి. ఉపాధి కూలీలకు పని కల్పించేందుకు గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజల సమక్షంలో పనులు గుర్తించాల్సిన అధికారులు గ్రామాల్లో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, తూతు మంత్రంగానే గ్రామ సభలు నిర్వహిస్తు చేతులు దులుపుకుంటున్నారని గ్రామాల్లో ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజలందరికీ తెలిసేలా పనులను గుర్తించాల్సిన అధికారులు కొంతమందితోనే సభలు ఏర్పాటు చేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉన్నత స్థాయి అధికారులు ఇలాంటి వాటిపై దృష్టి సారించాలని ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు. కాగా మొదటి విడత గ్రామ సభలలోనే ఇలా నిర్లక్ష్యం వ్యవహరిస్తే మిగతా గ్రామసభల్లో ప్రజలకు తెలియకుండానే పనులను గుర్తిస్తారా అంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు గ్రామాల ప్రజలు. కొన్ని గ్రామాల్లోనే గ్రామసభలు తు తూ మంత్రంగా జరుగగా మిగతా గ్రామాల్లో జరిగే గ్రామ సభల్లో ప్రజలందరికీ సమాచారం అందిస్తారో లేదో చూడాలి మరి.

# పత్తి కొనుగోలులో నిబంధనలు సడలించాలి

**కపాస్ యాప్‌తో ఇబ్బందుల్లో రైతులు**
**సిపిఐ నాయకుడు బట్టు దయానందరెడ్డి డిమాండ్**



ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: పత్తి కొనుగోలు కేంద్రాలలో నిబంధనలు సడలించి సరళీకృత విధానంలో రైతులు పత్తిని విక్రయించుకునే విధంగా భారత కాటన్ కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యులు బట్టు దయానందరెడ్డి డిమాండ్ జేశారు. ఆదివారం ఆయన జగదేవ్‌పూర్‌లో పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఈ సారి అధిక వర్షాల మూలంగా పత్తి దిగుబడులు తగ్గి ఆర్థిక ఆబ్బందుల్లో ఉన్న రైతులను ఆదుకునే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. అధిక వర్షాలతో పత్తిల్తో తేమ శాతం అధికంగా ఉందన్న నేపంతో సిపిఐ కేంద్రాలలో అనేక అంక్షలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నందున రైతులు ఆందోళనకు గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. అంతేగాకుండా రైతుల్లో అధిక శాతం నిరక్ష్యరాస్యులే ఉన్నందున సి పిఐ ఈ సారి ప్రవేశ పెట్టిన కపాస్ యాఫ్ ద్వారా పత్తిని అ మ్ముకునేందుకు ముందుగానే స్లాట్ రిజిస్టార్ చేసుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విధానంతో రైతులు ఇబ్బందులకు గురవుతూ మద్య దళారులకే పత్తి విక్రయించుకునే పరిస్థితి వచ్చిందని దింతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. పాత పద్దతిలోనే సిపిఐ కొనుగోలు కేంద్రాలలో పత్తిని విక్రయించుకొనే విధంగా చోరవ చుపాలని డిమాండ్ జేశారు. రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సిపిఐ పార్టీ రైతులకు అండగా ఉంటూ వారి పక్షాన నిబంధనలకు వ్యతిరేకంగా వివిధ పద్దతుల్లో తమ పార్టీ నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ జగదేవ్‌పూర్ మండల కార్యదర్శి తొందురు నర్సింహారెడ్డి, గ్రామ కార్యదర్శి బిక్షపతి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో ఫార్మర్ ప్రొడ్యూసర్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వరి కొనుగోలు కేంద్రాన్ని సంస్థ చైర్మన్ కుంభాల రాజారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఎల్లాల వెంకటరెడ్డి తో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వ్యాపారస్తులుగా ఎదిగేందుకు ఫార్మర్ ప్రొడ్యూసర్ సంస్థ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మర్ ప్రొడ్యూసర్ సంస్థ డైరెక్టర్ మోర్తాటి చిన్న గంగారెడ్డి, మాజీ సర్పంచ్ దొంతుల శ్యామల తుకారం, మాజీ ఎంపిటిసి పోన్‌కంటి వెంకట్, ఏఎంసి డైరెక్టర్ బొల్లవేనా శంకర్, వి డి సి చైర్మన్ బాయి లింగారెడ్డి,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దూదిగాం గంగాధర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంథనిలో గోదావరి మహా హారతి



ప్రజాపక్షం/గోదావరిఖని : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మంథనిలో సోమవారం సాయంత్రం నిర్వహించనున్న గోదావరి మహా హారతి వేదిక స్థలాన్ని ఆదివారం పరిశీలించినట్లు గోదావరి మహా హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి క్యాతం వెంకటరమణ తెలిపారు. గోదావరినది ఒడ్డున ఉన్న గౌతమేశ్వరస్వామి దేవాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టనున్నట్లు తెలిపారు. మంథని ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదావరి మాత ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. కార్తీక దీపరాధన వల్ల కుటుంబంలో శాంతి సౌభాగ్యాలు విలసిల్లుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజమౌళి, శ్రీనివాసగుప్తా, సబ్బ సత్యనారాయణ, నాంపల్లి రమేష్, నారమల్ల కృష్ణ, కుమ్మరి మల్లిక్‌లు పాల్గొన్నారు.

## పెండింగ్ బకాయిల చెల్లింపులు వేగవంతం చేయాలి

**తెలంగాణ ఎస్‌టియు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య**



ప్రజాపక్షం/పెద్దపల్లి: పెండింగ్ బకాయిలు చెల్లింపులు వేగవంతం చేయాలని తెలంగాణ ఎస్ టి యు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రోజున పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో ని ఐఎంఎ భవన్లో ఎస్.టి.యు పెద్దపెల్లి జిల్లా శాఖ అధ్యక్షులు మేరుగు సతీష్ అధ్యక్షతన జరిగిన ఎస్‌టియు పెద్దపల్లి జిల్లా కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు వేగవంతంగా మంజూరు చేయాలని, సంఘాల ప్రాతినిధ్యం మేరకు ప్రతి నెలా 700 కోట్ల బకాయిలు చెల్లించడం సంతోషకరమైనప్పటికీ బకాయిలు పెద్ద మొత్తంలో ఉండడంతో ఈ చెల్లింపులు ఎవరికీ సరిపోవడం లేదని కాబట్టి ప్రతినెల కనీసం 2000 కోట్ల రూపాయలు బకాయిల చెల్లింపులకు విడుదల చేయాలని కోరారు. రిటైర్ అయిన ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారి బకాయిలను వెంటనే క్లియర్ చేయాలని అన్నారు. డి ఏ బకాయిలు సిపిఎస్ ఉపాధ్యాయులకు వాయిదాల రూపంలో చెల్లించడం సరికాదని అన్నారు. కౌన్సిల్ సమావేశం అనంతరం పెద్దపెల్లి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికలలో ఎస్ టి యు పెద్దపల్లి జిల్లా శాఖ నూతన అధ్యక్షులుగా నడిపెల్లి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మేరుగు సతీష్, ఆర్థిక కార్యదర్శిగా జి మాధవాచారి, రాష్ట్ర కమిటీ సభ్యులుగా మండల శ్రీకాంత్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా బోగె చంద్రశేఖర్, సయ్యద్ ఫయాజుద్దీన్, ఉపాధ్యక్షులుగా శేషాద్రి, అడిషనల్ జనరల్ సెక్రటరీలుగా తోటరాజు, కిన్నెర శ్రీనివాస్, కార్యదర్శులుగా బడుగు నగేష్, కె.శ్రవణ్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందనీ,ఎన్నికల అధికారిగా ఎస్టీయూ సిరిసిల్ల అధ్యక్షులు మొగిలి లక్ష్మణ్ వ్యవహరించగా, ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి సాన కిషన్ హాజరు కావడం జరిగిందని, నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఎస్ టి యు వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉపాధ్యాయులు అభినందనలు తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గాగిరెడ్డిపల్లెలో తెగిపోయిన కట్టుకాలువ

**25 ఎకరాల్లో కొట్టుకుపోయిన వరి పంట**
**సర్వే చేసి పరిహారమివ్వాలని రైతులు వేడుకోలు**



ప్రజాపక్షం/చిగురుమామిడి: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామంలో కురిసిన భారీ వర్షం రైతులకు కన్నీరు మిగిల్చింది. గాగిరెడ్డిపల్లె సంగోజిపేట చెరువు మత్తడి ప్రవాహం ఊహించని విధంగా పెరగడంతో చెరువు కింద ఉన్న వరద ఉధృతికి కట్టు కాలువ మొత్తం తెగిపోయింది. ఒక్కసారిగా వరద ప్రవాహం పెరగడం మూలంగా 25 ఎకరాల్లో భారీ నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుదగోని మధుసూదన్, బత్తిని రాజయ్య, మల్యాల శ్రీనివాస్‌కు చెందిన వ్యవసాయ బావులు సైతం ఈవరద ప్రవాహానికి కూలిపోవడంతో రైతులు లబోదిబో మంటున్నారు. సుదగోని వీరస్వామి, మెరుగు వెంకటేశం, సుదగోని మధుసూదన్, మెరుగు అంజయ్య, మల్యాల శ్రీనివాస్, మల్యాల బిక్షపతి, బత్తిని స్వామి, గుడికందుల శ్రీనివాస్, మెరుగు సాంబయ్య, బత్తిని పర్శరాములులకు చెందిన దాదాపు 25 ఎకరాల్లో పంట వరద దాటికి పూర్తిగా కొట్టుకుపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షాలు కురిసి 5 రోజులు గడిచినా అధికారులు తమను పట్టించుకున్న పాపాన పోలేదని రైతులు అసహనం వ్యక్తం చేశారు. వరద కొట్టుడుకు విద్యుత్ వైర్లు తెగిపోయినట్లు సైతం రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వం నష్టపరిహారంతో పాటు పొలంలోకి వచ్చిన ఇసుక మేటలను తొలగించేందుకు , కూడుకుపోయిన బావుల్లో పూటిక మట్టి తీసేందుకు ఆర్థిక సహాయం అందజేయాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గతంలో ఇదేవిధంగా గొలుసుకట్టు కాలువ తెగిపోవడంతో రూ.1.50 లక్షలు అప్పు చేసామని రైతులు తెలిపారు. నష్టపోయిన తమ పంట చేన్లను అధికారులు పరిశీలించి పరిహారం అందజేయాలని రైతులు వేడుకుంటున్నారు.

## నూతన అధ్యక్షడిగా.. డా.కిషన్ ఎన్నిక



ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లోని వి కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించిన 9వ రాష్ట్ర ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) వైద్య సదస్సు ఘనంగా ముగిసింది. ఈ సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు, వైద్య విధ్యార్థులు హాజరయ్యారు. వివిధ వైద్య అంశాలపై విశేషమైన సైంటిఫిక్ సెషన్లు నిర్వహించినట్లు సైంటిఫిక్ ఇంచార్జి డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. ముఖ్య అతిధిలుగా రాష్ట్ర ఐఎంఏ మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం హాజరై మాట్లాడారు. సమాజ అభ్యున్నతికి వైద్యులు అందిస్తున్న సేవలు అపూర్వమైనవని కొనియాడారు. ఈ సదస్సుకు కరీంనగర్ ఆతిధ్యమివ్వడం జిల్లాకు గర్వకారణమన్నారు. వైద్యులు సేవాభావం, నైతికతను కాపాడుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డాక్టర్లు నిషిత్, వసంతకుమారి, రమేష్, రిషిత్, రోహన్, ప్రదీప్, కిరణ్‌లు వివిధ వైద్య సేవల విస్తరణ పద్దతులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఐఎంఏ రాష్ట్ర నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించింది. రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ కిషన్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎంఎల్ఎన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. విశిష్ట అతిధులుగా ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ భానుశాలి హాజరయ్యారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ద్వారకానాథ్, ఆర్గనైజింగ్ కోశాధికారి డాక్టర్ విజయ్, ఐఎంఏ అధ్యక్షురాలు డా.ఆకుల శైలజ, కార్యదర్శి డా.మహేష్‌బాబు, సీనియర్ వైద్యులు డాక్టర్లు సూర్యనారాయణ రెడ్డి, భాగ్యరెడ్డిలు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. సదస్సుకు 900 మందికి పైగా హాజరైనట్లు కరీంనగర్ ఐఎంఏ కోశాధికారి డా.నీలిమ తెలిపారు.

# అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో కర్ర రాజశేఖర్ ప్యానెల్ విజయం



**ఫలితాలు వెల్లడించిన ఎన్నికల అధికారి**
**వెలిచాల మద్దతిచ్చిన ప్యానెల్ ఓటమిపాలు**
**నేడు అర్బన్ బ్యాంకు అధ్యక్ష, ఉపాధ్యక్షుడి ఎన్నిక**

ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్ ప్యానెల్ ఘన విజయం సాధించింది. శనివారం పోలింగ్ అనంతరం సాయంత్రం నుంచి ప్రారంభమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆదివారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. ఎనిమిదేళ్ల తర్వాత జరిగిన అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఈ సారి పెద్ద ఎత్తున అభ్యర్థులు పోటీలో నిలిచారు. సాధారణ ఎన్నికలను తలపించిన ఈ ఎన్నికల్లో మూడు ప్యానెల్లతో బరిలో నిలిచి తీవ్ర పోటీ మధ్య తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. కరీంనగర్, జగిత్యాలకు సంబంధించి మొత్తం 9278 మంది ఓటర్లకు గాను కేవలం 4112 మంది ఓటర్లు మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్ నగరంలో 7272 మంది సభ్యులు ఉండగా 3332 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జగిత్యాలలో 2015 మంది సభ్యులకు గాను 780 మంది మాత్రమే పోలింగ్‌లో పాల్గొన్నారు. 12 డైరెక్టర్ స్థానాలకు గాను 54 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. 12 మందిలో 9 జనరల్ కేటగిరీ, ఇద్దరు మహిళలు, ఒకరు ఎస్సీ ఎస్టీ కేటగిరీ నుంచి ఎన్నికవుతారు. జనరల్ కేటగిరీలోని 9 డైరెక్టర్ స్థానాలకు 41 మంది పోటీ చేస్తుండగా మహిళా కేటగిరీలో 5 గురు పోటీ చేశారు. ఎస్సీ ఎస్టీ కేటగిరీ నుంచి ఒక స్థానానికి 8 మంది పోటీ చేశారు. జనరల్, మహిళా, ఎస్సీ ఎస్టీల నుంచి మూడు బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలు జరిగాయి. కాగా ఫలితాలు వెలువడేసరికి కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్ ప్యానెల్‌లో 12 మంది అభ్యర్థులు డైరెక్టర్ల స్థానానికి పోటీ చేయగా 9 మంది విజయం సాధించారు. అందులో ఇద్దరు మహిళా కేటగిరీతో పాటు ఎస్సీ కేటగిరీ నుంచి కర్ర ప్యానెల్ విజయం సాధించడం విశేషం. వీరి ప్యానెల్ నుంచి డైరెక్టర్లుగా కర్ర రాజశేఖర్ 1959 ఓట్లు పొందారు. బొమ్మరాతి సాయికృష్ణ (1292), దేశ వేదాద్రి (1245), బాశెట్టి కిషన్ (1119), బండి ప్రశాంత్ దీపక్(1035), తాడవీరారెడ్డి( 987), మహిళా కేటగిరీలో వరాల జ్యోతి(2119), ముద్దసాని శ్వేత (1750), ఎస్సీ ఎస్టీ కేటగిరీలో సరిళ్ల రత్తన్ రాజు (856) ఓట్లు సాధించి గెలుపొందారు. కాంగ్రెస్ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు మద్దతిచ్చిన ప్యానెల్‌లో కేవలం ఇద్దరు మాత్రమే గెలుపొందారు. అందులో అనరాసు కుమార్ (1015), ఉయ్యాల ఆనందం(919), ఇండిపెండెంట్‌గా కన్న సాయి (1220) ఓట్లతో గెలుపొందారు. కాగా డైరెక్టర్లుగా గెలుపొందిన వారిలో ఏడుగురి మద్దతుతో చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. సోమవారం కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు నూతన పాలకవర్గంలో అధ్యక్ష, ఉపాధ్యక్షుని పదవులకు (ఆఫీస్ బేరర్స్) ఎన్నికల షెడ్యూల్‌ను జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ విడుదల చేశారు. రహస్య ఓటింగ్ ద్వారా ఎన్నిక పద్దతి ఉంటుందని పేర్కొన్నారు. అధ్యక్ష ఉపాధ్యక్షుని పదవులకు నామినేషన్లు స్వీకరించి పరిశీలన, ఉపసంహరణ తదుపరి పోటీలో ఉన్నఅభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తారని తెలిపారు. మద్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరిపి సాయంత్రం 5.30 గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుందని, అనంతరం ఎన్నికల ఫలితాలు ప్రకటించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

### నైతిక విజయం మా ప్యానెల్‌దే

**కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు**

అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో నైతిక విజయం తమ ప్యానెల్ దేనని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు. కొత్తపల్లిలోని వెలిచాల ప్రజాకార్యాలయంలో ఆదివారం వెలిచాల రాజేందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ కర్ర రాజశేఖర్ ప్యానెల్ బిఆర్ఎస్, బిజెపితో అపవిత్ర పొత్తు పెట్టుకున్నారని ఆరోపించారు. కొద్ది ఓట్ల తేడాతోనే తమ ప్యానెల్ అభ్యర్థులు ఓడిపోయారని తెలిపారు. అనైతిక చర్యలతోనే కర్ర రాజశేఖర ప్యానెల్ గెలుపొందిందని పేర్కొన్నారు. కర్ర రాజశేఖర్ వ్యవహారంపై అధిష్టానం పెద్దలకు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. నూతన పాలకవర్గం ఇకపై ఎలాంటి అవినీతి అక్రమాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక పార్టీ బలోపేతంతో పాటు రాబోయే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్యానెల్ నుంచి గెలిచిన డైరెక్టర్లు ఉయ్యాల ఆనందం, అనరాసు కుమార్‌కు శాలువాలు కప్పి వెలిచాల రాజేందర్‌రావు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో నూతన అర్బన్ బ్యాంకు డైరెక్టర్లు ఉయ్యాల ఆనందం, అనరాసు కుమార్, కాంగ్రెస్ నాయకులు చిందం శ్రీనివాస్, తాండ్ర శంకర్, ఎంఏ కరీం, కాసారపు కిరణ్, గండి గణేష్, రమేష్ తదితరులున్నారు.



# రీల్

## 'కన్నాదిలి కలనాదిలి' పాట విడుదల



అల్లరి నరేష్ హెర్రా థ్రిల్లర్ '12ఏ రైల్వే కాలనీ' నవంబర్ 21న థియేటర్లలో విడుదల కానుంది. నూతన దర్శకుడు నాని కాసరగడ్డ దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. పవన్ కుమార్ సమర్పణలో పోలిమేర సిరీస్‌తో పాపులరైన డాక్టర్ అనిల్ విశ్వనాథ్ ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ రాశారు. మ్యూజిక్ ప్రమోషన్లను ప్రారంభించడానికి మేకర్స్ ఫస్ట్ సింగిల్ 'కన్నాదిలి కలనాదిలి'పాటను విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ ట్రాక్ లవ్ ఫీలింగ్‌ని అందంగా హైలైట్ చేస్తుంది. భీమ్స్ సాఫ్ట్ కంపోజింగ్ ఇలో అందరికిని అలరిస్తోంది. హేషమ్ అబ్దుల్ వహాబ్ వోకల్స్ ఈ పాట అదనపు ఆకర్షణ తీసుకొచ్చింది. ఆయన వాయిస్ మ్యాజిక్‌లా వుంది. దేవ్ పవార్ సాహిత్యం అందించారు. అల్లరి నరేష్, డాక్టర్ కామాక్షి భాస్కర్ల మధ్య కెమిస్ట్రీ లవ్లీగా వుంది. విజువల్స్ చాలా ప్లజెంట్‌గా వున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్లు సినిమాపై అంచనాలు పెంచాయి. 12ఏ రైల్వే కాలనీని ఎమోషన్స్, ప్రేమ, థ్రిల్ ఎలిమెంట్స్ తో మంచి సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది.



## ఆంధ్రా కింగ్ తాలుకా షూటింగ్ పూర్తి

రామ్ పోతినేని హీరోగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా మహేష్ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం ఆంధ్రా కింగ్ తాలుకా. కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా సినిమా యూనిట్ సభ్యులు అందరూ కలిసి కేక్ కట్ చేశారు. సినిమా ఇండస్ట్రీ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఉపేంద్ర స్టార్ డమ్ ఉన్న ఫిల్మ్ స్టార్‌గా నటిస్తున్నారు. ఈ స్టార్ హీరోకు అభిమానిగా రామ్ పోతినేని నటిస్తున్నారు. చిత్రంలోని ప్రధాన తారాగణంపై చిత్రీకరించిన సన్నివేశాలతో షూటింగ్ పూర్తయింది. ఎంటర్టైన్మెంట్, యాక్షన్ నేపథ్యంలో సాగే ఈ సినిమాను నవంబర్ 28న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఈ నిర్మిస్తున్నారు.

## ఈ సినిమా ఖర్చు చూస్తే భయం పుట్టేది

రాజశేఖర్



శర్వానంద్ హీరోగా నటిస్తున్న బైకర్ సినిమా షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని యువి క్రియేషన్స్ నిర్మించింది. ఇటీవలే శర్వా స్పోర్ట్స్ గేర్‌తో బైకర్ అవతార్‌లో ఉన్నట్లు చూపించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. శర్వా జిమ్ స్టిల్స్ కూడా వైరల్ అయ్యాయి. సినిమా ఫస్ట్ ల్యాప్ గ్లింప్స్‌ను లాంచ్ చేశారు. ఇక్కడ ప్రతి బైకర్‌కి ఒక కథ ఉంటుంది. సమయంతో పోరాడే కథ. చావుకి ఎదురెళ్ళే కథ. ఏం జరిగినా పట్టువదలని మొండివాళ్ళ కథ' అనే పవర్ ఫుల్ వాయిస్ ఓవర్‌తో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. ఈ లైన్స్ బైకర్ లైఫ్ స్టయిల్, ప్రమాదాలు, పోరాటాలని అద్భుతంగా ప్రజెంట్ చేశాయి. గ్లింప్స్ అద్భుతమైన స్టంట్లతో ఆకట్టుకుంటుంది. 'ఇక్కడ గెలవడం గొప్పకాదు. చివరిదాక పోరాటం గొప్ప' అనే లైన్ ఈ సినిమా స్పిరిట్‌ను పర్ఫెక్ట్‌గా చూపించింది. 'బైకర్' డిసెంబర్ 6న చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ హీరోతో పాటు మంచి క్యారెక్టర్స్ కూడా చేయాలి అని నిర్ణయించుకున్న తర్వాత చాలా కథలు విన్నాను. అందులో చాలా వరకు నాకు నచ్చేవి కాదు. మంచి సబ్జెక్ట్ రాలేదనే నిరాశ ఉండేది. అలాంటి సమయంలో డైరెక్టర్ అభి వచ్చారు. బైకర్ స్టోరీ చెప్పారు. అద్భుతమైన సబ్జెక్టు. ఈ సినిమా చేస్తే మంచి పేరు వస్తుందని ఒప్పుకున్నాను. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. అభి ప్రతి ఫ్రేమ్‌ని అద్భుతంగా డిజైన్ చేశారు. ప్రతిరోజు చాలా ఎంజాయ్ చేశాను. ఈ సినిమాకి అయిన ఖర్చు చూస్తే నాకు భయం పుట్టేది. కానీ వంశీ ఎప్పుడు చాలా కూల్‌గా ఉండేవారు. శర్వా చాలా కోపరేటివ్. చాలా రెస్పెక్ట్ ఫుల్. ఈ సినిమా డబ్బింగ్ చూసి శర్వా నా దగ్గరకు వచ్చి 'రాజశేఖర్ మీరు చాలా అద్భుతంగా చేశారు. మీరు ఈ క్యారెక్టర్ చేసినందుకు థాంక్స్' అని చెప్పారు. అది నాకు పెద్ద అవార్డుతో సమానం. బైకర్ సినిమా మీరు చూడండి. చాలా గ్రేట్ ఎక్స్‌పీరియన్స్ ఉంటుంది. ఈ కార్యక్రమంలో హీరో శర్వానంద్, డైరెక్టర్ అభిలాష్ రెడ్డి కంకర, డిఓపి యువ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 'జటాధర' ప్రీ రిలీజ్

సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్నసూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. ఈ చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింఘాల్, నిఖిల్ నందా నిర్మించారు. ఈ చిత్రంలో శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషించారు. జటాధర ఈనెల 7న హిందీ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ.. కృష్ణ గారి అల్లుడు, మహేష్ బావగానే ప్రయత్నాలు మొదలు పెట్టాను. ఎంతోమంది నిర్మాతలను కలిసాను. అడిషన్స్ ఇచ్చాను. యాక్షన్ వీడియోలు పట్టుకుని ప్రతి ఆఫీస్‌కి తిరిగాను. నాకు దొరికింది ఒక ఎక్స్ట్రాగా ఒక కాఫీ మాత్రమే. అంతకుమించి నేను ఏది కూడా అడ్వాంటేజ్ తీసుకోలేదు. జటాధర నేను చేసిన 20 సినిమాల్లో ది బెస్ట్ స్క్రిప్ట్. సినిమా చూస్తున్నప్పుడు మీకే అర్థమవుతుంది. ఇప్పటివరకు తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఇలాంటి క్యారెక్టర్ ఏ హీరో చేయలేదు. ఘోస్ట్ హంటర్ క్యారెక్టర్‌లో కనిపిస్తాను. కాకపోతే దెయ్యాలపై తనకి నమ్మకం ఉండదు. సినిమా చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. ధనపిశాచి బ్యాక్‌గ్రౌండ్ తీసుకుని డైరెక్టర్ వెంకట్ చాలా అద్భుతంగా ఈ సినిమాను తీశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శైలేష్ కొలను, ప్రొడ్యూసర్ శివిన్, నిర్మాత ప్రేరణ అరోరా, డైరెక్టర్ యదువంశీ, ప్రొడ్యూసర్ విష్ణువర్ధన్, మ్యూజిక్ డైరెక్టర్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.




## 'రోలుగుంట సూరి' ఫస్ట్ లుక్



విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న రియలిస్టిక్ ఎమోషనల్ డ్రామా 'రోలుగుంట సూరి' ఫస్ట్ లుక్ పోస్టర్ను ప్రముఖ నటుడు 'నటకిరీటి' రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. అనిల్ కుమార్ పల్లా దర్శకత్వంలో నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలిపి హీరోహీరోయిన్లుగా తపస్వీ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై సౌమ్య చాందిని పల్లా నిర్మిస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్ను ఆవిష్కరించిన అనంతరం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి సినిమాలు సైలెంట్గా వచ్చి పెద్ద సంచలనం సృష్టిస్తాయి. దర్శకుడు అనిల్ కుమార్ పల్లా హృదయాన్ని తాకే సబ్జెక్ట్‌ను చాలా అద్భుతంగా తెరపైకి తీసుకొస్తున్నారు. ఫస్ట్ లుక్ చాలా ఇంప్రెస్ చేసింది. సినిమా కూడా అలాగే అద్భుతంగా ఉండబోతోందనే నమ్మకం ఉంది, చిత్రయూనిట్కు అభినందనలు అని అన్నారు.నిర్మాత సౌమ్య చాందిని పల్లా మాట్లాడుతూ 'రోలుగుంట సూరి' ఒక రియలిస్టిక్ విలేజ్ డ్రామా. భావోద్వేగాలతో, జీవిత సత్యాలతో మిళితమైన ఈ కథ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. మా టీమ్లో ప్రతి ఒక్కరు అద్భుతంగా తమ ప్రతిభను చూపుతున్నారు. ఈ సినిమా తెలుగు సినీ చరిత్రలో నిలిచిపోయేలా అవుతుందనే నమ్మకం మాకు ఉంది, అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు అనిల్ కుమార్ పల్లా తదితరులు పాల్గొన్నారు.

## 'అఫ్రో టపాంగ్' పాట విడుదల




కరుణాడ చక్రవర్తి శివ రాజ్ కుమార్, రియల్ స్టార్ ఉపేంద్ర, రాజ్ బి శెట్టి వంటి అగ్ర నటులతో అర్జున్ జన్య తెరకెక్కిస్తున్న చిత్రం '45 ది మూవీ'. ఈ మూవీని సూరజ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద శ్రీమతి ఉమా రమేష్ రెడ్డి, ఎం రమేష్ రెడ్డి భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు ఈసినిమా నుంచి వచ్చిన పోస్టర్, గ్లింప్స్ అన్నీ కూడా ఆడియెన్స్‌లో భారీ హైప్‌ను పెంచేశాయి. ఈ చిత్రాన్ని డిసెంబర్ 25న విడుదల చేయబోతోన్నట్టుగా మేకర్లు ప్రకటించారు. ఇక తాజాగా ఈ చిత్రం ఓ క్రేజీ సాంగ్‌ను చిత్రయూనిట్ రిలీజ్ చేసింది. 'గెలుపు తలుపు దొరికే వరకు దిగులుపడకురా' అంటూ సాగే ఈ క్రేజీ సాంగ్‌కు రోల్ రైడా తెలుగులో సాహిత్యాన్ని అందించారు. రోల్ రైడా, వినాయక్ కలిసి ఆలపించిన ఈ పాటకు జానీ మాస్టర్ క్రేజీ స్టెప్పుల్ని కంపోజ్ చేశారు. ఈ వీడియో సాంగ్‌లోని వాతావరణం, చుట్టూ కనిపిస్తున్న ఆ ఆఫ్రికన్స్ వారితో జానీ మాస్టర్ వేయించిన స్టెప్పులు అదిరిపోయాయి. ఇక ఈ పాటలో శివ రాజ్ కుమార్, ఉపేంద్ర, రాజ్ బి శెట్టి క్రేజీగా కనిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ పాట యూత్‌ను అయితే తెగ ఆకట్టుకునేలా కనిపిస్తోంది.

## 'ఆహా తెలుగు ఇండియన్ ఐడల్'షో సీజన్ 4 విజేతగా బృంద




తెలుగులో అతి పెద్ద సింగింగ్ షో ఆహా ఓటీటీ తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ 4 సక్సెస్ ఫుల్‌గా ఫినాలే జరుపుకుంది. ఈ గ్రాండ్ ఫినాలేకు మాస్ మహారాజ రవితేజ స్పెషల్ గెస్ట్‌గా హాజరవడం విశేషం. ఎనర్జీ, ఎమోషన్, ఎంటర్ టైన్ మెంట్ తో సాగిన ఈ గ్రాండ్ ఫినాలేలో బృంద విజేతగా నిలిచింది. పవన్ కల్యాణ్ రన్నరప్‌గా నిలిచారు. జడ్జిలుగా వ్యవహరిస్తున్న మ్యూజిక్ డైరెక్టర్ తమన్, గాయకులు కార్తీక్, గీతా మాధురి తెలుగు ఇండియన్ ఐడల్ షో సీజన్ 4 గ్రాండ్ ఫినాలే విన్నర్ ట్రోఫీని బృందాకు అందజేశారు. తెలుగు ఇండియన్ ఐడల్ షో సీజన్ 4 గ్రాండ్ ఫినాలే విన్నర్‌గా నిలిచిన బృంద తన నెక్ట్ మూవీలో పాట పాడుతుందని ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ తమన్ అనౌన్స్ చేశారు. సింగర్‌గా బృంద కెరీర్ ఆరంభంలోనే ఇదొక బిగ్ స్టెప్ కానుంది. తెలుగు మ్యూజిక్ టాలెంట్‌కు గుర్తింపు తీసుకురావడంలో తెలుగు ఇండియన్ ఐడల్ షో గొప్ప కృషి చేస్తోంది. గత నాలుగు సీజన్స్‌గా ఎంతోమంది యంగ్ అండ్ టాలెంటెడ్ సింగర్స్‌ను ప్రపంచానికి ఈ షో పరిచయం చేసింది.



## నవీన్ యాదవ్‌కు మద్దతుగా కోట నీలిమ ప్రచారం

ప్రజాపక్షం/ఖైరతాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి వి.నవీన్ యాదవ్‌కు మద్దతుగా సోమాజిగూడ డివిజన్ లోని ఎల్లారెడ్డి గూడలో పిసిసి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కోట నీలిమ ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా తొలుత దుర్గాదేవి ఆలయంలో నవీన్ యాదవ్ గెలవాలని ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ వర్షం కురుస్తున్నా ప్రచారం చేస్తూ ముందుకు కదిలారు. సిఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం ఈ రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను స్థానికులకు, అపార్టుమెంట్ వాసులకు, వ్యాపారులకు నీలిమ వివరించారు. గత ప్రభుత్వం పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని, అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తం అయ్యాయని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాటను ప్రజా ప్రభుత్వం ఒక్కొక్కటిగా నిలుపుకొంటున్నదని, ఇంకా చేయాల్సింది చాలా ఉందని, ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో 60వ ఐజిఎఫ్ఆర్ వరల్డ్ గోల్ఫ్ ఛాంపియన్ షిప్

### తొలిసారి ఆతిథ్యమిస్తున్న భారత్





ప్రజాపక్షం/హైదరాబాద్: గోల్ఫ్‌కు చిరునామాగా మారుతున్న హైదరాబాద్ మరో అతి పెద్ద టోర్నీకి వేదికైంది. తొలిసారి భారత్ ఆతిథ్యమిస్తున్న ప్రతిష్టాత్మక 60వ ఐజిఎఫ్ఆర్ వరల్డ్ గోల్ఫ్ ఛాంపియన్ షిప్ ను తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. వారం రోజుల పాటు జరిగే ఈ ఛాంపియన్ షిప్‌లో 24 దేశాలకు చెందిన 180మంది రోటరీ గోల్ఫ్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. పలు సేవాకార్యక్రమాలను నిర్వహించే రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ గోల్ఫింగ్ ఫెలోషిప్ ఆఫ్ రోటారియన్స్ (ఐజిఎఫ్ఆర్) సహకారంతో ప్రసూతి, శిశు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతీ ఏడాదీ దీనిని నిర్వహిస్తోంది. హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్, బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ కంట్రీ క్లబ్, వూటీ గోల్ఫ్ కౌంటీలలో ఈ ఛాంపియన్ షిప్ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా కేవలం గోల్ఫ్ క్రీడ ప్రమోషన్ కోసమే కాకుండా మన దేశంలోని పర్యాటక ప్రాంతాల ప్రత్యేకతలు, ఆతిథ్యం వంటి వాటిని విదేశీ గోల్ఫర్లకు అందించడమే లక్ష్యంగా ఉండబోతోంది. హైదరాబాద్‌లో అద్భుతమైన ఫలఖ్ నామా ప్యాలెస్, గోల్కొండ ఫోర్ట్ వంటి టూరిజం స్పాట్స్‌నూ ఈ ఛాంపియన్ షిప్‌లో భాగం చేశారు. టోర్నీలో ఆడుతున్న గోల్ఫర్లకు ఈ పర్యాటక ప్రాంతాల ప్రత్యేకతలను వివరిస్తూ సందర్శన ఏర్పాటు చేయనున్నారు. 60వ ఐజిఎఫ్ఆర్ వరల్డ్ గోల్ఫ్ ఛాంపియన్ షిప్ ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు దీనిలో పాల్గొంటున్న గోల్ఫర్లకు అభినందనలు తెలిపారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఇంత పెద్ద అంతర్జాతీయ గోల్ఫ్ ఈవెంట్‌కు ఆతిథ్యమిచ్చే అవకాశం తెలంగాణకు రావడం గర్వంగా భావిస్తున్నట్టు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం తరపున టూరిజం శాఖ మంత్రిగా ఎటువంటి మద్ధతు కావాలన్నా అందిస్తామని తెలిపారు. ప్రపంచంలోనే అత్యుత్తమ గోల్ఫ్ కోర్సులు హైదరాబాద్‌లో ఉండడం, వాటిలోనే ఈ అతిపెద్ద టోర్నీ జరుగుతుండడం సంతోషంగా ఉందని మంత్రి జూపల్లి చెప్పారు. టూరిజం అభివృద్ధి క్రీడలతోనూ ముడిపడి ఉందని, ముఖ్యంగా విదేశీ పర్యాటకలకు అద్భుతమైన ఆతిథ్యం ఇవ్వడం తమ బాధ్యతగా చెప్పుకొచ్చారు. ఈ ఛాంపియన్ షిప్‌లో పాల్గొనడానికి వచ్చిన క్రీడాకారులు హైదరాబాద్ ఆతిథ్యం స్వీకరించడమే కాకుండా ప్రముఖ పర్యాటక ప్రాంతాలను ప్రత్యేకంగా వీక్షించాలని కోరారు. ప్రభుత్వం తరపున వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని, ప్రపంచ టూరిజంలో హైదరాబాద్‌కు ఈ టోర్నీ ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తుందని ఆకాంక్షించారు.




## 'సర్'పై సుప్రీంకు

(మొదటి పేజీ తరువాయి)



ఉపసంహరించుకోవాలని అఖిలపక్ష సమావేశం ఇసిఐకి విజ్ఞప్తి చేసింది. 'ఇసిఐ తన నోటిఫికేషన్‌లోని లోపాలను సరిదిద్దాలి, సుప్రీం కోర్టు మార్గదర్శకాలను స్పష్టంగా పాటించాలి. ఈ ప్రక్రియకు తగిన సమయం ఇవ్వాలి. 2026 ఎన్నికల తర్వాత మాత్రమే సర్‌ను నిర్వహించాలి. పూర్తిగా నిష్పాక్షికంగా, స్వతంత్రంగా జరగాలని తీర్మానం పేర్కొంది. రాజకీయ పార్టీలు లేవనెత్తిన ఆందోళనలను ఇసిఐ అంగీకరించకపోవడంతో తమిళనాడు ఓటర్లందరి ఓటు హక్కులను కాపాడటానికి ఎస్‌సిని సంప్రదించడం తప్ప వేరే మార్గం లేదని కూడా తీర్మానంలో పేర్కొంది. అందువల్ల, తమిళనాడులోని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ఎస్‌సి ముందు సంయుక్తంగా పిటిషన్ దాఖలు చేయాలని అఖిలపక్ష సమావేశం నిర్ణయించింది. డిఎంకె ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి డిఎంకె కూటమి పార్టీలు సహా 49 రాజకీయ పార్టీలు హాజరయ్యాయి. ఈ సమావేశాన్ని బహిష్కరించిన పార్టీలలో పట్టాలి మక్కల్ కట్చి, తమిళ మానిల కాంగ్రెస్, ఎఎంఎంకె, నామ్ తమిళర్ కట్చి, పుతియా తమిజగం, ఇండియా జననయ కట్చి, పెరుంతలైవర్ మక్కల్ కట్చి ఉన్నాయి.

## విద్యార్థినుల మెరుపు ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ప్రభుత్వం నుండి గురుకుల కళాశాలకు వచ్చిన నిత్యావసర సరుకులను మూటలు కట్టి వాహనాల్లో తరలిస్తూ తమ నోళ్లు కొడుతున్నారని మండిపడ్డారు. గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శైలజకు అధ్యాపకులు తోడు కావడంతో అదే అదునుగా భావించి అందినకాడికి దోచేసుకుంటున్నారని వివరించారు. వివాహం అయిన విద్యార్థినీల నుండి అక్రమంగా డబ్బులు వసూళ్లు చేయించడం, కట్నం ఎంత ఇచ్చారో అందులో నుండి సగం డబ్బులు తనకు ఇవ్వాలని అనేక ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రిన్సిపల్‌కు మిగత అధ్యాపకులు అండగా ఉంటటంతో వారి ద్వారా విద్యార్థినీల నుండి డబ్బులు ఆన్ లైన్ ద్వారా వేయించుకొని ప్రిన్సిపల్ శైలజ తీసుకుంటుందని వివరించారు. ధర్నా చేస్తున్న విద్యార్థినీలకు పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు యత్నించిన మహిళా కానిస్టేబుల్ జ్యోత్స్నపై డిగ్రీ కళాశాల విద్యార్థినీలు ఎదురుతిరిగారు. మా సమస్యకు పరిష్కారం లభిస్తుందని ధర్నాకు వస్తే తమపై పోలీసులు దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. విద్యార్థినీలు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నేతలు, రాజకీయ పార్టీల నేతలు మద్దతు ఇచ్చేందుకు వస్తే మాకు ఎవరి మద్దతు అవసరం లేదని, తమ సమస్యలను తామే పరిష్కరించుకుంటామని విద్యార్థినీలు తేల్చి చెప్పడంతో వారు అక్కడి నుండి వెళ్ళిపోయారు. సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో తాము ఎన్నో అవస్థలు ఎదుర్కొంటున్నామని, ఎన్నిమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు.

### విద్యార్థినీనులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

గురుకుల కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్న విషయాన్ని గమనించిన షాద్‌నగర్ పట్టణ సిఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని విద్యార్థినీలకు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మిగతా విద్యార్థినీలు సైతం పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని అదుపులోకి తీసుకున్న విద్యార్థినీలకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆగ్రహంతో ఉన్న విద్యార్థినీను సిఐ విజయ్‌కుమార్ శాంతింపజేశారు. కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలే తప్పా ఇలా రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తే శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉంటుందని, విద్యార్థినీలు గమనించాలని సూచించారు. అక్కడి నుండి గురుకుల కళాశాలకు పంపించారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com